మే
2015

109

సంపుటి : 10 సంచిక : 1 వెల రు. 10/-

ఈ సంచికలో........


1. విలక్షణ ప్రజా నేత నర్రా రాఘవరెడ్డి
2. పార్టీ స్వతంత్ర శక్తిని పెంచుకోవడం ద్వారానే వామపక్ష ప్రజాతంత్ర సంఘటనను నిర్మించగలం
3. కార్పొరేట్, మతోన్మాద శక్తుల పాలనకు వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయం
4. కార్మిక చట్టాల సవరణలు, పూర్వ రంగం... కార్మికులపై ప్రభావం
5. సభ్యులకు బీమా సౌకర్యమంటే ఏమిటి?
6.స్ఫూర్తినింపిన విశాఖ మహాసభలు
7. భూ దోపిడీకి తహతహలాడుతున్న ఎన్‌డిఎ ప్రభుత్వం
8. వ్యవసాయం పట్ల వ్యవహరించాల్సిన తీరు ఇదేనా?
9. ప్రభుత్వ నిధులతో నయా ఉదారవాద ఎజెండా అమలు

**నివాళి**

# విలక్షణ ప్రజానేత నర్రా రాఘవరెడ్డి

యు. రామకృష్ణ

**తా**ను జన్మించిన పదకొండో రోజే కన్నుమూసింది తల్లి. నెలరోజుల లోపలే మరో పెళ్లి చేసుకున్నాడు తండ్రి. దీంతో పెదనాన్న జాలితో పిల్లవాడిని పెంచుకోవడం ప్రారంభించాడు. ఆయన కూడా కొంతకాలానికి అనారోగ్యం పాలై, మంచం పట్టి చనిపోయాడు. దాంతో ఆ బాలుని జీవితం తాడు తెగిన గాలిపటంగా మారింది. పెదనాన్న చదివించిన నాలుగు అక్షరం ముక్కలు తప్ప అతడు పెద్దగా చదువుకోలేదు. ఆ బిడ్డ ఏ దారీ కానరాక బర్రెలు కాశాడు. తనను ఆదరించేవారు లేక ఇల్లు విడిచి బొంబాయి చేరుకొని హెూటల్ సర్వర్‌గానూ, నూలు మిల్లులో కార్మికుడుగానూ పనిచేశాడు. యజమాని శ్రమదోపిడీకి వ్యతిరేకంగా అక్కడే కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘమైన కార్మిక యూనియన్ 'లాల్ బావుటా'లో చేరి పనిచేశాడు. ఎనిమిదేళ్ల అనంతరం సొంతూరికి తిరిగివచ్చిన ఆ యువకుడు కమ్యూనిస్టు పార్టీలో చేరి, కళాకారుడుగా పనిచేశాడు. రాజకీయ తత్వశాస్త్రం చదవకపోయినా, సమాజమనే విశ్వ విద్యాలయంలో ప్రజలను చదివాడు. కనుకనే గ్రామ సర్పంచ్ పదవి నుంచి సిపిఎం శాసన సభా పక్ష నేత స్థాయి వరకూ బాధ్యతలను విలక్షణంగా నిర్వహించి పార్టీకి ఎనలేని ప్రతిష్ట తెచ్చిపెట్టాడు. ఆయనే కామ్రేడ్ నర్రా రాఘవ రెడ్డి. ఇటీవలనే ఆ విలక్షణ నేత కన్నుమూశారు.



నర్రా రాఘవరెడ్డి 1924లో నల్గొండ జిల్లా చిట్యాల సమీపానగల వట్టిమర్తి గ్రామంలో కనకమ్మ, రాంరెడ్డి దంపతులకు జన్మించాడు. అనారోగ్యం పాలైన తల్లి కనకమ్మకు సరైన వైద్యమందక, నాటు వైద్యం వికటించి రాఘవరెడ్డికి జన్మనిచ్చిన పదకొండో రోజునే కన్నుమూసింది. రాఘవరెడ్డిని పెదనాన్న వెంకట్రాంరెడ్డి తన ఇంటికి తీసుకువెళ్లాడు. బిడ్డల్లేని వెంకట్రాంరెడ్డి దంపతులు రాఘవరెడ్డిని అపరూపంగా చూసుకునేవారు. రాఘవరెడ్డికి బడి ఈడు వచ్చింది. ఊళ్లో బడిలేదు. మూడు కిలోమీటర్ల దూరంలోని చిట్యాలలో ఉంది. అక్కడ వరకూ పంపడం ఇష్టం లేక సొంతూళ్లోనే ఉన్న ఓ ప్రయివేటు ఉపాధ్యాయుని వద్ద చేర్పించారు. ఆయన వద్ద రాఘవరెడ్డి వేమన, సుమతీ శతకాలనూ, పద్యాలనూ, నీతికథలనూ అభ్యసించాడు. నాలుగో తరగతిలోకి వచ్చాక చిట్యాల బడిలో చేర్పించారు. ఆరోజుల్లో పెత్తందార్ల మాటకు తిరుగుండేది కాదు. పదేళ్ల వయస్సులో ఉన్నా రాఘవ రెడ్డికి కుల వివక్ష గురించి అర్థమవుతుండేది. ఊళ్లో ఉన్న తన సొంత తండ్రి రాంరెడ్డి మాత్రం రాఘవరెడ్డిని పట్టించుకునేవాడు కాదు. భార్య చనిపోయిన నెల తిరక్కముందే మరో పెళ్లి చేసుకున్నాడు. కొడుకును పట్టించుకుంటే బరువు బాధ్యతలు మోయాల్సి వస్తుందనీ, రెండో భార్యతో గొడవ అవుతుందనీ అతడి యోగ క్షేమాలు పట్టించుకునేవాడు కాదు.

కొంతకాలానికి పెంపుడు తండ్రి వెంకట్రాంరెడ్డి ఆరోగ్యం క్షీణించింది. వృద్ధాప్యం వల్ల మంచాన పడ్డాడు. పెంపుడు తండ్రి చనిపోవడంతో రాఘవరెడ్డి బతుకు అంధకారమైంది. అందరూ తండ్రి దగ్గరకు వెళ్లమంటే వెళ్లాడు. కసురుకోవడం, చీదరింపులతో నరకం చూపేది సవతి తల్లి. నీకు తిండిపెట్టడమే ఎక్కువనుకుంటే ఇంకా చదువు కూడానా, బర్రెలు కాయి అన్నారు తండ్రీ, సవతి తల్లి. ఆ రోజు నుంచి బర్రెలు కాయడం, పొలం పనిచేయడం అతడికి నిత్యకృత్యమైంది. తరచూ తిట్టేవారు. ఈ పరిస్థితుల్లో తన దారి తానే వెతుక్కోవాలనుకున్నాడు రాఘవరెడ్డి. తనకు తానుగా బతకాలి. ఎక్కడికైనా వెళ్లిపోవాలి అనే ఆలోచన వచ్చింది. ఓ రోజు చిట్యాలకు పోయి మంచినూనె తెమ్మన్నారు. తనలాంటి వాడే అయిన బూరుగు రామచంద్రంతో కలిసి చిట్యాల వెళ్లాడు. నూనె తెమ్మని ఇచ్చిన డబ్బులతో రామచంద్రంతో కలిసి హైదరాబాద్ బస్సెక్కాడు. నగరంలో దిగిన వారికి.. హైదరాబాద్ ఓ కొత్తలోకంలా కనిపించింది. కాలినడకన వీధులన్నీ తిరిగారు. డబ్బు ఖర్చయిపోయింది. ఆకలేస్తోంది. నీడనిచ్చే వారేరీ? భోజనం పెట్టేవారేరీ?. తినడానికి తిండి దొరికేది హెూటల్ ఒక్కటే అనిపించింది. హెూటల్లో పనికి కుదిరారు. రోజంతా కప్పులు కడకడం, టేబుళ్లు తుడవడం పని. పాత జీవితం తలుచుకుని బాధపడేవాడు రాఘవరెడ్డి. కష్టమైనా సరే విలువగా బతికే మరో పని చూసుకోవాలనుకున్నాడు. రామచంద్రం తనతో రావడానికి సిద్ధపడలేదు. అటూఇటూ తిరిగి నాంపల్లి రైల్వే స్టేషనుకు చేరుకున్నాడు. స్టేషన్‌లో ఆగిఉన్న రైలు గురించి అక్కడ కనిపించిన పిల్లలను అడిగి తెలుసుకున్నాడు. అది బొంబాయి వెళ్తుందని చెప్పగానే చటుక్కున తమ ఊరి నుంచి బొంబాయి వలసెళ్లిన చేనేత కార్మికులు గుర్తొచ్చారు. వెంటనే టికెట్ లేకుండానే రైలెక్కి ఓ మూలన కూర్చున్నాడు. తెల్లారే సరికి రైలు బొంబాయి చేరింది. టికెట్ కలెక్టరు నుంచి ఎలాగో తప్పించుకొని బొంబాయిలో తన ఊరి వాళ్ల కోసం వీధివీధి తిరిగాడు. ఓ పోలీసు సాయంతో తమ ఊరికి చెందిన ఓ చేనేత కార్మికుడి ఇంటికి చేరుకోగలిగాడు.

ఆ చేనేత కార్మిక కుటుంబం ద్వారా తనకు తెలిసినవారందరి వద్దకూ వెళ్లి వివరాలు తెలుసుకున్నాడు. చివరికో పని దొరికింది. తిండిపెట్టి నెలకు రూపాయన్నర జీతం. తమ ఊరివాడే అయిన కొంపల్లి రామయ్యా, ఆతని భార్యా పూటకూళ్ళ ఇంటిని నిర్వహిస్తూ పదిమందికి వండిపెడుతున్నారు. వారింట్లోనే పనికి కుదిరాడు. ఏడాది తరువాత రామయ్య పూటకూళ్ళ పని మానేశాడు. అతడే రాఘవరెడ్డిని ఓ హెూటల్లో పనికి కుదిర్చాడు. ఇష్టం లేకపోయినా అందులో చేరాడు. అక్కడ విశ్రాంతి అన్నదే ఎరుగడు. పగలూ, రాత్రీ బండచాకిరీతో కాళ్ళూచేతులూ చెడిపోయాయి. ఓ నెల రోజులు గడిచాక ఉమ్మడి గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌కు చేరుకున్నాడు. బట్టల మిల్లులో చేరాలనుకున్నాడు. దానిలో చేరాలంటే ఆ వృత్తిపట్ల కాస్త అనుభవం ఉండాలి. అలా వృత్తి నేర్పే వ్యక్తులూ ఉన్నారు. ఒకరి దగ్గర ఈ పని నేర్చుకోవడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. తిండిపెట్టి పని నేర్చుకుంటూ రెండేళ్ళుతన దగ్గరే పనిచేసే షరతే ఆ ఒప్పందం. కండెలకు దారం అయిపోగానే ఊసలు ఏరుకొచ్చి ఒక దగ్గర కుప్పగా పోయేటమే రాఘవరెడ్డి పని. ఆ

(మిగతా 35వ పేజీలో)

# ఈ సంచికలో...

1. విలక్షణ ప్రజా నేత నర్రా రాఘవరెడ్డి
యు. రామకృష్ణ 2
2. పార్టీ స్వతంత్ర శక్తిని పెంచుకోవడం ద్వారానే వామపక్ష ప్రజాతంత్ర సంఘటనను నిర్మించగలం
సీతారాం ఏచూరి 4
3. కార్పొరేట్, మతోన్మాద శక్తుల పాలనకు వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయం
ప్రకాష్‌కరత్ 7
4. కార్మిక చట్టాల సవరణలు, పూర్వ రంగం... కార్మికులపై ప్రభావం
ఎం.ఎ.గఫూర్ 10
5. సభ్యులకు బీమా సౌకర్యమంటే ఏమిటి?
ఎస్.వీరయ్య 14
6. స్ఫూర్తినింపిన విశాఖ మహాసభలు
ఎస్.వెంకట్రావు 16
7. భూ దోపిడీకి తహతహలాడుతున్న ఎన్‌డిఎ ప్రభుత్వం
ఎస్.మల్లారెడ్డి 21
8. వ్యవసాయం పట్ల వ్యవహరించాల్సిన తీరు ఇదేనా?
జయతిఘోష్ 26
9. ప్రభుత్వ నిధులతో నయా ఉదారవాద ఎజెండా అమలు
సి.పి.చంద్రశేఖర్ 28
10. భూ సమీకరణ - గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం
కొండూరు వీరయ్య 32
11. సూర్జిత్ శత జయంతిపై మహాసభ తీర్మానం
36

**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్: ఎడిటోరియల్ 0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail: svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at : cpim.org

# వ్యవసాయ సంక్షోభం

ఇటీవల న్యూ ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రదర్శన సందర్భంగా పంజాబ్‌కు చెందిన 40 ఏళ్ల రైతు అందరి సమక్షంలో చెట్టుకు ఉరి వేసుకు చనిపోవడంతో దేశంలో వ్యవసాయ సంక్షోభం గురించిన చర్చ మరోసారి ముందుకొచ్చింది. నిజానికి గత రెండు దశాబ్దాలుగా ఈ దేశంలోని వ్యవసాయ రంగం నిత్య సంక్షోభంలో ఉంది. ఏటా లక్షల సంఖ్యలో రైతులు ప్రాణాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ క్రైమ్ బ్యూరో లెక్కల ప్రకారం గత పదేళ్ల కాలంలో 3 లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అంటే రోజుకు 80 మందికి పైగా గంటకు ముగ్గురు లేదా నలుగురు బలవన్మరణానికి గురవుతున్నారు. నిజానికి వ్యవసాయ సంక్షోభంలో చిక్కుకున్న రైతుల వెతలను ఈ సంఖ్యలు పాక్షికంగానే వివరిస్తాయి. లోతుగా వెళితేనే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది.

కానీ మన కార్పొరేట్ మీడియాకు ఈ సమస్య పట్టదు. ఆప్ సభలో రైతు ఆత్మహత్య లాంటివి జరిగినప్పుడు కొద్ది రోజులు హడావుడి చేసి ఊరుకుంటాయి. నిజానికి 60 శాతం ప్రజలు ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని పూర్తి స్థాయిలో కవర్ చేసే విలేకరులను మన కార్పొరేట్ మీడియా ఒక్కటీ నియమించలేదు. అదే ముంబయిలో లక్మే ఫ్యాషన్ పేరేడ్ జరిగితే కవర్ చేయడానికి వందలమంది విలేకరులు, ఫోటోగ్రాఫర్లు పడిగాపులు గాస్తారు. ఇక మన పాలకులు వ్యవసాయ సంక్షోభం ఉందంటేనే ఒప్పుకోరు. విచిత్రమేమంటే గద్దెమీద ఉన్నంతకాలం వారికి ఇది కనిపించదు. కానీ గద్దె దిగగానే కనిపిస్తుంది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు రాజశేఖర రెడ్డికీ, రాజశేఖర రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబుకూ వ్యవసాయ సంక్షోభం కనిపించాయి. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు అది కనిపించడంలేదు. రాజశేఖరరెడ్డి కుమారునికి కనిపిస్తోంది. ఇక్కడ సమస్య వ్యక్తులది కాదు. బూర్జువా-భూస్వామ్య పార్టీల వైఖరి అది. కేంద్రంలో గత రెండు దశాబ్దాలుగా అధికారం వెలగబెట్టిన యుపిఎ, ఎన్డీఎల వైఖరి కూడా అదే. మొన్నటి వరకు అధికారంలో ఉండి రైతులు ఉసురు తీసిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీకి ఇప్పుడు ఎక్కడ చూసినా రైతు ఆత్మహత్యలే కనిపిస్తున్నాయి.

వ్యవసాయ సంక్షోభం ఎందుకు వచ్చిందంటే పాలక పార్టీలు, వారి మీడియా నలుగురు గుడ్డివాళ్లు ఏనుగును వర్ణించినట్లు చెబుతారు. చిన్న కమతాలవల్ల రైతు చితికి పోతున్నాడని ఒకరంటే, గిట్టుబాటు ధరలు లేక వ్యవసాయం నాశనమవుతోందని మరొకరు చెబుతున్నారు. మరికొందరు పెట్టుబడిదారీ మేధావులు సమస్యను అంతర్జాతీయ మార్కెట్ల మీదికి నెట్టేస్తున్నారు. కానీ మన వ్యవసాయ సంక్షోభానికి మూలం మన పాలక వర్గాలు అనుసరిస్తున్న నయా-ఉదారవాద విధానాల్లో ఉన్నదని పాలక వర్గాలుగానీ, వారి మీడియా గానీ అంగీకరించవు. అలా అంగీకరిస్తే వారి నిజస్వరూపం బయటపడుతుంది. ప్రజలు వారి మౌలిక విధానాలనే ప్రశ్నిస్తారు. అలా జరిగితే వారి ప్రపంచం తల్లకిందులైపోతుంది.

అమెరికన్ సామ్రాజ్యవాదుల హుకుమ్‌లకు దాసోహమై మన పాలక వర్గాలు ఏనాడైతే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్లుటిఓ) నిబంధనల ఉరితాడును మన రైతు మెడకు బిగించారో ఆనాటి నుండే మన రైతు ఊపిరాడక చనిపోతున్నాడు. చిన్న రైతుకు ప్రాణప్రదమైన విత్తనాలు, ఎరువులు, పరపతి రంగం నుండి ప్రభుత్వం తప్పుకుని ప్రయివేటు వ్యాపారులకు వదిలిపెట్టాలి, సబ్సిడీలు, గిట్టుబాటు ధరలు తగ్గించి రైతును అంతర్జాతీయ మార్కెట్‌కు వదిలిపెట్టాలి అన్న డబ్ల్యుటిఓ ఉచ్చులో రైతును ఇరికించిన ఘనత కేంద్రంలో అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్, బిజెపీ ప్రభుత్వాలవి. ఇప్పుడు మొత్తంగా రైతును భూమినుండి తరిమేసి, తద్వారా 'విముక్తి' కలిగించడానికి పాలక పార్టీలు పూనుకున్నాయి. దానికి భూ సేకరణ, సమీకరణ, కంపెనీ వ్యవసాయం వగైరా వగైరా పేర్లు పెడుతున్నాయి. ఇక్కడ రైతు అంటే సేద్యం చేసే రైతు మాత్రమే కాదు, వ్యవసాయ కార్మికుడు, కౌలు రైతు వ్యవసాయం మీద ఆధారపడే గ్రామీణ జీవనం మొత్తం వస్తుంది.

ఒక విషయం నిజం! వ్యవసాయ సంక్షోభం నుండి రైతును ఉరితాడు రక్షించలేదు. విత్తనాలకోసం, ఎరువులకోసం, పరపతికోసం, మార్కెట్లకోసం, గిట్టుబాటు ధరలకోసం రైతులు పోరాడాల్సిందే. కానీ ఈ పోరాటాలు ఉపశమనాన్నిస్తాయేగానీ ఊబిలోనుండి ఆయన్ను బయటకు తీయలేవు. పట్టణంలోని శ్రామిక సోదరులతో కలిసి పోరాడి మొత్తం నయా-ఉదారవాద విధానాలనే నేలమట్టం చేసినప్పుడు మాత్రమే భారతీయ రైతుకు విముక్తి లభిస్తుంది. వ్యవసాయ సంక్షోభం నుండి దేశానికి ఉపశమనం లభిస్తుంది.

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా రూ. **120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు**
**(సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.హెచ్ భవన్ (ప్రజాశక్తి కార్యాలయం),**
**అజామాబాద్, హైదరాబాద్- 20**

సిపిఐ(ఎం) 21వ మహాసభల సందేశం

### పార్టీ స్వతంత్ర శక్తిని పెంచుకోవడం ద్వారానే

# వామపక్ష, ప్రజాతంత్ర సంఘటనను నిర్మించగలం



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి

**సీతారాం ఏచూరి**

పార్టీని, వర్గ, ప్రజాసంఘాలను బలపరచుకోవాలని, వామపక్ష, ప్రజాతంత్ర సంఘటనను నిర్మించేందుకు బలమైన ప్రజాపోరాటాలను నిర్వహించాలనే తన దృఢనిశ్చయాన్ని రెట్టించిన పట్టుదలతో అమలుచేయాలని సిపిఐ(యం) 21వ మహాసభల్లో నిర్ణయించుకుంది. భారతదేశ పాలకవర్గాలు ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలకు ఒక కార్యక్రమం ప్రాతిపదికగానే ప్రత్యామ్నాయాన్ని నిర్మించగలం. బూర్జువా, భూస్వామ్యవర్గాల పాలన స్థానంలో కార్మికవర్గ నాయకత్వంలో జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం దాని అంతిమలక్ష్యంగా ఉండాలి. తమ జీవనాధారాలపై పలువిధాలుగా నిరంతరం చేస్తున్న దాడి నుండి విముక్తి పొందటానికి భారత ప్రజల ముందున్న ఏకైకమార్గం ఇదిమాత్రమే.

మహాసభ రెండు ప్రధాన తీర్మానాలను, రాజకీయ తీర్మానాన్ని, రాజకీయ ఎత్తుగడల పంథాను కూలంకషంగా చర్చించి ఆమోదించింది. ఈ రెండు తీర్మానాల ముసాయిదాలను రెండుమాసాలకు ముందే పీపుల్స్ డెమోక్రసిలో ప్రచురించి, పార్టీలో లోతైన అంతర్గత చర్చలు జరపటానికి పూనుకుంది.

రాజకీయ, ఎత్తుగడల పంథాకు పార్టీసభ్యులు, శాఖల నుండి 1432 సవరణలు, 136 సూచనలు వచ్చాయి. మహాసభ వాటన్నింటిని చర్చించి, వాటిలో 29 సవరణలను ఆమోదించింది. రాజకీయ తీర్మానానికి 2552 సవరణలు, 248 సూచనలు వచ్చాయి. వాటిలో 74 సవరణలను మహాసభ ఆమోదించింది.

మహాసభలో ప్రతినిధులు ముసాయిదా రాజకీయ ఎత్తుగడల పంథా సమీక్షకు 259 సవరణలను, ముసాయిదా రాజకీయ తీర్మానానికి 473 సవరణలు, ఐదు సూచనలు చేశారు. వీటిలో రాజకీయ ఎత్తుగడల పంథాకు 11 సవరణలను, ముసాయిదా రాజకీయ తీర్మానానికి 55 సవరణలను మహాసభ ఆమోదించింది.

ఈ తీర్మానాలకు సంబంధించిన వివిధ అంశాలను గురించి చాలా రాయవచ్చు. రాజకీయ ఎత్తుగడల పంథా సమీక్ష సారాంశం వామపక్ష, ప్రజాతంత్ర సంఘటనను నిర్మించాల్సిన ప్రాధాన్యతను నొక్కిచెప్పింది. పోరాటాల ద్వారా వామపక్షాల ఐక్యతను బలపరుచుకోవటం వలన మత్రమే ఇది సాధ్యం అవుతుందని మహాసభ చెప్పింది. పార్టీ, వర్గ, ప్రజాసంఘాల స్వతంత్ర బలాన్ని పెంచుకోవటం ద్వారా మాత్రమే దీన్ని సాధించగలం. పార్టి, ప్రజాసంఘాల కార్యకలాపాలను పెద్దయెత్తున బలపరచుకోవాలనేది ఈ తీర్మానం యొక్కలక్ష్యం.

ఈ లక్ష్యాన్ని సాధించాలంటే పార్టీ నిర్మాణ పరిస్థితిని, ప్రజాసంఘాలు పనిచేస్తున్న తీరును కూలంకషంగా పరిశీలించాల్సివుంది. రాజకీయ ఎత్తుగడల పంథా సమీక్షలో నిర్ణయించుకున్న విధంగా ముందుకు సాగటానికి ఈ విధమైన పరిశీలన ద్వారా తీసుకొనే నిర్ణయాలు లక్ష్యాన్ని సాధించటంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఈ లక్ష్యసాధన కోసం 2015 సంవత్సరం ముగియటానికి ముందే పార్టి నిర్మాణంపై చర్చించటం కోసం విస్తృత సమావేశం ( ప్లీనం) జరపాలని మహాసభ నిర్ణయించింది.

ప్రజలెదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలంటే ఆర్థికదోపిడికి సంబంధించిన వివిధ సమస్యలపై జరిగే పోరాటాలను సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలతో కలిపి సిపిఐ(యం) ముందుకు తీసుకువెళ్ళాల్సి ఉ ంటుంది. ప్రస్తుత భారత సమాజంలో దళితులు, గిరిజనులు, మహిళలు, మతపరమైన మైనారిటీలపై జరుగుతున్న సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా సాగే పోరాటాలు శక్తివంతమైన ప్రజావుద్యమాలను నిర్మించటంలో ముఖ్యమైన మౌలికాంశంగా ఉంటాయి. భారతదేశంలో వర్గపోరాటాన్ని ముందుకు తీసుకుపోవాలంటే ఆర్థికదోపిడికి, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా జమిలిగా

పోరాటాలు నిర్వహించాలనే సిపిఐ(యం) అవగాహనను 21వ మహాసభ పునరుద్ఘాటించింది. ఈ రెండింటిలో ఏ ఒక్కదానిపై తగినశ్రద్ధ చూపకపోయినా ఆర్థికదోపిడికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలను సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలతో అనుసంధానం చేయటంలో విఫలమౌతాం. సమాజంలో దోపిడీకి గురౌతున్న విస్తార ప్రజానీకాన్ని దోపిడీ నుండి విముక్తి చేయటానికి అవసరమైనంత శక్తివంతంగా, వేగంగా వర్గపోరాటాలు జరగకుండా నిరోధించ టానికి ఇది దారితీస్తుంది. సిపిఐ(యం) ఈ రెండు కాళ్ళపై నిలబడవలసిన అవసరాన్ని గురించి మహాసభ నొక్కిచెప్పింది. ఆ విధంగా రెండు కాళ్ళపై నిలబడి మొదట నడవటం ప్రారంభించి, తర్వాత మనలక్ష్యసాధన కోసం పరుగులు తీయాలని చెప్పింది.

> **"భారతదేశంలో వర్గపోరాటాన్ని ముందుకు తీసుకుపోవాలంటే ఆర్థికదోపిడికి, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా జమిలిగా పోరాటాలు నిర్వహించాలనే సిపిఐ(యం) అవగాహనను 21వ మహాసభ పునరుద్ఘాటించింది. ఈ రెండింటిలో ఏ ఒక్కదానిపై తగినశ్రద్ధ చూపకపోయినా ఆర్థికదోపిడికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలను సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలతో అనుసంధానం చేయటంలో విఫలమౌతాం."**



రాజకీయ ఎత్తుగడల పంథా సమీక్ష మరో విషయాన్ని కూడా స్పష్టం చేసింది. ఎన్నికలలో సిపిఐ(యం) యొక్క బలం పార్టీ స్వతంత్రశక్తి, పార్టి నాయకత్వంలో నిర్వహించే ప్రజా వుద్యమాల బలంపై ఆధారపడి ఉంటుందని చెప్పింది. అటువంటి బలంపై ఆధారపడి మాత్రమే పార్టి బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాలలో గణనీయమైన ఎన్నికల విజయాలు సాధించిందని గత అనుభవాలు నిస్సందేహంగా స్పష్టం చేస్తున్నాయి. ప్రాంతీయ లౌకిక పార్టీలతో ఎన్నికల సంఘటనల ఏర్పాటు ద్వారా మాత్రమే ప్రస్తుత పాలకవర్గాల పాలనకు విధానపరమైన ప్రత్యామ్నాయాన్ని రూపొందించ లేమని సమీక్ష స్పష్టం చేసింది. ప్రాంతీయ పాలకవర్గ పార్టీలతో ప్రయోజనకరంగా ఎన్నికల సర్దుబాట్లు చేసుకోగలగటం కూడా పార్టియొక్క స్వతంత్రబలం, శక్తిసామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి పార్టి నిర్మాణాన్ని బలపరుచుకోవటం, పోరాటాల ద్వారా ప్రజాసమస్యలపై జోక్యం చేసుకోవటం, ఈ రెండు పద్ధతుల ద్వారా పార్టిని బలమైనశక్తిగా నిర్మించటానికి ప్రాధాన్యత నివ్వాలని ఎత్తుగడల పంథా స్పష్టం చేసింది. ఎన్నికల సమయంలో కొన్ని రాష్ట్రాలలో ప్రాంతీయపార్టీలతో ఎన్నికల సర్దుబాట్లు చేసుకోవాల్సిన అవసరం రావచ్చు. పార్టి తన లక్ష్యమైన వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన నిర్మాణంలో పురోగమనాన్ని కేవలం ఈ విధమైన ఎన్నికల ఎత్తుగడల ద్వారానే సాధించటం సాధ్యం కాదు. సిపిఐ(యం) స్వతంత్రశక్తిని పెంచుకోవటం, వివిధ ప్రజాసమస్యలపై శక్తివంతంగా జోక్యం చేసుకోవటం ద్వారా మాత్రమే దీనిని సాధించగలం.

ఒకవైపున దేశంలో వేగంగా అమలు చేస్తున్న నయా ఉదారవాద ఆర్థికవిధానాలకు, మరోవైపు తీవ్రమౌతున్న మతపరమైన విభజనలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరాన్ని మహాసభ ఆమోదించిన రాజకీయ తీర్మానం నొక్కిచెప్పింది. మోడి ప్రభుత్వం ఈ రెండంశాలను కలిపి అమలు జరుపుతున్నది. భారతదేశంపై పెరుగుతున్న అంతర్జాతీయద్రవ్య పెట్టుబడి పెత్తనం, ఆచరణలో ఆర్థికవ్యవస్థలోని ప్రతి విభాగంలోకి విదేశీ పెట్టుబడులకు ప్రవేశాన్ని కల్పించటం, విస్తారమైన మన ప్రజల జీవన ప్రమాణాలను ఫణంగా పెట్టి విదేశీ, స్వదేశీ పెట్టుబడులు గరిష్టలాభాలు సంపాదించుకోవటానికి ఉద్దేశించినవి. గత యుపిఎ ప్రభుత్వం అనుసరించిన నయా ఉదారవాద ఆర్థికవిధానాలను మోడి ప్రభుత్వం మరింత దూకుడుగా అమలుచేస్తున్నది. ఈ విధానాలకు సంబంధించిన వివిధ కోణాలను గురించి ఇంతకు ముందు చర్చించాం. ఇక ముందు కూడా చర్చిస్తూనే ఉంటాం. భారతదేశంలో అభివృద్ధిని కాంక్షిస్తున్న ప్రజల ఆకాంక్షలు తీర్చటం కోసం "అభివృద్ధి" సాధన కోసం అనిచెపుతున్నప్పటికీ, వాస్తవంలో భారతదేశాన్ని, దాని వనరులను నిర్దాక్షిణ్యంగా దోపిడీచేస్తూ, తమ లాభాలను గరిష్టంగా పెంచుకోవటానికి ఇదొక ముసుగని క్రమంగా స్పష్టమౌతున్నది. ఇది మన ప్రజానీకంలోని విస్తారమైన తరగతుల జీవన ప్రమాణాలు తీవ్రంగా దిగజారటానికి దారితీస్తున్నది. గరిష్ట లాభాలు సంపాదించటం కోసం నిర్దాక్షిణ్యంగా అనుసరించే ఇటువంటి విధానాల వలన కొద్దిమంది లాభపడుతున్నప్పటికీ, దేశంలోని

> **“ కార్మికచట్టాలకు ముఖ్యమైన సవరణలు చేయటంతో పాటు అనేక కార్మిక వ్యతిరేకచట్టాలు చేయటానికి ప్రయత్నాలు చేస్తు న్నారు. ఇప్పటికి ఉన్న చట్టాలు కార్మికవర్గానికి రక్షణ కల్పించ లేకపోతున్నప్పటికీ ఆ కనీస హక్కులను కూడా రద్దు చేయటానికి ప్రయత్నిస్తున్నారు. మోడి ప్రభుత్వం తీసు కుంటున్న ఇటువంటి చర్యలకు వ్యతిరేకంగా రానున్న కాలంలో సిపిఐ(యం) ఉధృతంగా ప్రజాపోరాటాలను నిర్వహిస్తుంది. ”**



పేదలు, ధనికుల మధ్య అంతరం భయం గొలిపేస్థాయికి పెరుగుతున్నది.

మన వ్యవసాయరంగాన్ని పట్టిపీడిస్తూ, ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం ఈ అంశాన్ని స్పష్టం చేస్తున్నది. ఇప్పటికే తీవ్రంగా ఉన్న వ్యవసాయరంగ దుస్థితిని ఉత్తర భారతదేశంలోని విస్తార ప్రాంతంలో కురిసిన అకాలవర్షాలు మరింత తీవ్రం చేశాయి. పంటలకు తీవ్రనష్టం జరిగింది. దేశానికి ఆహారభద్రత ఉండాలంటే మన రైతాంగానికి రక్షణ కల్పించాలి. ఇందుకుమారుగా మోడి ప్రభుత్వం భూసమీకరణకు నూతనచట్టం కోసం నిర్దాక్షిణ్యంగా ప్రయత్నిస్తున్నది. ఇది రైతాం గంపై అదనపు భారాలు మోపుతూ, వారిలో అభద్రతాభావాన్ని పెంచటమేకాక, మొత్తం వ్యవసాయరంగంలోని సంక్షోభాన్ని మరింత తీవ్రం చేస్తుంది.

కార్మికచట్టాలకు ముఖ్యమైన సవరణలు చేయటంతో పాటు అనేక కార్మిక వ్యతిరేకచట్టాలు చేయటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికి ఉన్న చట్టాలు కార్మికవర్గానికి రక్షణ కల్పించలేకపోతున్నప్పటికీ ఆ కనీస హక్కులను కూడా రద్దుచేయటానికి ప్రయత్నిస్తున్నారు. మోడి ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి చర్యలకు వ్యతిరేకంగా రానున్న కాలంలో సిపిఐ(యం) ఉధృతంగా ప్రజాపోరాటాలను నిర్వహిస్తుంది.

అదేసమయంలో భారత రిపబ్లిక్ యొక్క లౌకిక, ప్రజాస్వామ్య పునాదులకు, దేశంలోని మతపరమైన మైనారిటీలకు వ్యతిరేకంగా జరుగుతున్న విషపూరితమైన మతోన్మాద దాడులను మోడి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ఆర్‌యస్‌యస్ దాని అనుబంధ సంస్థలు ఘర్ వాపసి, లవ్ జిహాద్ లాంటి కార్యక్రమాలను కొనసాగిస్తుండగా, మోడి మంత్రివర్గంలోని మంత్రులు, పాలకపార్టీ యంపిలు మతోన్మాదాన్ని ఉధృతం చేయాలన్న లక్ష్యంతో నిరంతరాయంగా రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారు. ఈ విధంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నవారిపై దేశ చట్టాల ననుసరించి చర్యలు తీసుకుంటామనే కనీస హెచ్చరిక చేయటానికి కూడా మోడి ప్రభుత్వం సిద్ధం కావటం లేదు. ఇది మతపర మైన మైనారిటీలలో తీవ్రభయాందోళనలు కలిగిస్తున్నది. ఈ విధమైన ప్రయత్నాల ద్వారా హిందూ ఓటుబ్యాంకును స్థిరపరచుకోవటానికి, తమ రాజకీయ, ఎన్నికల ప్రయోజనాలను నెరవేర్చుకోవటానికి బిజెపి, ఆర్‌యస్‌యస్‌లు ప్రయత్నం చేస్తున్నాయి. అటువంటి ప్రయత్నాలు భారత రిపబ్లిక్ యొక్క మౌలిక పునాదులపై తీవ్రమైన దాడులు చేస్తాయి. వేగంగా క్షీణించి పోతున్న తమ జీవనప్రమాణాలను నిలబెట్టుకో వటానికి పోరాడుతున్న ప్రజానీకాన్ని మత ప్రాతిపదికన చీల్చి వారి ఐక్యతను విచ్ఛిన్నం చేస్తాయి.

ఈ విధంగా మోడి ప్రభుత్వం ప్రజలపై జరుగుతున్న నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణల దాడిని, ప్రజల్ని మతపరంగా విభజించటానికి చేస్తున్న దాడులతో మిళితం చేసింది. వీటికి అదనంగా తన లక్ష్యాలను నెరవేర్చుకోవటానికి దేశంలో నెలకొని ఉన్న పార్లమెంటరీ ప్రజాస్వామ్య సాంప్రదాయాలకు విఘాతం కలిగిస్తున్నది. ఈ విధమైన కుతంత్రాలతో ప్రజాస్వామిక సంస్థలను, సాంప్రదాయాలను దెబ్బతీయటం వలన మనదేశం నియంతృత్వ పాలన ప్రమాదాన్ని ఎదుర్కోబోతున్నది.

మనదేశం మీద, ప్రజల మీద ఈ విధంగా జరుగుతున్న ముప్పేటదాడిని 21వ మహాసభ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ముప్పేటదాడి త్రిశూలంగా మారి మన దేశహృదయాన్ని, ప్రజల జీవితాల్ని చీల్చివేయకుండా నిరోధించటానికి రెట్టించిన శక్తితో ఉద్యమించాలని సిపిఐ(యం) 21వ మహాసభ పిలుపునిచ్చింది. ప్రజల ప్రయోజ నాలను రక్షించటానికి, దేశ ఐక్యతను, సమగ్రతను, లౌకిక, ప్రజాస్వామిక పునాదులను కాపాడటానికి మరింతశక్తివంతంగా సిపిఐ(యం) నిరంతరం కృషి చేస్తుంది.

అనువాదం
**– ఎ. కోటిరెడ్డి**

సిపిఐ(ఎం) 21వ మహాసభల సందేశం

## కార్పొరేట్, మతోన్మాద శక్తుల పాలనకు

# వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయం



సిపిఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి

**విశాఖపట్టణంలో జరిగిన సిపిఐ(యం)21వ మహాసభలను ప్రారంభిస్తూ అప్పటి ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌కరత్ చేసిన ప్రసంగం**

కామ్రేడ్ అధ్యక్షా, భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి గారు, అఖిల భారత ఫార్వార్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ దేవబ్రత బిశ్వాస్‌గారు, సోషలిస్టు యూనిటి సెంటర్ ఆఫ్ ఇండియా ( కమ్యూనిస్టు) ప్రధాన కార్యదర్శి ప్రోవోష్ ఘోష్ గారు, ఆరెస్పీ నేత అబనీ రాయ్ గారు, సిపిఐ(ఎంఎల్) (లిబరేషన్) పొలిట్‌బ్యూరో సభ్యులు కవితా కృష్ణన్‌గారు, ప్రియమైన ప్రతినిధులు, ప్రారంభ సభకు విచ్చేసిన అతిథులు, మిత్రులారా,

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 21వ జాతీయ మహాసభల ప్రారంభసభకు హాజరైన మీ అందరికీ ముందుగా ధన్యవాదములు చెప్తున్నాను. ఈ ప్రారంభ సభకు రావాలన్న మా ఆహ్వానాన్ని మన్నించి ప్రస్తుతం వేదిక మీద ఉన్న ఐదు కమ్యూనిస్టు పార్టీల నాయకులకు ప్రత్యేక ధన్యవాదములు. అందరమూ ఒకే వేదిక మీద ఇలా కనిపించటం రానున్న కాలంలో భారత దేశంలో కమ్యూనిస్టు శక్తులు ఐక్య పోరాటాలు సాగించేందుకు కృతనిశ్చయంతో ఉన్నాయన్న సందేశాన్ని ప్రజలకు, దేశానికి ఇవ్వటానికి ఉపయోగపడే సందర్భం ఇది.

ప్రధాన నౌకా వాణిజ్య కేంద్రంగా విశాఖపట్నం భారతదేశ చిత్రపటంలో ప్రత్యేక స్థానాన్ని పొందటమే కాదు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారం, హిందూస్థాన్ షిప్‌యార్డ్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ ప్లాంట్, హిందూస్థాన్ పెట్రోకెమికల్స్ చమురు శుద్ధి కర్మాగారం, వంటి ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు వందలాది చిన్న మధ్యతరహా పరిశ్రమలకు కేంద్రం విశాఖ. సంఘటిత కార్మికోద్యమ శక్తికి కేంద్రం విశాఖ నగరం. ఈ సంఘటిత కార్మికోద్యమం సాధించిన అనేక విజయాలకు నిలువెత్తు సాక్షి ఈ నగరం. పార్టీ జాతీయ మహాసభల నిర్వహణ ద్వారా జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లటంలో కీలక పాత్ర పోషిస్తున్న విశాఖ జిల్లా ప్రజానీకానికి ముందుగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

సిపిఐ(ఎం) 21వ జాతీయ మహాసభలకు ఆతిధ్యం ఇస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు వీరోచిత కమ్యూనిస్టు వారసత్వంలో ప్రత్యేక స్థానం ఉంది. రైతాంగం సాగించిన చారిత్రక తెలంగాణ సాయుధ పోరాటానికి ఈ రాష్ట్రం కేంద్రం. ఈ పోరాట నాయకులు, జాతీయ స్థాయిలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి పునాదులు వేసిన త్యాగమూర్తులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉత్తేజభరితమైన నాయకత్వం అందించిన పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, చండ్ర రాజేశ్వరరావు వంటి నేతలకు హృదయపూర్వకమైన నివాళి అర్పిస్తున్నాము.

**కామ్రేడ్స్ మరియు మిత్రులారా!**

జాతీయ రాజకీయాలు బహుముఖ సవాళ్లుఎదుర్కొంటున్న తరుణంలో పార్టీ 21వ మహాసభ జరుపుకుంటున్నాము. గత సంవత్సర కాలంగా దేశంలో ఆర్థిక సామాజిక సాంస్కృతిక రంగాల్లో పెచ్చరిల్లుతున్న మితవాద మతోన్మాద దాడిని మనం చూస్తున్నాము. దేశంలో చోటు చేసుకున్న ఈ రకమైన మార్పులకు కారణాలు ఏమిటి?

మొదటిగా కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విస్తరణ విభాగమే తప్ప మరోటి కాదు. ఈ విధంగా మోడీ ప్రభుత్వం ఆరెస్సెస్–బిజెపిల సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పడింది. ఈ ప్రభుత్వంలో మాతృసంస్థ అయిన ఆర్‌యస్‌యస్‌కు నిర్ణాయకమైన భాగస్వామ్యం ఉంది. కేంద్రంలో మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు కావటానికి బడా బూర్జువా కార్పొరేట్ శక్తులు, ఆరెస్సెస్ నేతృత్వంలోని హిందూమతోన్మాద శక్తులు ఉమ్మడిగా సర్వశక్తులూ వెచ్చించటం రెండో కారణం.

మోడీ ప్రభుత్వం నయా ఉదారవాద ఆర్థిక విధానాల పట్ల మరింత దూకుడుగా వ్యవహరించటానికి, నిర్ణయాలు తీసుకోవటానికి ముఖ్యమైన కారణం ఆ పార్టీకి పూర్తి స్థాయిలో అండదండలిస్తున్న కార్పొరేట్ శక్తుల ప్రభావమే. కేవలం పది నెల్ల వ్యవధిలోనే జాతీయ వనరులను దేశ విదేశీ కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయటానికి గతంలో ఎన్నడూ లేనంత వేగంగా, గతంలో ఎన్నడూ చూడనన్ని నిర్ణయాలు తీసుకుంది బిజెపి ప్రభుత్వం. ఒక వైపున పరిమితమైన బొగ్గు,ఇతర ఖనిజ వనరులు వంటి జాతీయ వనరులను దేశీయ కార్పొరేట్ వర్గానికి కట్టబెడుతూ మరోవైపున బీమా, రైల్వే వంటి జాతీయ ఆర్థిక వ్యవస్థకు జీవనాడిగా ఉన్న రంగాల్లో విదేశీ గుత్త పెట్టుబడిదారులకు, ద్రవ్య పెట్టుబడికి పెద్ద పీట

> **"రాజ్యాంగంలో ఉన్న లౌకిక ప్రజాతంత్ర పునాదులను ధ్వంసం చేయటానికి పూనుకున్న బిజెపి, ఆరెస్సెస్‌లు మహాత్మాగాంధీని హతమార్చిన నాధూరాం గాడ్సేని కీర్తిస్తున్నాయి. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పదే పదే ఆర్డినెన్స్‌లు జారీ చేయటం, లౌకిక ప్రజాతంత్ర విలువలను భూస్థాపితం చేస్తూ లౌకిక ప్రజాతంత్ర మేధావులు, సాంస్కృతికోద్యమ కార్యకర్తలను వేధింపులకు గురిచేయటం వంటి ధోరణులు రానున్న కాలంలో పెచ్చరిల్లనున్న నిరంకుశ ధోరణులకు ముందస్తు హెచ్చరికలు మాత్రమే."**



వేస్తూ మోడీ ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంది. తాజాగా ప్రతిపాదించిన బడ్జెట్‌లో సంపద పన్ను రద్దు చేశారు. కార్పొరేట్ పన్ను 5 శాతం తగ్గించారు. ఈ నిర్ణయాల ద్వారా మోడీ పరిపాలనలో మంచి రోజులు ఎవరికి వచ్చాయి అన్న విషయం తేటతెల్లమవుతోంది. ఒక్క సంవత్సరంలోనే బడా పెట్టుబడిదారుడు అదాని సంపద పాతికవేల కోట్లు పెరిగింది.

సంపన్న వర్గాలకు అనుకూల విధానాల కొనసాగింపులో భాగమే కార్మికవర్గం, సాధారణ ప్రజానీకం యొక్క హక్కులపై ఎక్కుపెట్టిన దాడి. వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోవటం, ఉత్పాదకాల ధరలు పెరిగిపోవటం, వ్యవసాయరంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పడిపోవటంతో దేశవ్యాప్తంగా రైతాంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. తాజాగా వడగళ్ల వాన, ఇతర ప్రకృతి వైపరీత్యాలతో వీరి కష్టాలు మరింత పెరిగిపోయాయి. దాంతో వందలాది మంది రైతులు ఆత్మ హత్యలకు పాల్పడ్డారు. వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలు అడుగంటుతున్నాయి. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల భారాల నుండి పేదలకు ఉపశమనం లేదు. కార్మిక చట్టాల్లో మార్పుల ద్వారా కార్మికవర్గంపై దాడి జరుగుతోంది. కొత్తగా తెరమీదకు వచ్చిన గనులు, ఖనిజవనరుల చట్టం కారణంగా ఆదివాసీ ప్రజలు తమ భూములపై వారసత్వ హక్కులు కోల్పోతున్నారు.

మోడీ ప్రభుత్వం హిందూత్వ మతోన్మాద శక్తులు తమ ఎజెండానే మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లటానికి మార్గం సుగమం చేయటం ఈ ప్రభుత్వం వచ్చాక చోటు చేసుకున్న మూడో ముఖ్యమైన పరిణామం. విద్య, పరిశోధన, సాంస్కృతిక వ్యవహారాలకు సంబంధించిన ప్రభుత్వ విధి విధానాలు ఆరెస్సెస్ అజమాయిషీలో రూపొందుతున్నాయి. అల్పసంఖ్యాకవర్గాలపై వికృతదాడి జరుగుతోంది. దేశం మతమార్పిళ్లతో సరికొత్త ఉద్రిక్తతలను ఎదుర్కొంటోంది. చర్చిలు వంటి మైనారిటీ సమూహాల ప్రార్థనాస్థలాలపై పెద్దఎత్తున దాడులు జరుగుతున్నాయి. ఆవు మాంసం పై నిషేధం విధించటం వంటి చర్యల ద్వారా మైనారిటీల ఆర్థిక సాంస్కృతిక హక్కులపై మతోన్మాద ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయి. మహిళలకు సాధారణ పౌర జీవనంలో సమాన అవకాశాలు పొందకుండా వివిధ రూపాల్లో మితవాద హిందూ మతోన్మాద శక్తులు, పుషాధిక్య సామాజిక విలువలు అడ్డుగోడలుగా మారాయి.

చివరిగా, మోడీ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదంతో అంటకాగటానికి సిద్ధం కావటంతో విదేశాంగ విధానంలో సైతం మితవాద ధోరణులు ప్రబలుతున్నాయి. ఆసియా ఖండంలో అమెరికా ప్రయోజనాలు కాపాడే కర్తవ్యంలో భారతదేశాన్ని భాగస్వామిగా మార్చే దిశగా మోడీ ప్రభుత్వం విదేశాంగ విధానంలో మౌలికమైన మార్పులకు పునాదులు వేస్తోంది. జాతీయ ఆర్థిక వ్యవస్థను విదేశీ ద్రవ్య పెట్టుబడులకు మరింత బాహాటంగా తెరిచి ఉంచటం ద్వారా, మేధోసంపత్తి హక్కులకు సంబంధించిన రక్షణలను నీరుగార్చటం ద్వారా మోడీ ప్రభుత్వం ఆర్థిక రంగంలో పూర్తిగా అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గింది.

నేడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 125వ జయంతి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. రాజ్యాంగంలో ఉన్న లౌకిక ప్రజాతంత్ర పునాదులను ధ్వంసం చేయటానికి పూనుకున్న బిజెపి, ఆరెస్సెస్‌లు మహాత్మాగాంధీని హతమార్చిన నాధూరాం గాడ్సేని కీర్తిస్తున్నాయి. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పదే పదే ఆర్డినెన్స్‌లు జారీ చేయటం, లౌకిక ప్రజాతంత్ర విలువలను భూస్థాపితం చేస్తూ లౌకిక ప్రజాతంత్ర మేధావులు, సాంస్కృతికోద్యమ కార్యకర్తలను వేధింపులకు గురిచేయటం వంటి ధోరణులు రానున్న కాలంలో పెచ్చరిల్లనున్న నిరంకుశ ధోరణులకు ముందస్తు హెచ్చరికలు మాత్రమే.

ఈ మితవాద దాడిని వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ప్రతిఘటించాలి. మోడీ పగ్గాలు చేపట్టిన అతి తక్కువ కాలంలోనే దేశవ్యాపిత నిరసనోద్యమాలు రూపుదిద్దుకుంటున్నాయి. వివిధ తరగతులకు చెందిన ప్రజలు తమ హక్కుల పరిరక్షణకై ఉద్యమిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన భూసేకరణ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా విస్తృత భాగస్వామ్యంతో కూడిన ప్రజా ఉద్యమం నిర్మాణం జరుగుతోంది. కార్మిక చట్టాల్లో సవరణలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలన్నీ ఐక్యమవుతున్నాయి. బొగ్గుగనులను ప్రైవేటీకరించే బిల్లుకు వ్యతిరేకంగా బొగ్గు గని కార్మికులు రెండు రోజుల దేశ వ్యాప్త సమ్మెను జయప్రదంగా నిర్వహించారు. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వాటా పెంచటానికి వ్యతిరేకంగా

బీమా ఉద్యోగులు దేశవ్యాప్తంగా సమ్మె చేశారు. మోడీ ప్రభుత్వం అనుసరించబూనుకున్న కార్పొరేట్, గుత్త పెట్టుబడిదారీ అనుకూల విధానాల కారణంగా రానున్న రోజుల్లో ప్రజలు, ప్రభుత్వం మధ్య ఉన్న వైరుధ్యం మరింత తీవ్రతరం కానున్నది.

ఈ మితవాద దాడిని ఎదుర్కోవటం ఎలా అన్నదే ఈ మహాసభల్లో ముఖ్యమైన చర్చనీయాంశం. కార్మికులు, రైతాంగం, వ్యవసాయ కార్మికులు, ఇతర అణగారిన, అణచివేతకు గురవుతున్న వర్గాల పోరాటాలు, నిలకడైన ఉద్యమాలు నిర్మించటం, వివిధ సమస్యలపై స్థానిక ఉద్యమాలు నిర్మించటం, నయాఉదారవాద వ్యతిరేక ఉద్యమంలో ఈ వేర్వేరు ఉద్యమాలను అంతర్భాగంగా మలచడం వంటి అంశాలపై మహాసభ చర్చలు కేంద్రీకరించనున్నాయి. సామాజిక అంశాలపై పార్టీ క్రియాశీల జోక్యం పెరగనున్నది. మహిళలు, ఆదివాసీలు, దళితులు, మైనార్టీల హక్కుల, అధికారాల పరిరక్షణకై ఉద్యమాలు పార్టీ నాయకత్వంలో సాగనున్నాయి. దేశంలో పెరిగిపోతున్న మతోన్మాద ప్రమాదానికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో విశాల ప్రాతిపదికన లౌకిక ప్రజాతంత్ర శక్తులను కూడగట్టటానికి సిపిఐ(ఎం) పూనుకొంటోంది.

ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా, అటవీ భూములపై తమ హక్కులు పరిరక్షించుకునేందుకు వీరోచిత పోరాటం సాగిస్తున్న గిరిజనులను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల రెండు లక్షలమంది ప్రజలు ముంపుకు గురికానున్నారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సిపిఐ(ఎం) పోరాడే గిరిజనుల పక్షాన నిలుస్తుందని హామీ ఇస్తున్నాను.

కమ్యూనిస్టులు అంతర్జాతీయ వాదులు. అంతర్జాతీయ పరిణామాలను జాగ్రత్తగా పరిశీలిస్తుంటాము. 2008లో ప్రారంభమైన అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సంక్షోభం నుండి పెట్టుబడిదారీ వ్యవస్థ ఇంకా కోలుకోలేదు. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు, నిధులు కోత విధించటం ద్వారా పొదుపు చర్యల ద్వారా వివిధ దేశాల్లో ప్రభుత్వాలు సంక్షోభ భారాలను ప్రజలపై రుద్దడం ద్వారా ఈ సంక్షోభం నుండి బయటపడాలని పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయి. ఇటువంటి కుయత్నాలను గ్రీస్ ప్రజలు ప్రతిఘటించారు. తిరస్కరించారు. ప్రత్యామ్నాయ విధానాలు అనుసరించే ప్రభుత్వాన్ని ఎన్నుకొన్నారు. యూరప్‌లో పొదుపు చర్యలు, నయా ఉదారవాద విధానాలు అనుసరిస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా గ్రీస్ ప్రజలు సాధించిన ఈ విజయం నయాఉదారవాద

> **"పెరుగుతున్న మితవాద దాడి నేపథ్యంలో వామపక్ష ఐక్యతను విస్తృత పర్చుకోవటం, సంఘటితపర్చుకోవటం అవసరం. విశాల వామపక్ష వేదిక మీదికి వామపక్ష పార్టీలు, గ్రూపులు, వ్యక్తులు అందరినీ ఐక్యం చేయాలి. వామపక్ష ప్రజా సంఘాల మధ్య సమన్వయం కోసం ఒక యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలి. విధి విధానాలు రూపొందించుకోవాలి. శక్తివంతమైన వామపక్ష ఐక్యత సాధించటం ద్వారా మాత్రమే అన్ని రకాల ప్రజాతంత్ర శక్తులను సమీకరించి వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణంలో ముందడుగు వేయగలము."**

వ్యతిరేక పోరాటంలో సరికొత్త కోణాలను ఆవిష్కరిస్తోంది. లాటిన్ అమెరికాలో వామపక్ష స్వభావం కలిగిన ప్రభుత్వాలు, ప్రజాదరణ పొందిన ప్రభుత్వాలు సామ్రాజ్యవాదపు ఒత్తిళ్లను అధిగమిస్తూ నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించి అమలు చేస్తున్నాయి. మితవాద శక్తులపై పోరాడుతున్న వెనిజులా ప్రభుత్వం, ప్రజలకు సంఘీభావం తెలుపుతున్నాము. అమెరికా సామ్రాజ్య వాదం వెనిజులా లోని మితవాద శక్తులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వంపై అనేక ఆంక్షలు విధిస్తోంది.

సిపిఐ(ఎం) క్యూబా ప్రజలు, వారి పోరాటం పట్ల సంపూర్ణ మద్దతు, సంఘీభావం ప్రకటిస్తోంది. క్యూబాతో సాధారణ సంబంధాలు నెలకొల్పుకోనున్నట్లు అమెరికా ప్రకటించింది. ఆ విధంగా అమెరికా ప్రకటించేలా చేసింది అంతర్జాతీయ సంఘీభావ పోరాటం. క్యూబా పోరాటంలో ఇది ఒక ముఖ్యమైన మలుపు. అయితే గత ఐదు దశాబ్దాల పాటు అమలు జరుపుతూ వచ్చిన క్యూబా ఆర్థిక దిగ్బంధనాన్ని మాత్రం అమెరికా ఇంకా ఎత్తివేయలేదు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా అమలు జరుగుతున్న ఈ ఆర్థిక దిగ్బంధనాన్ని తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నాము. స్వాతంత్ర్యం, స్వతంత్ర భూభాగం కోసం ఎన్నో ప్రతికూల పరిస్థితుల మధ్య జీవన్మరణ పోరాటం సాగిస్తున్న పాలస్తీనా ప్రజలకు సిపిఐ(ఎం) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. ఒకవైపున సామ్రాజ్యవాదం, మరోవైపున పెచ్చరిల్లుతున్న మితవాద శక్తుల ద్విముఖ దాడికి గురవుతున్న పశ్చిమాసియా ప్రజల భవిష్యత్తు పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నాము.

నేపాల్, శ్రీలంక, పాకిస్తాన్‌లలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఛాందసవాదం, సామ్రాజ్యవాద శక్తుల జోక్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు, ప్రజాతంత్ర శక్తులకు సిపిఐ(ఎం) సంపూర్ణ మద్దతు తెలియచేస్తోంది. బంగ్లాదేశ్‌లో మితవాద ఛాందసవాద శక్తులకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం సాగిస్తున్న ప్రజానీకానికి ప్రత్యేక శుభాకాంక్షలు.

ఈ పరిస్థితుల్లో సిపిఐ(ఎం), వామపక్షాల స్వతంత్ర శక్తి సామర్థ్యాలు పెంచుకోవటం ఒక అనివార్య అవసరం. ఈ మధ్యకాలంలో, ప్రత్యేకించి పశ్చిమబెంగాల్‌లో సిపిఐ(ఎం), ఇతర వామపక్షాలు కోల్పోయిన ప్రజాపునాదిని తిరిగి సంపాదించాలి. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ అకృత్యాలు, అఘాయిత్యాలను ఎదుర్కొంటూ పార్టీని, వామపక్ష ఉద్యమాన్ని కాపాడుకోవటం కోసం త్యాగాలు చేస్తున్న వేలాదిమంది పార్టీ కార్యకర్తలు, వామపక్ష కార్యకర్తలకు ఈ మహాసభ వేదిక నుండి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. బెంగాల్‌లో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నందున మహాసభలో పాల్గొనాల్సిన అనేకమంది ప్రతినిధులు హాజరు కాలేకపోయారు. ఈ మహాసభల్లో పాల్గొనాల్సిన ప్రతినిధులు సుభాష్ ముఖోపాధ్యాయ, మానస్ ముఖర్జీలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటుండగా తృణమూల్ గూండాల చేతుల్లో గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. వారివురు త్వరగా కోలుకోవాలని ఈ మహాసభ తరపున ఆకాంక్షిస్తున్నాము.

పార్టీ గత మహాసభ నుండి పశ్చిమ బెంగాల్‌లో పార్టీ పతాకాన్ని సమున్నతంగా నిలబెట్టే ప్రయత్నంలో ప్రాణాలర్పించిన 99 మంది పార్టీ సభ్యులు, కార్యకర్తలు, నాయకులకు మనం నివాళి అర్పించాము. వారి త్యాగాలు వృధా కావు. ప్రస్తుత పరిస్తుతులను మనం అధిగమించాలి. ప్రజామోదాన్ని తిరిగి పొందాలి.

పెరుగుతున్న మితవాద దాడి నేపథ్యంలో వామపక్ష ఐక్యతను విస్తృత పర్చుకోవటం, సంఘటితపర్చుకోవటం అవసరం. విశాల వామపక్ష వేదిక మీదికి వామపక్ష పార్టీలు, గ్రూపులు, వ్యక్తులు అందరినీ ఐక్యం చేయాలి. వామపక్ష ప్రజా సంఘాల మధ్య సమన్వయం కోసం ఒక యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలి. విధి విధానాలు రూపొందించుకోవాలి. శక్తివంతమైన వామపక్ష ఐక్యత సాధించటం ద్వారా మాత్రమే అన్ని రకాల ప్రజాతంత్ర శక్తులను

(మిగతా 13వ పేజీలో)

ఈ మాసం ప్రత్యేకం

# కార్మిక చట్టాల సవరణలు.. వాటి పూర్వరంగం.. కార్మికులపై ప్రభావం...



రచయిత ప్రధాన కార్యదర్శి
సిఐటియు. ఆం.ప్ర.కమిటీ

ఎం.ఎ. గఫూర్

కేంద్రంలో భారతీయ జనతా పార్టీ తన స్వంత బలంతో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక సంస్కరణల పేరిట కార్మిక చట్టాలను సవరించాలనే అంశం ముందుకు తెచ్చింది. ప్రధాని నరేంద్ర మోడీ గారు ''మేక్ ఇన్ ఇండియా'' పేరుతో దేశదేశాలు తిరుగుతూ స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, మౌలిక వసతులు, రాయితీలు కల్పిస్తామంటూ ప్రాధేయపడుతున్నాడు. పెట్టుబడిదారుల కోర్కెల కనుగుణంగా వారికి అవసరమైన సహజ వనరులను అప్పగించటంతో పాటు కారుచౌకగా కార్మికులతో బలవంతంగా వెట్టిచాకిరి చేయించటానికి ప్రభుత్వం సిద్ధపడుతున్నది. బహుళజాతి కంపెనీల ఒత్తిడి మేరకు కార్మిక చట్టాల సవరణలను అజెండాలోకి తెచ్చింది. కార్మిక చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని, పెట్టుబడులు రావాలంటే వీటిని సవరించాలని, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్రాసిన ఉత్తరంలో నరేంద్ర మోడీ స్పష్టంగా పేర్కొన్నాడు. ఈ చట్టాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వమే మార్చితే దేశంలో బిజెపిపై వ్యతిరేకత పెరుగుతుంది, కాబట్టి రాష్ట్రాల చేత చట్ట సవరణలు చేయించాలని ఆర్‌ఎస్‌ఎస్ సలహా ఇవ్వటంతో రాష్ట్రాలపై ఒత్తిడి తెచ్చి కార్మిక చట్టాల్లో సవరణలు చేసే కృషి కొనసాగిస్తున్నది. బిజెపి పాలిత రాజస్థాన్ ప్రభుత్వం మొట్టమొదటిగా కార్మిక చట్టాలన్నింటినీ సవరించింది. కార్మికుల హక్కులను కుదించి బలవంతపు శ్రమను, వెట్టి చాకిరిని ప్రోత్సహించేలా ఆ రాష్ట్రంలో కార్మిక చట్టాల సవరణ జరిగింది. ఈ సవరణలకు దేశమంతటా కార్మిక వర్గం నుండి తీవ్రమైన నిరసన వచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం లెక్కచేయలేదు. మరో బిజెపి పాలిత రాష్ట్రమైన మధ్యప్రదేశ్ ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణలను ఆమోదించటం జరిగింది. మహారాష్ట్రలోని బిజెపి ప్రభుత్వం తాము కూడా కార్మిక చట్టాలను సవరించబోతున్నట్లు ప్రకటించింది.

ఈ పూర్వరంగంలోనే మన రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు గమనించాలి. గత ఎన్నికల సందర్భంగా ఓట్ల కొరకు ప్రజల మధ్య తిరుగుతూ చంద్రబాబు గారు తాను మారిన మనిషినని, గతంలో చేసిన పొరపాట్లు మరల చేయనని నమ్మబలికాడు. ఆచరణలో జరుగుతున్న పరిణామాలు చూస్తే ఆయన ఏమాత్రం "మారని మనిషి" అని తెలుస్తున్నది. గతంలో ఆరోపించబడినట్లుగా ఎలాంటి మానవతా స్పందనలేని మర మనిషి లక్షణాలన్ని అణువణువునా ఆయనలో ఉన్నాయని స్పష్టమవుతున్నది. ఆర్థిక సంస్కరణలలో తాను ఆద్యుడనని నిరంతరం తనకు తాను పొగుడుకునే చంద్రబాబుగారు ఫిబ్రవరి నెలలో కార్మిక శాఖ సమీక్షా సమావేశాన్ని నిర్వహించి కార్మిక సంక్షేమాన్ని గురించి ఒక్కమాట కూడా చెప్పకుండా తక్షణమే రాజస్థాన్ తరహా చట్ట సవరణలకు పూనుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీచేశాడు. దానితో కార్మిక శాఖ అధికారులు ఆగమేఘాల మీద కార్మిక చట్టాల సవరణల బిల్లులు తయారు చేశారు. ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల చివరి రోజుల్లో గుట్టు చపుడు కాకుండా శాసన సభ ఆమోదం పొందింది. దురదృష్టమేమంటే అధికార పక్షంతో అనునిత్యం అసెంబ్లీలో తగువు పెట్టుకునే ప్రధాన ప్రతిపక్షం కూడా ఈ కార్మిక చట్టాల సవరణలను ప్రతిఘటించటం గాకుండా మౌనంగా బలపరించింది. ఏదైనా అమలు జరుగుతున్న ఒక హక్కును మార్చాలంటే అది ఎవరికి వర్తిస్తుందో వారితో (స్టేక్ హెూల్డర్స్) చర్చించటం సహజ న్యాయ సూత్రం. ఏ కేంద్ర కార్మిక సంఘంతో కాని, కనీసం అధికార పక్షానికి సంబంధించిన కార్మిక నాయకులతో గాని ఎలాంటి చర్చలు జరుపకుండా రాజస్థాన్ తరహాలో కార్మిక చట్టాలన్నింటినీ సవరించే బిల్లులు ఆమోదింప జేయటం చంద్రబాబునాయుడు గారి ప్రభుత్వం ఎంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదో, పెట్టుబడిదారుల సేవకై ఎంతగా తపిస్తున్నదో అర్థమవుతున్నది.

**కార్మిక చట్టాల సవరణకు పూర్వరంగం:**

సోవియట్ యూనియన్ పతనం తరువాత సామ్రాజ్యవాద దేశాలకు చెందిన బహుళజాతి కంపెనీలు, బడా పెట్టుబడిదారులు వర్థమాన దేశాలపై ఒత్తిడి తెచ్చి వారి సహజసంపదను, వారి మార్కెట్లను కొల్లగొట్టి ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థల్లో జోక్యంచేసుకొని గుత్తాధిపత్యం సాధించటం కొరకు ప్రయత్నిస్తున్నాయి. భారత పాలక వర్గాలు కూడా సామ్రాజ్యవాద దేశాలతో మైత్రికోసం వెంపర్లాడుతూ, వారి షరతులన్నింటికీ అంగీకరిస్తున్నాయి. వారి కంపెనీల్లో భారత పెట్టుబడిదార్లను జూనియర్ భాగస్వాములుగా చేస్తూ, స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సౌకర్యాలు కల్పించే ఏజన్సీగా పనిచేస్తున్నాయి. బహుళజాతి కంపెనీలు హైర్ అండ్ ఫైర్ విధానాన్ని ఈ దేశంలో అమలు చేయాలని ఎప్పటినుండో కోరుతున్నాయి. విదేశీ పెట్టుబడుల ద్వారా మాత్రమే దేశం అభివృద్ధి చెందుతుందని బలంగా ప్రచారం చేస్తున్న బిజెపి, టిడిపి ప్రభుత్వాలు వారు కోరినట్లుగా విధానాలను

రూపొందించటం, చట్టాలను సవరించటం జరుగుతున్నది. కార్మికులకు కొన్ని హక్కులు కల్పిస్తూ గతంలో చేసిన చట్టాలను, విధానాలను కాలం చెల్లినవిగా చెబుతూ నేటి అవసరాలకు ఈ చట్టాలను సవరించాల్సిందేనని వారు వాదిస్తున్నారు. భారత దేశంలో ప్రభుత్వ రంగం బలంగా ఉన్నందున ఆర్థిక వ్యవస్థ మొద్దుబారి పోయిందని, ప్రైవేటీకరణ ద్వారా ఉత్సాహం నింపాలంటున్నారు. కార్మిక చట్టాలు కార్మికులకు అనుకూలంగా ఉన్నందున కార్మికులలో బాధ్యతారాహిత్యం పెరిగిందని, చురుకుదనం లేదని ప్రచారం చేస్తున్నారు. అందుకు పరిష్కారంగా కార్మిక చట్టాల్ని సవరించి వారిలో అభద్రతా భావాన్ని సృష్టించాలని, ఉద్యోగుల నియామకం, తొలగింపు యజమానులకు హక్కుగా ఇవ్వాలని బహుళజాతి కంపెనీలు చాలా కాలంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు కూడా కార్మిక చట్టాల సవరణ అంశం ముందుకు వచ్చింది. అయితే దేశంలోని కార్మిక సంఘాలన్ని ఐక్యమై కార్మిక చట్టాల సవరణలకు నిరసనలను తెలపటం, సార్వత్రిక సమ్మెలు చేయటంతో ఆనాడు ఈ చట్ట సవరణలు తాత్కాలికంగా ఆగిపోయాయి. అయితే నేడు అధికారంలోకి వచ్చిన బిజెపి, టిడిపిలు ఓటు వేసిన ప్రజలకంటే నోట్లు ఖర్చు పెట్టి గెలిపించిన కార్పొరేట్ శక్తులే తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన వారుగా భావించి, వారిని తృప్తి పరిచేందుకు కార్మిక చట్టాల్లో అడ్డగోలు సవరణలకు సిద్ధపడుతున్నాయి.

**"కార్మిక చట్టాలు కార్మికులకు అనుకూలంగా ఉన్నందున కార్మికులలో బాధ్యతారాహిత్యం పెరిగిందని, చురుకుదనం లేదని ప్రచారం చేస్తున్నారు. అందుకు పరిష్కారంగా కార్మిక చట్టాల్ని సవరించి వారిలో అభద్రతా భావాన్ని సృష్టించాలని, ఉద్యోగుల నియామకం, తొలగింపు యజమానులకు హక్కుగా ఇవ్వాలని బహుళజాతి కంపెనీలు చాలా కాలంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి."**



### కార్మిక చట్టాల సవరణల వల్ల కార్మికులపై పడుతున్న ప్రభావం

పారిశ్రామిక వివాదాల చట్టం పారిశ్రామిక అశాంతిని పరిష్కరించటానికై బ్రిటిషు కాలంలోనే రూపొందించబడింది. స్వాతంత్ర్యానంతరం అవసరమైన మార్పులు చేశారు. గతంలో 100 మందికి మించి కార్మికులు ఒక పరిశ్రమలో పనిచేస్తుంటే ఆ పరిశ్రమలో లేఆఫ్, రిట్రెంచ్‌మెంట్, క్లోజర్ లాంటివి ఏమైనా విధించాలంటే ప్రభుత్వ అనుమతి లేకుండా చేయటానికి వీలులేదు. ఆ చట్టాన్ని ఇపుడు సవరించారు. ప్రస్తుత సవరణలో ఆ సంఖ్యను 300లకు పెంచారు. అనగా 300 మంది లోపు కార్మికులు ఉన్న ఏ పరిశ్రమకు కూడా ఈ చట్టం వర్తించదు. యజమాని ఇష్టాయిష్టాలపై ఆధారపడి కార్మికుల ఉద్యోగాలు ఉంటాయి. ఎవ్వరినైనా లేఆఫ్ చేయవచ్చును. ఏ పరిశ్రమలోనైనా రిట్రెంచ్‌మెంట్ చేయవచ్చు. ఒక వేళ పరిశ్రమను మూసివేయాలన్నా యజమాని ప్రభుత్వ అనుమతి తీసుకోనవసరం లేదు. నూటికి 85 పరిశ్రమలు ఇలాంటి చిన్న పరిశ్రమల జాబితాలో ఉన్నాయి. అనగా 85 శాతం మంది కార్మికులు తమ ఉద్యోగాలపై హక్కును కోల్పోయి పనిచేయాల్సి ఉంటుంది. అంతే గాకుండా పారిశ్రామిక వివాదాల చట్టంలో ఉన్న గో స్లో అన్న పదాన్ని కార్మికులకు వ్యతిరేకంగా నిర్వచించి ఉత్పత్తికి ఆటంకం కలిగిస్తున్నారనే పేరుతో యాజమాన్యం క్రమశిక్షణ చర్యలు తీసుకోవటానికి అవకాశం కల్పించేలా చట్టసవరణ చేశారు.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం అప్రెంటిస్ చట్టానికి చేసిన సవరణల వల్ల అప్రెంటీస్‌లను రెగ్యులర్ కార్మికుల స్థానాల్లో పనిచేయించుకోవటానికి యజమానులకు హక్కు ఇవ్వబడింది. ప్రస్తుతం ప్రకటించబడిన ముసాయిదా రవాణా కార్మికుల చట్టం మోడీ ప్రభుత్వపు నియంతృత్వ ఆలోచనలకు ప్రతిరూపంగా చెప్పుకోవచ్చు. ప్రతిపాదిత రవాణ చట్టం అమలైతే వాహన చోదకులు బయట ఉండే కాలం కంటే జైల్లో ఉండే కాలం ఎక్కువగా ఉంటుంది. 304 ఎ, నిబంధన నాన్‌బెయిలబుల్ సెక్షన్‌గా మార్చబడింది. తీవ్రమైన ప్రమాదాలకు (ఫాటల్ యాక్సిడెంట్స్)కఠినాతి కఠినమైన శిక్షలు ప్రతిపాదింప బడ్డాయి. రోడ్ల పరిస్థితి, వాహనాల పరిస్థితి, కార్మికుల పని పరిస్థితులు వీటికేమి సంబంధం లేకుండా ప్రతి ప్రమాదంలోనూ డ్రైవర్‌ను శిక్షించాలనే వాదన నియంతృత్వ ఆలోచనలకు ప్రతి రూపం తప్ప మరొకటి కాదు. అందుకే దేశంలోని రవాణ కార్మికులందరూ ఏప్రిల్ 30న దేశ వ్యాప్త సమ్మెకు సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం సంఘటిత రంగాల్లో కార్మికులకు అంతో ఇంతో ఉపయోగపడుతూ సాంఘిక భద్రత కల్పిస్తున్న ఇఎస్ఐ, ప్రావిడెంట్ ఫండు చట్టాలను కూడా మార్చబోతున్నట్లు ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఈ ప్రతిపాదనలు చట్ట సవరణలుగా మారితే పెన్షన్ సౌకర్యం సామాజిక బాధ్యతగా కాకుండా కేవలం కార్మికుల యొక్క పొదుపుతో మాత్రమే నిర్వహించబడే నామమాత్ర పథకంగా మారుతుంది. ఇఎస్ఐ సాధారణ ప్రైవేట్ బీమా పథకంగా మార్చివేయబడుతుంది.

ఫ్యాక్టరీ చట్టంలో మార్పులుచేసి విద్యుత్ ద్వారా కాకుండా 40 మందికి లోపుగా కార్మికులు పనిచేసే ఏ పరిశ్రమైనా ఫ్యాక్టరీ నిర్వచనం క్రిందికి రాదని, దానికి ఫ్యాక్టరీల చట్టం వర్తించదని చట్ట సవరణ చేయబడింది. ఇది మరో దుర్మార్గమైన సవరణ. ఫ్యాక్టరీ చట్టం వర్తించనపుడు 8 గంటల పని, అదనపు పనికి అదనపు వేతనం, వేతనంతో కూడిన వారాంతపు

> "షెడ్యూల్ పరిశ్రమలలోని కనీస వేతనాలు 90 శాతం మందికి అమలు కావటం లేదు. కరువు భత్యం లేదు. ఇఎస్ఐ, ప్రావిడెంట్ ఫండు, గ్రాట్యూటీ లాంటి సామాజిక భద్రతా పథకాలు అమలు కావటం లేదు. ఉద్యోగ భద్రత లేదు. యజమానుల దాయాదాక్షిణ్యలపై ఆధారపడి, కుటుంబాల పోషణకై వెట్టిచాకిరి చేస్తున్న కోట్ల మంది కార్మికులు భారత దేశంలో ఉన్నారు."

సెలవు, ఆర్జిత సెలవులు, యూనిఫాం, రక్షణ పరికరాలు, తదితర అంశాలేవీ కూడా చట్టపరంగా ఆ కార్మికులకు వర్తించవు. ఆ పరిశ్రమ యజమాని దయాదాక్షిణ్యాలపై ఆధారపడి వీరు పనిచేయాల్సి ఉంటుంది. హైర్ అండ్ ఫైర్ విధానాన్ని అమలుజరపటానికి యాజమాన్యానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది.

కాంట్రాక్టు కార్మిక చట్టం గత అనేక సంవత్సరాల కార్మికవర్గ పోరాటాల ఫలితంగా వచ్చింది. వెట్టిచాకిరి, బలవంతపు శ్రమను అరికట్టడానికై ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టం చేయాలని సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా నిర్దేశించటం వల్ల 1970 సంవత్సరంలో ఈ చట్టం ఉనికిలోకి వచ్చింది. శాశ్వత స్వభావం కలిగి ఉండేటటువంటి ఏ పనిలో కూడా కాంట్రాక్టు కార్మికులను నియమించరాదని, సమాన పనికి సమాన వేతనాన్ని అమలు జరపాలని, శాశ్వత కార్మికులతో సమానంగా వీరికి వసతులుండాలని, కాంట్రాక్టు కార్మిక చట్టం చెబుతున్నది. ప్రస్తుత చట్ట సవరణల ద్వారా 50 మంది కాంట్రాక్టు కార్మికుల కంటే తక్కువ మంది పనిచేస్తుంటే ఈ చట్టం వర్తించదని సవరించారు. దీని వల్ల 90 శాతం కాంట్రాక్టు కార్మికులకు ఈ చట్టం వర్తించకుండా పోతుంది. చట్టాన్ని ఉల్లంఘించినవారికి గతంలో జైలుశిక్ష విధించేవారు. ఇపుడు జరిమానాతో సరిపెట్టేలా చట్టాన్ని సవరించారు. కాంట్రాక్టు కార్మికులు వెట్టి చాకిరి కార్మికులుగా మార్చబడతారు. వెట్టి చాకిరిని రాజ్యాంగం నిషేధించినా పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్న మోడీ, బాబుల జోడీకి ఇవేవి స్మృహలో లేవు. బలవంతంగా పనిచేయించటం, యజమానుల హక్కుగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోరుతున్నాయి.

కార్మిక సంక్షేమ నిధి చట్టంలో మార్పులు చేసి కార్మికులు చెల్లించాల్సిన వాటాను అమాంతంగా పెంచారు. నెలకు రెండు రూపాయలుగా ఉన్న రుసుంను నెలకు 30 రూపాయలు చేశారు. అసంఘటిరంగంలోని ఒక సాధారణ కార్మికుడు ప్రతి నెల క్రమబద్ధంగా ఉపాధి దొరకటమే కష్టమైన పరిస్థితుల్లో నెలకు 30 రూపాయలు చెల్లించటం కష్టమైన పనే. ఒక వేళ ఈ భారాన్ని మోసినా ఆ కార్మికునికి వచ్చే ప్రయోజనాలు ఏమిటో ప్రభుత్వం స్పష్టంగా చెప్పటం లేదు. కార్మికుడు ఎవ్వరైనా ప్రమాదంలో మరణిస్తే 5 లక్షలు ఇస్తామని మంత్రి గారు ఘనంగా ప్రకటించిన డబ్బు ఈ సంక్షేమ నిధిలోనిదే. ఈ నిధికి ప్రభుత్వం ఒక్క పైసా చెల్లించటం లేదు. కాని పెత్తనమంతా ప్రభుత్వం చేతిలో ఉంది. ఈ తరహా నిధి భవన నిర్మాణ రంగంలోని కార్మికులకు కూడా ఉన్నది. సుమారు 1200 కోట్లు కార్మికుల డబ్బు బ్యాంకుల్లో ఎఫ్‌డిలు వేసుకొని దానిపై వచ్చే వడ్డీతో అధికారులు తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు దక్కుతున్నది నామమాత్రమే. ప్రస్తుతం చట్ట సవరణ చేయబడిన సంక్షేమ నిధి కూడా అధికారుల లేదా కార్మిక శాఖా మంత్రి ఇష్టమొచ్చినట్లుగా వాడుకోవటానికి ఉపయోగపడుతుందేమో గాని కార్మికుల సంక్షేమానికి జరిగే ఉపయోగం నామమాత్రమే.

ఏకీకృత రిజిస్ట్రేషన్‌ల చట్టం పేరుతో ప్రభుత్వం రూపొందించిన నిబంధనలన్నీ పూర్తిగా యజమానులకు ఊడిగం చేయటం తప్ప కార్మికులకు మాత్రం పైసా ప్రయోజనం లేదు. అనేక చట్టాల క్రింద ఒక్కొక్క చట్టానికి ఒక్కొక్కసారి రిజిస్ట్రేషన్ చేసుకోవటానికి యజమానులు ఇబ్బందులు పడుతున్నారని, కాబట్టి ఐదు చట్టాల క్రింద ఒకే రిజిస్ట్రేషన్ చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం చట్టాన్ని సవరించింది. అది కూడా ఆన్‌లైన్‌లో చేసుకుంటే సరిపోతుందని కార్మిక శాఖ కార్యాలయానికి పోనవసరం లేదని సవరించిన చట్టం చెబుతున్నది.

ప్రస్తుత సామాజిక వ్యవస్థలో కార్మికునికి ఎలాంటి రక్షణ లేదు. మొత్తం కార్మికుల సంఖ్యను తీసుకుంటే యూనియన్‌ల రూపంలో సంఘటితమైన వారు 15 శాతానికి మించరు. అశేషమైనటువంటి కార్మిక వర్గం ప్రధానంగా అసంఘటితరంగ కార్మికులు ఎలాంటి చట్టబద్ధహక్కులు లేకుండా పని చేస్తున్నారు. షెడ్యూల్ పరిశ్రమలలోని కనీస వేతనాలు 90 శాతం మందికి అమలు కావటం లేదు. కరువు భత్యం లేదు. ఇఎస్ఐ, ప్రావిడెంట్ ఫండు, గ్రాట్యూటీ లాంటి సామాజిక భద్రతా పథకాలు అమలు కావటం లేదు. ఉద్యోగ భద్రత లేదు. యజమానుల దాయాదాక్షిణ్యలపై ఆధారపడి, కుటుంబాల పోషణకై వెట్టిచాకిరి చేస్తున్న కోట్ల మంది కార్మికులు భారత దేశంలో ఉన్నారు. ఈ ప్రభుత్వాలకు సామాజిక బాధ్యత ఉంటే ఇటువంటి కార్మికులను ఆదుకోవటానికి వారికి మెరుగైన జీవితాన్ని గ్యారెంటీ చేయటానికి కృషి చేయాలి. అందు కనుగుణంగా చట్టాల్లో సవరణలు చేయాలి. కాని ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నాయి.

ప్రపంచంలో ఆర్థిక వేత్తలు అంగీ కరించే అంశం ఏమంటే ఏ దేశమైనా అభివృద్ధి సాధించిదా అనేది ఆ దేశంలోని ప్రజలందరి జీవన ప్రమాణాలు, పరిస్థితులు ఏ మేరకు

(31వ పేజీ తరువాయి)

ఎజెండాను అమలు చేయటానికి వనరులను సమీకరించలేని స్థితిలో ఉంది. వివేకరహితంగా ముందుకు పోవటానికి ప్రయత్నం చేస్తూ ప్రైవేటురంగాన్ని బలపరచటానికి విచక్షణారహితంగా అప్పులు చేయడానికి ప్రయత్నిస్తున్నది. అది అభివృద్ధి పేరుతో రైతులను భూములనుండి తొలగించి, జీవనాధారాన్ని పోగొట్టటాన్ని న్యాయమని ప్రచారం చేస్తూ భూసేకరణ బిల్లును తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నది. చివరిగా ఇది విదేశీ పెట్టుబడిదారులను పెట్టుబడులు పెట్టటానికి వారికి ఆసక్తిలేని రంగాలలోకి ఆకర్షించడానికి పెద్దమొత్తంలో రాయితీలిస్తానని ప్రకటిస్తున్నది. ఒక వ్యూహంగా ఇవి విఫలమవుతాయని అన్ని ఆధారాలు సూచిస్తున్నాయి. రాజకీయంగా ఎదుర్కొని దీనిని నిరోధించలేకపోయినట్లయితే పౌరసమాజం దీనికి మూల్యం చెల్లించాల్సి ఉంటుంది.

**అనువాదం-కె.నాగమల్లేశ్వరరావు**

మెరుగయ్యాయో పరిశీలించి నిర్ణయిస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రస్తుతం మానవాభివృద్ధి సూచికలో దేశంలో 12వ స్థానంలో ఉన్నది. నిరక్షరాస్యత, పేదరికం, కొద్ది మంది చేతుల్లో సంపద కేంద్రీకరణ, బలహీనవర్గాల అణచివేత సమాజానికి శాపం లాంటివి. ఎటువంటి బలహీనతలు లేకుండా అందరికీ విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యాలుగా అభివృద్ధి చేస్తే ఎవరైనా హర్షిస్తారు. కాని నరేంద్ర మోడీ, చంద్రబాబు మోడల్ అభివృద్ధిలో ఈ అంశాలు లేవు. బాగా డబ్బున్న సంపన్నులు, బాగా బలిసిన పెట్టుబడి దారులు, వారికి సేవలు చేసేందుకై ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, మెట్రో రైళ్ళు ఉండాలని వారు కోరుకుం టున్నారు. ఉపాధి రహిత అభివృద్ధి సమాజానికి శాపం తప్ప ఉపయోగం లేదని ప్రపంచ అను భవం చెబుతున్నా ఈ మరమనుషులకు మాత్రం అర్థం కాదు.

గత వారం చంద్రబాబు చైనాలో పర్యటించారు. మే మాసంలో నరేంద్ర మోడీ చైనా పర్యటనకు వెళుతున్నారు. చైనాలో కార్మికుల సంక్షేమం పట్ల అక్కడి ప్రభుత్వం తీసుకున్న చర్యలు కొన్నైనా వారికి అర్థమైతే ఇటువంటి దుర్మార్గమైన చట్ట సవరణలకు పూనుకోరు. చైనాలో యూనియన్‌ను ఏర్పాటు చేసుకోవటం కార్మికుల ప్రాధమిక హక్కు. ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో కార్మిక ప్రతినిధులకు యాజమాన్య కమిటీల్లో కీలకమైన పాత్ర ఉ ంటుంది. ప్రైవేట్ పరిశ్రమల్లో కనీస వేతనాలు ఖచ్చితంగా అమలు చేసే యంత్రాంగం అన్ని స్థాయిల్లో ఉంటుంది. అంతేగాక పరిశ్రమల లాభాలను బట్టి సమిష్టి బేరసారాల ద్వారా కనీస వేతనాలకు మించి వేతనాలు ఇప్పించటా నికి ఒక ప్రభుత్వ విభాగమే పనిచేస్తుంటుంది. ప్రపంచంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన దేశాల్లో చైనా అగ్ర స్థానంలో ఉన్నది. ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు ఇతరత్రా విషయాల్లో రాయితీలిచ్చినా కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుంది. అయినా అక్కడ పెట్టుబడులు పెట్టడానికి అందరూ ఆసక్తి చూపుతున్నారు. అలాంటపుడు కార్మికులకు హక్కులు ఉంటే పెట్టుబడులు రావు అనే వాదన ఎంత పసలేనిదో అర్థం చేసుకోవచ్చు. సంపద సృష్టించే కార్మికుల చేతులు, కాళ్ళు కట్టేసి సంపద అనుభవించే వారికే కొమ్ము కాస్తున్న నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు ఇరువురూ కార్మిక వర్గానికి సహజ వ్యతిరేకులు కాబట్టే చట్ట సవరణలు చేసి కార్మికుల నోరు నొక్కేస్తున్నారు.

> **"చైనాలో యూనియన్‌ను ఏర్పాటు చేసుకోవటం కార్మికుల ప్రాధమిక హక్కు. ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో కార్మిక ప్రతినిధులకు యాజమాన్య కమిటీల్లో కీలకమైన పాత్ర ఉంటుంది. ప్రైవేట్ పరిశ్రమల్లో కనీస వేతనాలు ఖచ్చితంగా అమలు చేసే యంత్రాంగం అన్ని స్థాయిల్లో ఉంటుంది. అంతేగాక పరిశ్రమల లాభాలను బట్టి సమిష్టి బేరసారాల ద్వారా కనీస వేతనాలకు మించి వేతనాలు ఇప్పించటా నికి ఒక ప్రభుత్వ విభాగమే పనిచేస్తుంటుంది."**

పారిశ్రామికీకరణ ప్రారంభమైనప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గాన్ని పెట్టుబడికి బానిసలుగా మార్చే ప్రయత్నాలు చాలా జరిగాయి. కాని కార్మికవర్గం ప్రతిఘటించి పోరాడి తన స్థితిని మెరుగు చేసుకుంటూ ముందుకు పోతున్నది. నేడు బిజెపి, టిడిపిలు కూడా పెట్టుబడిదారుల కొమ్ము కాస్తూ కార్మికుల హక్కులపై దాడిచేస్తున్నారు. కార్మిక వర్గం సమైక్యంగా ప్రతిఘటించటం తప్ప వేరే మార్గం లేదు. ఇప్పటికే ఈ విధానాలకు వ్యతిరేకంగా ఎల్ఐసి, బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు సమ్మెలు చేశారు. రైల్వే ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పోరుబాటలో ఉ న్నారు. కోటి మందికి పైగా ఉన్న స్కీం వర్కర్లు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. బిఎంఎస్‌తో సహా కేంద్ర కార్మిక సంఘాలన్నీ ఈ చట్ట సవరణలకు వ్యతిరేకంగా ఉద్యమ బాటలో ఉన్నాయి. రాబోయే జూన్, జులై మాసాల్లో దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంసిద్ధమవుతున్నారు. గతంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం బహుళ జాతి కంపెనీలకు తలొగ్గి ఇటువంటి సంస్కరణలు చేయటానికి సిద్ధపడి నపుడు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెల ద్వారానే కార్మికవర్గం ప్రభుత్వ విధానాన్ని ఎదుర్కొని వెనక్కికొట్టింది. భారతదేశ అనుభవం ప్రపంచంలోని చాలా దేశాల అనుభవాలకు భిన్నంగా ఉన్నది. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 15 సార్వత్రిక సమ్మెలు జరిగిన ఘటనలు బహుఅరుదుగా ఉన్నాయి. పాలకవర్గాలు ప్రారంభించిన ఈ ప్రకటిత యుద్ధాన్ని ఎదుర్కొని, కార్మికుల హక్కులను కాపాడేందుకు అవసరమైన సమైక్య ఉద్యమాన్ని నిర్మించటం కార్మిక సంఘాల ప్రథమ కర్తవ్యం. అందుకు అవసరమైన కృషి ఇప్పటికే ప్రారంభమైంది. రాబోయే కాలంలో బిజెపి, టిడిపిలకు బుద్ధిచెప్పటానికి కార్మికవర్గం సాగించే ప్రతి పోరాటాన్ని బలపరచటం, ఆ పోరాటాల్ని ముందుకు తీసుకొనిపోవటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవటం ప్రజాతంత్రవాదులందరి కర్తవ్యం. ●

## వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయం

(9వ పేజీ తరువాయి)

సమీకరించి వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణంలో ముందడుగు వేయగలము.

దేశ ప్రజలకు విశాఖపట్నంలో జరుగుతున్న సిపిఐ(ఎం) జాతీయ మహాసభ విస్పష్టమైన సందేశం ఇస్తుంది. నయాఉదారవాద, అవినీతి కర, మతోన్మాద పరిపాలనకు వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయమే తప్ప మరో ప్రత్యామ్నాయం లేదన్న సందేశమే ఇది.

భారత కమ్యూనిస్టు పార్టీ ( మార్క్సిస్టు)కి నూతన దిశా నిర్దేశం చేయటంలో విశాఖపట్నం మహాసభలు ఒక మైలురాయిగా నిలుస్తాయన్న నమ్మకం నాకుంది. ప్రజాస్వామ్యం, లౌకితత్వం, సామాజిక న్యాయం, వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయ నిర్మాణం దిశగా మనం చేసే ప్రయత్నాలకు ప్రజల మద్దతు సమీకరించటానికి అవసరమైన ధైర్యాన్ని, శక్తిని, నిబద్ధతను ఈ మహాసభలు పార్టీ శ్రేణులకు అందిస్తాయన్న ఆశాభావంతో మనం ముందడుగు వేద్దాం.

**శక్తివంతమైన సిపిఐ(ఎం) నిర్మిద్దాం.**
**విశాల వామపక్ష ఐక్యత సాధిద్దాం.**
**వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయానికై పోరాడుదాం.**

అనువాదం : కె. వీరయ్య

# సభ్యులకు బీమా సౌకర్యమంటే ఏమిటి ?


రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు

**ఎస్. వీరయ్య**

**టి**ఆర్ఎస్ నాయకత్వం తమ పార్టీ సభ్యులందరికీ బీమా పథకం ప్రారంభించింది. కార్యకర్తల సంక్షేమం కోసం 10 కోట్ల రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఉంచామని కేసీఆర్ ప్రకటించారు. వీరి కన్నా ముందే టిడిపి కార్యకర్తల సంక్షేమం కోసం నిధులు కేటాయించా మని, ఆ బాధ్యతలు నారా లోకేష్ బాబు చూస్తున్నారని చంద్రబాబు నాయుడు చెప్పారు. కొంత మందికి కార్యకర్తల పేరు మీద ప్రతి నెలా 1000 రూపాయలు వారి అక్కౌంట్‌లో వేస్తున్నారు. ఈ మధ్య వైసిపిలో కొంత మంది అధికార ప్రతినిధులకు పెద్ద ఎత్తున వేతనాలు చెల్లిస్తున్నారు. బూర్జువా పార్టీల్లో ఇదొక కొత్త పరిణామం. దీనిని ఎలా అర్థం చేసుకోవాలి?

కమ్యూనిస్టు పార్టీల్లో కార్యకర్తలకు గౌరవ వేతనాలు చెల్లించే పద్ధతి చాలా కాలంగా ఉన్నది. బూర్జువా పార్టీలు చెల్లించేవీ, కమ్యూనిస్టు పార్టీల్లో అమలు జరుగుతున్నదీ ఒక్కటేనా? పైపైన చూస్తే ఇది చాలా చిన్న సమస్యగానే కనపడుతోంది. కానీ ఈ రెండింటి మధ్య భూమి–ఆకాశాల మధ్య ఉన్నంత తేడా ఉన్నది. ఏమిటాతేడా?

కమ్యూనిస్టు పార్టీలో సభ్యుల నుండి నాయకుల వరకు తమతమ ఆదాయాలను బట్టి పార్టీ నిర్ణయించిన లెక్క ప్రకారం లెవీ రూపంలో పార్టీకి చెల్లిస్తారు. అదనంగా తమ శక్తి మేరకు ప్రజల నుండి విరాళాలు సేకరించి పార్టీకి జమ చేస్తారు. పార్టీ అవసరాల కోసం అనేక మంది కార్యకర్తలు తమ ఆస్తులను ధారపోస్తారు. బూర్జువా పార్టీల్లో సభ్యుల కోసం, కార్యకర్తల కోసం పార్టీ ఖర్చు పెడుతున్నదని చెబుతున్నారు. ఏమిటీతేడా? కమ్యూనిస్టు పార్టీకి విరాళాలు ప్రజల నుండే రావాలి. ప్రజలకోసం పని చేస్తున్న పార్టీ ప్రజల నుండే నిధులు సేకరిస్తుంది. ప్రజల నుండి నిధులు సేకరించే ముందు సభ్యులు, కార్యకర్తలు, నాయకులు తమ వంతు వ్యక్తిగత బాధ్యతగా తమ ఆదాయ మోతాదును బట్టి తమ విరాళాన్ని లెవీ రూపంలో చెల్లిస్తారు. ప్రజల కోసమే పుట్టి, ప్రజల కోసమే పని చేస్తున్న పార్టీ కమ్యూనిస్టు పార్టీ. కార్మికవర్గ విముక్తి కోసం పోరాడేది కమ్యూనిస్టు పార్టీ. ఆ లక్ష్యానికి కట్టుబడి, ఆ సిద్ధాంతానికి ఆకర్షితులై పార్టీకి, ప్రజలకు అంకితమై పని చేస్తారు కార్యకర్తలు, సభ్యులు, నాయకులు. అందుకోసమే ప్రజా ప్రయోజనం కోసం తమ వంతు త్యాగం చేస్తారు. తమకు పార్టీ ఏమి ఇచ్చిందని అడగరు. పార్టీనుంచి ఏదో ఆశించి పార్టీలో చేరలేదు. స్వచ్ఛందంగా ప్రజలకోసం పని చేయాలనే లక్ష్యంతో చేరారు. అందుకే స్వప్రయోజనం కన్నా, ప్రజల ప్రయోజనం, పార్టీ ప్రయోజనమే మిన్నగా ఎంచుకుంటారు. ఆ మేరకు పార్టీలో చేరేటప్పుడు ప్రమాణం చేస్తారు. ఇది కమ్యూనిస్టుల ప్రత్యేకత.

**కమ్యూనిస్టు కార్యకర్తలకు వేతనాలు:**

ఇంత వరకు బాగానే ఉన్నది. మరి పూర్తికాలం కార్యకర్తలకు వేతనం ఎందుకు చెల్లిస్తారు? ఇక్కడే కొన్ని విషయాలు కమ్యూనిస్టు పార్టీల వెలుపలనున్న వారికి అర్థం కావాలి. ఇక్కడ వేతనం అంటే పనికి తగిన పరిహారం కాదు. ఎవరికోసం ఎవరూ పనిచేయడం లేదు. ప్రజలకోసం, కార్మికవర్గ విముక్తి కోసం, సమాజ మార్పు కోసం తమ జీవితాలను అంకితం చేసినవారే కమ్యూనిస్టు పార్టీలో పూర్తికాలం కార్యకర్తలుగా పనిచేస్తున్నారు. వీరెవ్వరూ బ్రతుకుదెరువు కోసం వచ్చినవారు కారు. ఆస్తులు సంపాదించుకోవడానికి మార్గం లేక కాదు. ఉన్నతస్థాయి ఉద్యోగాలు పొందడానికి అవకాశం లేకపోవడం వల్ల కూడా కాదు. సమాజంలో హెూదాలు, పదవులు పొందడానికి ఉన్న మార్గాలను వదులుకుని, ఉన్నత చదువులు చదివి కూడా పేదలకోసం అంకితమై పని చేస్తున్నారు. విప్లవం కోసం పని చేయడమే వీరి వృత్తి. కార్మికవర్గ విముక్తికోసం కృషి చేయడమే వీరి పని. అందుకే వీరిని "వృత్తి విప్లవకారులు" అంటున్నాం. ఇంతటి ఉన్నతమైన లక్ష్యాలను అర్థం చేసుకుని వారి జీవిత భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులు కూడా సహకరించడం వల్లనే ఈ కమ్యూనిస్టు కార్యకర్తలు తమ కృషిలో ఎంతో కొంత జయప్రదం అవుతున్నారు. వారసత్వంగా వచ్చిన ఆస్తిపాస్తులు ఉంటే కుటుంబ పోషణకు వాటినే ఉపయోగిస్తారు. లేదా జీవిత భాగస్వామి సంపాదనాపరులైతే కుటుంబ పోషణ బాధ్యత ప్రధానంగా వారే చూస్తున్నారు. ఈ రెండూ లేనప్పుడు లేదా కనీస అవసరాలకు సరిపోన ప్పుడు ఆ కుటుంబ పోషణ కనీస అవసరాల మేరకు కమ్యూనిస్టు పార్టీ వేతనం రూపంలో చెల్లిస్తున్నది. అందుకే వేతనం అనే పేరు పెట్టినా, అది వేతనం కాదు. మరో పేరు లేదు కనుక వేతనం అనే పిలుస్తున్నాము. అందుకే కమ్యూనిస్టు పార్టీలో నాయకులకు, కార్యకర్తలకు వేర్వేరు వేతనాలు ఉండవు. ఆ కుటుంబం బతకడానికి కనీస అవసరాల ప్రాతిపదిక మీద వేతనం నిర్ణయించబడుతుంది. అందరికీ అదే వర్తిస్తుంది.

సారాంశంగా చెప్పాలంటే, కమ్యూనిస్టు పార్టీలో సభ్యులు, కార్యకర్తలు, నాయకులు చేస్తున్నది త్యాగం. వీరే కాదు, అనేక మంది శ్రేయోభిలాషులు కూడా చేస్తున్నది ఇదే. వీరి జీవితాలు ప్రజలకు ఫలాలు అందించే వృక్షాలు గాను, వెలుగునిచ్చి కరిగిపోయే కొవ్వొత్తులు గానూ ఉంటాయి. పార్టీ కోసం పని చేయడం, ఖర్చు పెట్టడమే తప్ప పార్టీ నాకేమి చ్చిందనే ప్రశ్న ఉదయించదు. ఈ త్యాగనిరతి కేవలం కమ్యూనిస్టులకు మాత్రమే సొంతం కాదు. చరిత్రలో అనేక మంది దేశ భక్తులు, సంఘ సంస్కర్తలు, నిస్వార్థ ప్రజా సేవకులు ఈ కోవకు చెందినవారు మనకు కనిపిస్తారు. అందుకే ప్రజలకు అంకితమై పనిచేసే త్యాగమూర్తులు కమ్యూనిస్టులైనా, సంఘసంస్కర్తలైనా, నిస్వార్థ ప్రజా సేవకులైనా ఆదర్శప్రాయులే.

> **"సారాంశంగా చెప్పాలంటే, కమ్యూనిస్టు పార్టీలో సభ్యులు, కార్యకర్తలు, నాయకులు చేస్తున్నది త్యాగం. వీరే కాదు, అనేక మంది శ్రేయోభిలాషులు కూడా చేస్తున్నది ఇదే. వీరి జీవితాలు ప్రజలకు ఫలాలు అందించే వృక్షాలు గాను, వెలుగునిచ్చి కరిగిపోయే కొవ్వొత్తులు గానూ ఉంటాయి. పార్టీ కోసం పని చేయడం, ఖర్చు పెట్టడమే తప్ప పార్టీ నాకేమి చ్చిందనే ప్రశ్న ఉదయించదు."**

**బూర్జువా పార్టీల్లో వేతనాలు–సౌకర్యాలు :**

టిఆర్ఎస్, టిడిపి లేదా వైసీపీలు చెల్లించే వేతనాలకు, బీమా సౌకర్యాలకు కమ్యూనిస్టులు, సంఘసంస్కర్తల త్యాగాలకు పోలిక ఉన్నదా? ప్రజల కోసం పార్టీలో చేరేవారు కమ్యూనిస్టు పార్టీ సభ్యులు. అందుకే అట్లా చేరేవారు కొందరే ఉంటారు. బూర్జువా పార్టీల్లో అందరినీ చేర్చుకుంటారు. ప్రజలు తమ అవసరాల కోసం చేరుతూ ఉంటారు. సభ్యత్వం చేరడానికి, వారిని ఆకర్షించేందుకు బీమా వంటి సౌకర్యాలను ఎరగా వేస్తున్నారు. పార్టీ సభ్యత్వ క్యాంపెయిన్ కూడా బహిరంగంగా ఒక ఎన్నికల క్యాంపెయిన్ లాగా నిర్వహిస్తున్నారు. అందుకే ఈ కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వానికి, ఇతర పార్టీల సభ్యత్వానికి పోలిక లేదు. ప్రజలకోసం పార్టీలో చేరడం కమ్యూనిస్టుల పద్ధతి అయితే, తమకోసం పార్టీలను ఆశ్రయించడం ఇతరుల పద్ధతి.

బూర్జువా పార్టీల్లో నాయకులు కాంట్రాక్టులు సంపాదించుకోవడం, వ్యాపారాలు చేసుకోవడం, ఆస్తులను కాపాడుకోవడం లక్ష్యంగా పనిచేస్తారు. ఆ మేరకు తమ కార్యకర్తల కోసం కొంత ఖర్చు పెడతారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా పై నాయకుల అండదండలతో పైరవీలు చేస్తూ తమ చేతివాటం ప్రదర్శిస్తూ ఉంటారు. ఇది చాలా కాలంగా ఉన్నదే. ఇప్పుడు పరిస్థితి మారింది. సరళీకృత విధానాలు అమలులోకి వచ్చాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అనతికాలంలోనే అనూహ్యంగా సంపాదించ గలుగుతున్నారు. దీనికే "ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం" అన్న ముద్దుపేరు స్థిరపడ్డది. దీనితో పాటే రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు పెట్టుబడిదారుల అపవిత్ర బంధం బలపడింది. వీరి అవినీతికి ఆకాశమే హద్దు. దాని ముద్దు బిడ్డలే దేశాన్ని పట్టి పీడిస్తున్న పెద్దపెద్ద కుంభకోణాలు. 2జి స్పెక్ట్రం, బొగ్గు కుంభకోణాల దగ్గర నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసిన సత్యం, గనుల కుంభకోణం వరకు ఈ కోవకు చెందినవే. దోచుకోగలిగినవారికి దోచుకున్నంత. పెద్దోళ్ళమేతకు హద్దులు లేనప్పుడు, కింది స్థాయి కార్యకర్తలు కేవలం పైరవీ కారులుగా ఉండాలంటే అంగీకరిస్తారా? అందుకే వీరు కూడా కాంట్రాక్టర్లుగా, వ్యాపారస్తులుగా ప్రమోషన్ కోరుతున్నారు. ఆ మేరకు వీరికీ అందవలసింది అందుతున్నది. పై నుండి క్రింది వరకు నేతలందరూ మేతలకు మరిగినప్పుడు సభ్యులను మభ్యపెట్టగలరా? కార్యకర్తలను కేవలం బిర్యానీ ప్యాకెట్లతో మెప్పించగలరా? అందుకే వారి అక్రమ సంపాదననుండి కొంత కింది స్థాయి కార్యకర్త లకు, సభ్యులకు కూడా ఖర్చుపెట్టాలని నిర్ణయించుకున్నారు. అంటే అవినీతిని అట్టడుగు స్థాయికి విస్తరించడమే. సభ్యులకు బీమా అన్నా, కార్యకర్తల సంక్షేమం కోసం నిధుల కేటాయింపు గురించి చెప్పినా, ఈ డబ్బు పార్టీకి ఎక్కడ నుంచి వస్తున్నట్టు? ప్రభుత్వ ఖజానాను కొల్లగొడితేనో, గనుల నుండి సంపద తవ్వుకుంటేనో, కార్మికుల, రైతుల శ్రమను దోచుకుంటేనో ఒనగూడే సొమ్మే కదా! పాపం సాధారణ ప్రజలకు ఇన్ని లోతులు తెలియవు. ఈ పాలకులు అనుసరిస్తున్న ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగానే వారి మీద భారాలు పెరుగుతు న్నాయని, జీవితంలో భద్రత కరువైందని ఇంకా అర్థం కాలేదు. ఈ బాధల నేపథ్యంలో ఫలానా పార్టీలో సభ్యత్వం చేరితే భీమా సౌకర్యమనో, మరో అవకాశమనో భావించి చేరుతున్నారు. ఆ వచ్చే కొద్దిపాటి అవకాశాన్ని వేడినీళ్ళకు చన్నీళ్లుగా భావిస్తున్నారు. జేబు కత్తిరించినవాడే టిక్కెట్టుకు డబ్బులిచ్చి, కన్నీళ్ళు తుడిచి ఆదుకున్నట్లు పోజులిస్తున్న విషయాన్ని గుర్తించలేకపోతున్నారు.

**ఇంకుతున్న అవినీతి :**

బూర్జువా పార్టీలు ఇలాంటి చర్యలకు పూనుకోవడమంటే తమ దోపిడీకి, అవినీతికి మద్దతుగా ప్రజల్లో నిర్మాణాత్మకమైన యంత్రాంగాన్ని రూపొందించుకోవడమే. మరో విధంగా ఇది కూడా ఒక సైద్ధాంతిక సవాలు. పైగా ఇదే అయుధాన్ని కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, కార్యకర్తలపైన కూడా ప్రయోగిస్తారు. కమ్యూనిస్టు పార్టీలో ఉంటే మీకు ఏమొస్తుంది? అని సానుభూతి వాక్యాలు వల్లిస్తారు. ఏ మాత్రం మెత్తబడినా ఒత్తడానికి, దారి తప్పించడానికి ప్రయత్నిస్తారు. దీన్ని సమర్ధవంతంగా ఎదుర్కోవలసిన బాధ్యత కమ్యూనిస్టు శ్రేణుల మీద ఉన్నది. అందుకే పార్టీ సభ్యులు, సానుభూతిపరులను చైతన్యపరచుకోవాల్సిన అవసరం ఉన్నది. ఇదొక సైద్ధాంతిక సమస్య. సైద్ధాంతిక పటుత్వం, ఆచరణలో నిబద్ధతతోనే సమాధానం చెప్పగలం. ప్రజా ప్రయోజనాలే తమ ప్రయోజనాలుగా పని చేస్తున్న కమ్యూనిస్టులకిది సాధ్యమే. ఇక సాధారణ ప్రజలకు సంబంధించినంత వరకు ఇది భిన్నంగా ఉంటుంది. ఈ విషయం సూటిగా చెబితే జనం అర్థం చేసుకోవడానికి బదులు, అపార్థం చేసుకుంటారు. వారికి అందుబాటులోకి వస్తున్న అవకాశాలను అడ్డుకుంటున్నామనుకుంటారు. అందుకే ఇది సున్నితమైన సమస్య. ప్రజలకు మరింత చేరువై, వారి సమస్యల పరిష్కారం కోసం అనుక్షణం కృషి చేయడం ద్వారా మాత్రమే ప్రజల మన్ననలను పొందగలం. ప్రజా సమస్యల మీద రాజీలేని పోరాటం చేయడం, పాలక వర్గాలను ప్రజల ముందు ముద్దాయిలుగా నిలబెట్టడం ద్వారా మాత్రమే బూర్జువా పార్టీల ఎత్తుగడలను చిత్తు చేయగలం.

# స్ఫూర్తినింపిన విశాఖ మహాసభలు



ఎస్. వెంకట్రావు

పార్టీ విధానంపై ఆద్యంతం ఆత్మవిమర్శనాపూర్వక చర్చలు, దేశం ఎదుర్కొంటున్న వివిధ తక్షణ సమస్యలపై తీర్మానాలు, స్వదేశీ, విదేశీ కమ్యూనిస్టు, వామపక్ష పార్టీల సౌహార్ద సందేశాలు, రాగల కాలంలో పార్టీని నడిపించే సమర్ధ, సమిష్టి నాయకత్వ ఎన్నికలు, సభా ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రాంగణం వెలపల సాంస్కృతిక ఉత్సవాలు, చివరిగా పోరాట నినాదాలతో ప్రజా ప్రదర్శన, సముద్ర తీరాన ఉత్సాహంగా మహాజన సభ, ఉత్తేజపూరితమైన నాయకుల ప్రసంగాలు... ఇదీ సంగ్రహంగా విశాఖలో ఏప్రిల్ 14 నుండి 19 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అఖిల భారత మహాసభలు జరిగిన తీరు.

కాలాన్ని మహాసభకు ముందూ, తరువాత అని విభజిస్తే పార్టీ క్యాడర్‌లో, అభిమానుల్లో సభకు ముందున్న నిరుత్సాహం, నిర్లిప్తతలను మహాసభ పటాపంచలు చేసిందని చెప్పవచ్చు. పార్టీ ఇటీవలి కాలంలో ప్రజాపునాదిని ఎందుకు కోల్పోతోంది, ఎన్నికల్లో ఎందుకు దెబ్బలు తింటోంది, మొత్తంగా వామపక్షాలు, వాటి రాజకీయాలు వెనకపట్టు పట్టి మితవాద రాజకీయాలవైపు దేశాన్ని మళ్లిస్తున్న పరిస్థితులకు పార్టీ విధానం ఎంతవరకు కారణం, భౌతిక పరిస్థితులు ఎంతవరకు కారణం?.... ఈ అంశాలను ఆత్మ విమర్శనాపూర్వకంగా చర్చించుకుని గతం నుండి గుణపాఠాలు తీసుకుని భవిష్యత్తుకు బాటలు వేసిన మహాసభలివి. మహాసభలిచ్చిన కర్తవ్యాలను ఆచరణలో పెట్టేందుకు మరో ఆరుమాసాల్లో నిర్మాణ ప్లీనం జరుపుకుని, ప్రజాపోరాటాలను బలోపేతం చేయాలని మహాసభ ఇచ్చిన పిలుపు యావత్తు పార్టీకి కొత్త ఉత్సాహం ఇస్తుంది. అందుకే ఈ మహాసభలు నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సీతారామ్ ఏచూరి చెప్పినట్లు "కాంగ్రెస్ ఆఫ్ ఫ్యూచర్" – భవిష్యత్తును నిర్మించే మహాసభలు.

మహాసభలు ప్రారంభం కాకముందే విశాఖ నగరం పండగ వాతావరణం సంతరించుకుంది. మహాసభల సందర్భంగా 10 తేదీన ప్రారంభమై 18న ముగిసిన వైజాగ్ ఫెస్ట్, ఉత్తరాంధ్ర సంస్కృతీ సాహిత్య సంబరాలతో విశాఖ పట్నానికి నూతన సాంస్కృతిక శోభను సంతరింపజేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన ఈ ఫెస్ట్‌లో పుస్తకాల ప్రదర్శన, జానపదకళా ప్రదర్శనలు, నృత్యాలు, వీధినాటికలు, సైన్స్ ఎగ్జిబిషన్, సాహితీ దశాహం, ఫుడ్ ఫెస్టివల్ తదితరాలు విశాఖ వాసులను అమితంగా ఆకర్షించాయి. ప్రత్యామ్నాయ సాంస్కృతీ నిర్మాణ సూచికలనిచ్చాయి. వర్గ పోరాటాలు, సామాజిక పోరాటాలతో బాటు సాంస్కృతిక రంగంలో కూడా తీవ్రమైన కృషి చేయాలని పార్టీ ఇచ్చిన పిలుపు మహాసభ సందర్భంగా జరిగిన వైజాగ్ ఫెస్ట్‌లో ప్రతిఫలించింది.

14వ తేదీ ఉదయం సీనియర్ పార్టీ నేత మహమ్మద్ అమీన్ పతాకావిష్కరణ, అమరవీరులకు నివాళులర్పించడంతో మహాసభలు ప్రారంభమైనాయి. పొలిట్‌బ్యూరో సభ్యులు ఎస్. రామచంద్రన్ పిళ్లై అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ఆహ్వాన సంఘ అధ్యక్షులు కామ్రేడ్ మధు మాట్లాడుతూ కార్మిక వర్గ కేంద్రంగా విశాఖ విశిష్టతను తెలిపారు. హుదూద్ తుపాను నేపథ్యంలో మహాసభ నిర్వహణ తమకు ఒక యజ్ఞం అన్నారు. అడుగడుగునా ప్రజలిచ్చిన ప్రోత్సాహంతో నిర్వహిస్తున్న ఈ సభల్లో లోటుపాట్లుంటే ప్రతినిధులు సర్దుకు పోవాలని చెప్పారు. కానీ మహాసభ ముగిసే నాటికి తమకు జరిగిన ఏర్పాట్లపై ప్రతినిధులంతా పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారంటే నిర్వాహకులు ఎంత పకడ్బందీగా ఏర్పాట్లు చేశారో అర్ధమవుతుంది. మహాసభ ముగిసిన తరువాత నూతన ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి పార్టీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శికి లేఖ రాస్తూ "మహాసభల సందర్భంగా చేసిన ఏర్పాట్ల పట్ల ప్రతినిధులు ఎంతగానో సంతోషం వ్యక్తం చేశారు" అని పేర్కొన్నారు.

ప్రారంభ సభలో కామ్రేడ్ ప్రకాశ్ కరత్ ఉపన్యాసం, ఆ ఉపన్యాసంలోని అనేక అంశాలతో ఏకీభవిస్తూ సిపిఐ, ఆర్ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్, ఎస్‌యుసిఐ(సి), సిపిఐ(ఎంఎల్, లిబరేషన్) పార్టీల నేతలు చేసిన సౌహార్ద ప్రసంగాలూ వామపక్షాల ఐక్యత పట్ల విశ్వాసం పాదుకొల్పాయి. కేంద్రంలో అధికారంలో ఉన్నది, ఒకవైపు నయా–ఉదారవాద విధానాలూ, మరోవైపు మతతత్వ విధానాలూ కలిపి అమలుపరుస్తున్న అత్యంత ప్రమాదకరమైన మితవాద ప్రభుత్వం. దీన్ని ఎదుర్కోవడం, ప్రత్యామ్నాయాన్ని నిర్మించడం నయా–ఉదారవాద విధానాలను అనుసరించే బూర్జువా పార్టీల వల్ల కాదు. వామపక్షాలు మాత్రమే ఆ పనిచేయగలవు, చేయాలి అని ప్రకాశ్ కరత్ విశ్లేషించారు. ఆ పని చేయాలంటే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం

అవసరం, అటువంటి సంఘటనను నిర్మించాలంటే మార్క్సిస్టు పార్టీ స్వతంత్ర బలం పెరగాలి. పోరాటాలు, ఉద్యమాల ద్వారానే పార్టీ స్వతంత్ర బలం పెరుగుతుంది. నయా-ఉదారవాద, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా విశాల ప్రజారాశులను కదిలించి పోరాడ్డం ద్వారా మాత్రమే పార్టీ ప్రజా పునాది పెరుగుతుంది అని కరత్ చెప్పారు. సౌహార్ద సందేశాలిచ్చిన వామపక్ష నాయకులంతా కరత్ విశ్లేషణతో అంగీకరించారు. వామపక్ష ఐక్యతను నొక్కి చెప్పారు. ప్రారంభోపన్యాసం ముగింపులో సీతారామ్ ఏచూరి విదేశీ పార్టీల సౌహార్ద సందేశాలను చదివి వినిపించారు. చైనా, క్యూబా, వియత్నాం, రష్యా, గ్రీస్, జపాన్ కమ్యూనిస్టు పార్టీలతో సహా ముప్పయికి పైగా పార్టీలు సౌహార్ద సందేశాలు పంపాయి.

14వ తేదీ మధ్యాహ్నం ప్రతినిధుల సభను ప్రారంభిస్తూ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ పార్టీ రాజకీయ ఎత్తుగడల సమీక్షా నివేదిక ముసాయిదాను ప్రవేశపెట్టారు. పార్టీ 21వ మహాసభలకు సంబంధించి ఈ నివేదిక అత్యంత కీలకమైంది. మామూలుగా మహాసభల్లో రెండు ముసాయిదా నివేదికలే – రాజకీయ తీర్మానం, రాజకీయ-నిర్మాణ నివేదిక పెడతారు. కానీ ఈ మహాసభలో వాటితో పాటు రాజకీయ ఎత్తుగడల సమీక్షా నివేదిక ముసాయిదాను కూడా ప్రవేశపెట్టారు. ఈ నివేదికను ప్రవేశపెడుతూ...గత 25 ఏళ్లుగా, అంటే పార్టీ 13వ మహాసభ నాటి నుండి అనుసరిస్తూ వస్తున్న రాజకీయ ఎత్తుగడల పంథానే సమీక్షకు ప్రాతిపదికగా ఎందుకు తీసుకోవలసి వచ్చింది, అంతకు ముందు మహాసభలనుండి ఎందుకు తీసుకోలేదు అనే అంశంపై కరత్ వివరణ ఇచ్చారు. మార్క్సిస్టు పార్టీ ఏర్పడింది 1964లో కలకత్తాలో జరిగిన ఏడవ మహాసభలో. 1978లో జలంధర్‌లో జరిగిన 10వ మహాసభలో పార్టీ 'వామపక్ష ప్రజాతంత్ర సంఘటన' నిర్మాణం అనే మధ్యంతర దశను కర్తవ్యంగా ప్రకటించింది. అంతకు ముందు మన కార్యక్రమంలో చెప్పిన 'జనతా ప్రజాతంత్ర సంఘటన' నిర్మాణమే మన తక్షణ కర్తవ్యంగా కూడా ఉండేది. 10వ మహాసభ తరువాత మన కర్తవ్యం వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం నుండి క్రమంగా పక్కకు మళ్లుతూ వచ్చింది. యునైటెడ్ ఫ్రంట్, తృతీయ ప్రత్యామ్నాయం ఇలా మారుతూ చివరికి ఇప్పుడు 21వ మహాసభలో మళ్లీ వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణమే తక్షణ కర్తవ్యం అనే స్థితికి వచ్చాం. అందువల్ల 10వ మహాసభనుండి సమీక్ష జరగాలని అభిప్రాయాలు వచ్చాయి. మరికొందరైతే 7వ మహాసభనుండే సమీక్షించాలని కోరారు. అయితే 13వ మహాసభ నుండి పాతికేళ్ల సమీక్ష జరపడానికి నాలుగు కారణాలున్నాయని కరత్ వివరించారు. అవి (1) 13వ మహాసభ కాలంలోనే అంటే 1990-91 లోనే సోషలిస్టు సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై ప్రపంచ బలాబలాల్లో పెనుమార్పులు సంభవించాయి. (2) ఈ కాలంలోనే మన దేశంలో పాలక వర్గాలు సరళీకరణ విధానాలు అమలు పరిచాయి. (3) ఈ కాలంలోనే దేశంలో బిజెపీ- ఆర్‌ఎస్‌ఎస్ హిందుత్వ శక్తులు జడలు విప్పాయి. (4) ఈ కాలంలోనే మన దేశంలో కులపరమైన అస్థిత్వ వాదాలు పెరిగాయి.

రెండు మాసాల ముందుగానే బహిరంగంగా విడుదల చేసిన సమీక్షా నివేదికపై ప్రధాన కార్యదర్శి అత్యంత సూటిగా, ఆత్మ విమర్శనా పూర్వకంగా మాట్లాడారు. ప్రతినిధులు కూడా అదే రీతిలో విమర్శ-ఆత్మవిమర్శతో నివేదికపై చర్చల్లో పాల్గొన్నారు. చర్చలు ప్రధానంగా రెండు అంశాలపై కేంద్రీకృతమయ్యాయి. మొదటిది, వామపక్ష ప్రజాతంత్ర సంఘటన పునరుద్ధరణ. రెండోది, మన ఎన్నికల ఎత్తుగడలు ఎలా ఉండాలి? మహాసభ రెండవ రోజంతా చర్చలు జరిగాయి. చివరిలో కరత్ వివరణ ఇచ్చారు.

" రెండు మాసాల ముందుగానే బహిరంగంగా విడుదల చేసిన సమీక్షా నివేదికపై ప్రధాన కార్యదర్శి అత్యంత సూటిగా, ఆత్మ విమర్శనా పూర్వకంగా మాట్లాడారు. ప్రతినిధులు కూడా అదే రీతిలో విమర్శ-ఆత్మవిమర్శతో నివేదికపై చర్చల్లో పాల్గొన్నారు. చర్చలు ప్రధానంగా రెండు అంశాలపై కేంద్రీకృతమయ్యాయి. "



**"నయా-ఉదారవాద విధానాలు అమలు జరిపే రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కూడా పార్టీ పోరాటం చేయాలి. శ్రామికులను సంఘటితం చేసి, వారిని వామపక్ష ప్రజాతంత్ర వేదికపైన సమీకరించాలంటే ప్రాంతీయ పార్టీల బూర్జువా-భూస్వామ్య విధానాలను రాజకీయంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది."**

ఎత్తుగడల సమీక్షా నివేదికకు మహాసభ బయటనుండి మొత్తం 1,432 సవరణలు, 136 సూచనలు రాగా మహాసభ 29 సవరణలు ఆమోదించింది. మహాసభ లోపల ప్రతినిధులు 259 సవరణలు ప్రతిపాదించగా 11 ఆమోదం పొందాయి. సవరణల అనంతరం నివేదికను సభ ఆమోదించింది.

**సమీక్షా నివేదికలోని ప్రధాన అంశాలు క్లుప్తంగా:**

వరుసగా అమలు పరుస్తూ వచ్చిన రాజకీయ ఎత్తుగడల విధానాలు ఆయా సందర్భాల్లో పార్టీకి ఎదురైన రాజకీయ పరిస్థితులను ఎదుర్కొనడానికి సహకరించాయి. అయితే నయా-ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ సమాజంలోనూ, కార్మిక వర్గంలోనూ తెచ్చిన మార్పులను సమగ్రంగా అర్థం చేసుకుని స్పందించడంలో పార్టీ వెనుకబడింది. తృతీయ ఫ్రంట్ నిర్మాణం కోసం పార్టీ చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. ఇది పోరాటాలు, ఉద్యమాల ద్వారా పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకునే కర్తవ్యం నుండి దృష్టిని పక్కకు మళ్లించింది. వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం అనేది ఆచరణ నినాదంగా కాకుండా ఒక ప్రచార నినాదంగా వెనక్కు నెట్టబడింది.

సమీక్ష తరువాత నివేదిక కొన్ని నిర్ణయాలకు వచ్చింది. అవి క్లుప్తంగా:

వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణానికి మళ్లీ పార్టీ ప్రాధాన్యత స్థానం ఇవ్వాలి. దానికి అనుగుణంగా వామపక్ష ఐక్యతను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలి. పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచడానికీ, దాని ప్రజావునాదిని విస్తరించడానికీ ప్రాధాన్యత ఇవ్వాలి. కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక ఇతర ప్రజా రంగాల్లో వచ్చిన మార్పులను నిర్దిష్టంగా అర్థం చేసుకుని పోరాటాలకు నిర్దిష్ట నినాదాలు ఇవ్వాలి. సామాజిక సమస్యలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజా సమస్యలపై ఐక్య ఉద్యమాలు చేయాలి. వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణానికి అనుగుణంగా మన ఎన్నికల ఎత్తుగడలు ఉండాలి. ప్రస్తుత ప్రాంతీయ పార్టీల పాత్ర దృష్ట్యా వాటితో జాతీయ స్థాయిలో ఎన్నికల పొత్తులు ఉండవు. దానికి బదులు రాష్ట్రాల్లో పార్టీ ప్రయోజనాలు నెరవేరుతాయనుకుంటే, ఆ రాష్ట్రంలో వామపక్ష ప్రజాతంత్ర శక్తులు బలపడ్డానికి తోడ్పడుతుందనుకుంటే రాష్ట్ర స్థాయిలో వామపక్షేతర పార్టీలతో సర్దుబాట్లు చేసుకోవచ్చు. పార్టీ పని విధానాన్ని, ప్రజా రంగాల పని విధానాన్ని మెరుగు పరిచేందుకు పార్టీ నిర్మాణంపై ప్రత్యేకంగా పార్టీ ప్లీనం జరపాలి.

ఈ సమీక్షా నివేదిక తరువాత రాజకీయ తీర్మానం ఆమోదం పొందడం తేలికే. ఎందుకంటే సమీక్షా నివేదిక తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగానే రాజకీయ తీర్మానం ఉంది. కామ్రేడ్ ప్రకాశ్ కరత్ మూడో రోజున ప్రవేశపెట్టిన రాజకీయ తీర్మానంలో జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులమీదా, రానున్న కాలానికి పార్టీ అనుసరించే విధానంమీద రోజంతా చర్చ జరిగింది. రాజకీయ తీర్మానానికి మహాసభ బయటనుండి 2,552 సవరణలు, 248 సూచనలు రాగా 74 ఆమోదం పొందాయి. మహాసభలోపల తీర్మానానికి 473 సవరణలు, 5 సూచనలు రాగా వాటిలో 55 సవరణలు ఆమోదం పొందాయి. అనంతరం తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది.

**మారిన పార్టీ పంథా**

రాజకీయ తీర్మానంలోని ఆచరణాత్మక అంశాలు కింది విధంగా ఉన్నాయి:

ఒకవైపు నయా-ఉదారవాద ఆర్థిక విధానాలూ, రెండోవైపు హిందూత్వ మతతత్వ విధానాలు అమలు చేస్తున్న బిజెపీ, మోడీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పార్టీ సైద్ధాంతికంగానూ, ప్రజా క్షేత్రంలోనూ పోరాడాలి. ఇదే మనముందున్న తక్షణ కర్తవ్యం.

బిజెపీకి వ్యతిరేకంగా పోరాటం ఎక్కుపెడుతూనే నయా-ఉదారవాద విధానాలు అనుసరించే కాంగ్రెస్‌ను కూడా పార్టీ వ్యతిరేకించాలి. కాంగ్రెస్‌తో సిపిఐ(ఎం)కు ఎటువంటి ఎన్నికల పొత్తుగానీ, అవగాహన గానీ ఉండదు.

నయా-ఉదారవాద విధానాలు అమలు జరిపే రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కూడా పార్టీ పోరాటం చేయాలి. శ్రామికులను సంఘటితం చేసి, వారిని వామపక్ష ప్రజాతంత్ర వేదికపైన సమీకరించాలంటే ప్రాంతీయ పార్టీల బూర్జువా-భూస్వామ్య విధానాలను రాజకీయంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది.

స్వతంత్ర బలాన్ని నిర్మించి పెంచుకునేందుకు పార్టీ తొలి ప్రాధాన్యత నిస్తుంది. అదే సమయంలో ప్రజా సమస్యలపైనా, జాతీయ సార్వభౌమాధికార సమస్యపైనా, రాష్ట్రాల హక్కులు, సామ్రాజ్యవాద వ్యతిరేకత మొదలైన అంశాలపై ఇతర ప్రజాతంత్ర, కాంగ్రెసేతర లౌకిక పార్టీలతో కలిసి ఐక్యకార్యాచరణ అభివృద్ధి చేయడానికి కృషి చేస్తుంది.

మెట్టు మెట్టుగా వామపక్ష, ప్రజాతంత్ర సంఘటనను నిర్మించేందుకుగాను వామపక్ష ప్రజాతంత్ర శక్తులను సమీకరించేందుకు పార్టీ చురుకుగా పనిచేస్తుంది. ఐక్య పోరాటాలు, సమిష్టి ఉద్యమాలను అభివృద్ధి చేయడం ద్వారా మాత్రమే ఈ పని చేయడం సాధ్యమవుతుంది. పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగానే, అంటే దాని బలం పెంచుకోడానికీ, వామపక్ష ప్రజాతంత్ర శక్తులను సమీకరించేందుకు అనుగుణంగానే పార్టీ ఎన్నికల ఎత్తుగడలు ఉండాలి.

బిజెపీ, కాంగ్రెస్, ఇతర బూర్జువా-భూస్వామ్య పార్టీలకు నిజమైన ప్రత్యామ్నాయం వామపక్ష ప్రజాతంత్ర సంఘటన మాత్రమే. జనతా ప్రజాస్వామ్య సంఘటనలో చేరదగ్గ వర్గాలు ఈ సంఘటనలో ఉంటాయి. అందువల్ల ఈ సంఘటన కేవలం

ఎన్నికల సంఘటనగానో, లేదా ప్రభుత్వాన్ని ఏర్పరిచే సంఘటగానో మాత్రమే కాకుండా కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక, మధ్యతరగతి, వృత్తిదారులు, చిన్న దుకాణదారులు, వర్తకులు తదితరులకు ప్రాతినిధ్యం వహించే పోరాట శక్తుల సంఘటనగా అభివృద్ధి చెందాలి.

ప్రస్తుతం వామపక్ష సంఘటనలోకి సమీకరించ దగ్గ శక్తులు ఏవీ అంటే; వామపక్ష పార్టీలు, వాటి వర్గ, ప్రజాసంఘాలు, వామపక్ష గ్రూపులు, మేధావులు, వివిధ పార్టీల్లో ఉన్న సోషలిస్టులు, కాంగ్రెసేతర లౌకిక పార్టీల్లోని ప్రజాతంత్ర సెక్షన్లు, ఆదివాసీలు, దళితులు, మహిళలు, మైనారిటీలకు చెందిన ప్రజాతంత్ర సంస్థలు, పీడిత ప్రజా సమస్యలు చేపట్టే సామాజిక ఉద్యమాలు. బూర్జువా-భూస్వామ్య పార్టీల కార్యక్రమానికి భిన్నమైన కార్యక్రమం ప్రాతిపదికపై ఈ శక్తులన్నిటినీ ఉమ్మడి వేదికమీదకు తీసుకువచ్చినప్పుడు మాత్రమే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం ఒక నిర్దిష్టమైన రూపం తీసుకుంటుంది. తొలుతగా ఉమ్మడి డిమాండ్ల సాధనకోసం వివిధ వర్గ, ప్రజా సంఘాలను ఉమ్మడి వేదికపైకి తీసుకురావడం ఈ క్రమంలో తొలిమెట్టు అవుతుంది.

వామపక్ష ప్రజాతంత్ర ఐక్యత సాధించడం వివిధ రాష్ట్రాలో వివిధ రకాలుగా సాగుతుంది. రాష్ట్రాల్లో విభిన్నమైన వామపక్ష ప్రజాతంత్ర కూటములు ఏర్పడతాయి, కానీ అవి అఖిల భారత స్థాయిలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణానికి తోడ్పడతాయి. పార్టీ అనుసరించే అన్ని రకాల ఎత్తుగడలు బలమైన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణమే లక్ష్యంగా సాగాలి.

వామపక్ష ప్రజాతంత్ర కార్యక్రమం, బూర్జువా-భూస్వామ్య-నయాఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయంగా ఉండాలి. అందులో కార్మికవర్గం, రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ శ్రామికులు, దుకాణదారులు, వృత్తిదారులు, మధ్యతరగతి, మేధావుల తక్షణ డిమాండ్లు ఉండాలి. వామపక్ష ప్రజాతంత్ర శక్తులు, ఈ కార్యక్రమంలోని డిమాండ్లు, సమస్యల ప్రాతిపదికగానే రాజకీయ ప్రచారం, పోరాటాలు, ప్రజాందోళనలు జరపాలి.....

ముసాయిదా తీర్మానం పై

> **❝ ప్రస్తుతం వామపక్ష సంఘటనలోకి సమీకరించ దగ్గ శక్తులు ఏవీ అంటే; వామపక్ష పార్టీలు, వాటి వర్గ, ప్రజాసంఘాలు, వామపక్ష గ్రూపులు, మేధావులు, వివిధ పార్టీల్లో ఉన్న సోషలిస్టులు, కాంగ్రెసేతర లౌకిక పార్టీల్లోని ప్రజాతంత్ర సెక్షన్లు, ఆదివాసీలు, దళితులు, మహిళలు, మైనారిటీలకు చెందిన ప్రజాతంత్ర సంస్థలు, పీడిత ప్రజా సమస్యలు చేపట్టే సామాజిక ఉద్యమాలు. ❞**



ఆచరణాత్మక అంశాలను చెబుతూ కార్యక్రమంలోని వివిధ వర్గాల డిమాండ్లను గురించి పేర్కొంది. చివరిగా పార్టీ సభ్యుల ముందు 8 కర్తవ్యాలుంచింది. అవి క్లుప్తంగా:

మోడీ ప్రభుత్వ నయా-ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి. అన్ని రంగాల్లో మితవాదంపై సైద్ధాంతిక పోరాటం చేయాలి. అమెరికన్ సామ్రాజ్యవాదుల యుద్ధ వ్యూహాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాడాలి. సామాజికంగా అణచివేయబడిన సెక్షన్లయిన దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళల ప్రయోజనాలు రక్షించేందుకు పోరాటాలు ఉధృతం చేయాలి. నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజాతంత్ర హక్కులకోసం పోరాడాలి. బెంగాల్‌లో మార్క్సిస్టు పార్టీమీదా, వామపక్షాలమీదా జరుగుతున్న హింసాత్మక దాడులను వ్యతిరేకించాలి. త్రిపుర ప్రభుత్వాన్ని అభివృద్ధి నిరోధక శక్తుల దాడులనుండి, కేంద్రప్రభుత్వ శత్రుపూరిత చర్యలనుండి రక్షించుకోవాలి.

పార్టీ తన స్వతంత్ర పాత్రనూ, స్వంత బలాన్నీ, ప్రజా పునాదినీ పెంచుకోడానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలి. వర్గ, ప్రజా సమస్యలపై ఐక్య కార్యాచరణలు పెంపొందించాలి. వామపక్ష ఐక్యత నిర్మించి, విస్తరించడంపై కేంద్రీకరించాలి...

రాజకీయ తీర్మానం తరువాత కామ్రేడ్ రామచంద్రన్‌పిళ్లై పార్టీ రాజకీయ నిర్మాణ నివేదికను ప్రవేశ పెట్టారు. దీనిపై చర్చిస్తూ ఆయన జాతీయ స్థాయిలోనూ, వివిధ రాష్ట్రాలలోనూ పార్టీ నిర్మాణ పరిస్థితుల గురించి చెప్పారు. పార్టీ నిర్మాణంలోని లోటుపాట్లను

**"డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరిపి దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించాలని పార్టీ డిమాండ్ చేసింది. యువకులకు ఉపాధి కల్పించాలి, లేకుంటే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. పని చేసే హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలంటూ మరో తీర్మానం చేసింది."**

గురించీ, పార్టీ కమిటీలు, శాఖలు, ప్రజా రంగాల పనిలో లోపాల గురించీ ఆయన ఆత్మ విమర్శనా పూర్వకంగా వివరించారు. చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులు కూడా తమ తమ రాష్ట్రాల్లోని నిర్మాణ పరిస్థితుల గురించి అంతే ఆత్మ విమర్శనా ధోరణితో మాట్లాడారు. ఆరుమాసాలకు లోపుగానే పార్టీ నిర్మాణ ప్లీనం జరుగుతుంది. అక్కడ నిర్మాణంపై విపులమైన చర్చ జరిగి మార్పులు, చేర్పులు చేస్తారు. కనుక ఇక్కడ తీర్మానం ప్రస్తుతం ఆమోదించకుండా కొత్త కేంద్ర కమిటీకి దీన్ని ఖరారు చేసే అధికారం ఇస్తూ మహాసభ నిర్ణయం తీసుకుంది.

**ముఖ్య సమస్యలపై తీర్మానాలు**

మహాసభ వివిధ సమస్యలపై మొత్తం 26 తీర్మానాలు ఆమోదించింది. వాటిలో ముఖ్యమైనవి:

1. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరిపి దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించాలని పార్టీ డిమాండ్ చేసింది.

2. మరో తీర్మానంలో దళితులకు ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలనీ, వారికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులను వారికే ఖర్చుచేసేట్లు ఎస్‌సీ సబ్ ప్లాన్, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు పరచాలని పార్టీ కోరింది.

3. ఆర్థికంగా బాగా వెనుకబడిపోయిన ముస్లిం మతస్తుల అభివృద్ధికోసం వివిధ సందర్భాల్లో వివిధ కమిటీలు చేసిన సిఫార్సులను ప్రభుత్వం ఆలస్యం లేకుండా వెంటనే అమలు పరచాలని మహాసభ మరో తీర్మానంలో డిమాండ్ చేసింది. వీటిలో సచార్ కమిటీ, రంగనాథ్ మిశ్రా కమిషన్, ప్రొఫెసర్ కుందు నాయకత్వంలోని అంచనా కమిటీ చేసిన సిఫార్సులను మోడీ ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని కోరింది.

4. మహిళలపై జరుగుతున్న హింసాకాండకు వ్యతిరేకంగా మహాసభ ఆమోదించిన తీర్మానంలో బహిరంగ ప్రదేశాల్లో మగవారికి ప్రవర్తనా నియమావళి ఉండాలని పార్టీ కోరింది.

5. యువకులకు ఉపాధి కల్పించాలి, లేకుంటే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. పని చేసే హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలంటూ మరో తీర్మానం చేసింది.

6. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణాలకు కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరింది. మరో రెండు తీర్మానాల్లో ఇటీవల రెండు రాష్ట్రాల్లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించింది. వీటితోబాటు బెంగాల్‌లో తృణమూల్ హింసాకాండను ఎదుర్కొంటున్న సిపిఐ(ఎం), వామపక్షాలకు సంఘీభావం తెలుపుతూ, వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం, ఇజ్రాయిల్ అమెరికా దాష్టీకాలను ఎదుర్కొంటున్న పాలస్తీనా, లాటిన్ అమెరికా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ, శ్రీలంక తమిళులపైనా, ఈశాన్య రాష్ట్రాలపైనా, సంస్కృతి, విద్య తదితర అంశాలపైనా మహాసభ తీర్మానాలు ఆమోదించింది.

**సౌహార్ద సందేశాలు**

గతంలో పార్టీ మహాసభలకు విదేశీ సౌహార్ద ప్రతినిధులు హాజరయ్యేవారు. కానీ గత 20వ మహాసభలో కొన్ని అంతర్జాతీయ అంశాలపై తీర్మానం అమోదించాల్సి ఉన్నందున వారిని ఆహ్వానించలేదు. ఈ సారి కూడా విదేశీ ప్రతినిధులను మహాసభలకు ఆహ్వానించలేదు. కానీ వారు పంపిన సౌహార్ద సందేశాలను మాత్రం మహాసభలో కామ్రేడ్ సీతారామ్ ఏచూరి చదివి వినిపించారు. సోషలిస్టు దేశాలైన చైనా, క్యూబా, వియత్నాం, ఉత్తర కొరియా పార్టీలనుండి రష్యా, గ్రీస్, జపాన్, పోర్చుగీస్, దక్షిణాఫ్రికా తదిర పార్టీలనుండి సౌహార్ద సందేశాలు వచ్చాయి.

**నాయకత్వ ఎన్నిక**

మొత్తం పార్టీ మహాసభల కార్యక్రమంలో నాయకత్వ ఎన్నిక ముఖ్యమైందే అయినా ఒక భాగం మాత్రమే. కానీ మీడియా ఇతర విషయాలన్నింటినీ వదిలిపెట్టి నాయకత్వ ఎన్నిక మీదనే మొదటి నుండి కేంద్రీకరించి అనేక ఊహాగానాలు చేసింది. చివరికి, సాధారణంగా సీరియస్‌గా రాసే హిందూ వంటి దినపత్రిక కూడా ఈ అంశంమీదనే ఊహాగానాలు వినిపించడం విచిత్రం. ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్ కరత్ మూడు దఫాలు పూర్తి చేశారు గనుక నిబంధనావళి ప్రకారం ఆయన స్థానంలో ఇంకొకరు ఎన్నిక కావాలి. దీన్ని ఆసరాగా చేసుకుని పార్టీలో చాలా గందర గోళం జరుగుతున్నట్లు మీడియా ప్రచారం చేసింది. కానీ ఎటువంటి గందరగోళం లేకుండా అత్యంత ప్రజాస్వామ్య బద్ధంగా మహాసభ కేంద్ర కమిటీనీ, కంట్రోల్ కమిషన్‌ను ఎన్నుకోవడం, ఈ కమిటీలు సమావేశమై ప్రధాన కార్యదర్శిగా సీతారామ్ ఏచూరినీ, కొత్త పొలిట్ బ్యూరోనూ, కంట్రోల్ కమిటీ చైర్మన్‌గా సుకోమల్ సేన్‌నూ ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఏచూరి మాట్లాడుతూ ఇది "భవిష్యత్తును నిర్మించే మహాసభ" అంటూ చేసిన ప్రసంగం ప్రతినిధులను ఉత్తేజపరిచింది.


**ఉత్తేజం నింపిన ప్రదర్శన, సభ**

మహాసభల ముగింపు సందర్భంగా విశాఖ వీధుల్లో ఎర్రజెండాలు పట్టుకుని వివిధ వర్గాల ప్రజలు నిర్వహించిన ప్రదర్శన, అనంతరం ఆర్‌కె బీచ్‌లో జరిగిన బహిరంగ సభ ఉత్తేజం నింపాయి. చంటి పిల్లలు, చద్ది మూటలతో వచ్చిన గ్రామీణ, గిరిజన ప్రజలతో పట్టణ కార్మిక వర్గం భుజం భుజం కలిపి మైళ్ల పర్యంతం నడిచిన తీరు కార్మిక, కర్షక మైత్రికి చక్కని ఉదాహరణగానే కాక భవిష్యత్‌కు ఆశావహ సూచికలుగా నిలిచాయి. ఆర్టీసి బస్టాండ్ వద్ద నుండి బీచ్‌వరకు సాగిన ప్రదర్శన విశాఖ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఆర్‌కె బీచ్‌లో జరిగిన బ్రహ్మాండమైన బహిరంగ సభ, నాయకుల ఉత్తేజకర ప్రసంగాలు ఆరు రోజుల మహాసభకు అద్భుతమైన ముగింపునిచ్చాయి.

ఆర్డినెన్స్‌ల రాజ్యం

# భూ దోపిడీకి తహతహలాడుతున్న ఎన్డీయే ప్రభుత్వం

## భూసేకరణ, పునరావాసం, రీ-సెటిల్‌మెంట్ చట్టం- 2013



రచయిత అఖిలభారత కిసాన్‌సభ ఉపాధ్యక్షులు

సారంపల్లి మల్లారెడ్డి

**భూ**సేకరణ, పునరావాసం, రీసెటిల్ మెంట్‌లో సరైన నష్టపరిహారం, పారదర్శకత హక్కు చట్టం–2013 కేంద్ర న్యాయవ్యవహారాల మంత్రిత్వశాఖ, భారతప్రభుత్వంచే రూపొందించబడి, భారత పార్లమెంట్, రాజ్యసభల్లో ఆమోదించబడి 26 సెప్టెంబర్ 2013న భారత రాష్ట్రపతిచే ఆమోదించబడి చట్టం గావించబడింది. 27.09.2013న గెజెట్‌లో ప్రకటించబడింది. దీనికి 02.08.2014వ తేదిన రూల్స్ (నిబంధనలు) రూపొందించబడినాయి. ఈ చట్టం ఆమోదించబడిన మూడు నెలల లోపు అమలులోకి వస్తుంది. ఈ చట్టాన్ని పార్లమెంట్‌లోనూ, రాజ్యసభలోనూ అన్ని రాజకీయ పక్షాలతో పాటు బీజేపి కూడా ఆమోదించడం జరిగింది. కానీ, ఈ చట్టాన్ని తెచ్చిన యుపిఏ ప్రభుత్వం 2014 సాధారణ ఎన్నికల్లో ఓడిపోయి, బీజేపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారానికి వచ్చింది. అధికారానికి రాగానే 31.12.2014న ఎన్‌డిఎ ప్రభుత్వం పై చట్టానికి సవరణలు చేస్తూ ఆర్డినెన్సు తెచ్చింది. ఈ ఆర్డినెన్సుతో చట్టాన్ని "ఏనుగు తిన్న వెలగపండు లాగ" చట్టం పైకి కనబడ్డా, లోన భూయజమానుల హక్కులకు భంగం కల్గిస్తున్నది. దీనిపై ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా ఎన్‌డిఎ మినహా మిగిలిన రాజకీయ పక్షాలన్నీ పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగించాయి. ఈ ఆందోళనలు జరుగుతుండగానే ఆర్డినెన్సుకు 9 సవరణలు చేర్చి లోక్‌సభలో ఆమోదించారు. కానీ, రాజ్యసభలో బిల్లు ఆమోదానికి ఎన్‌డిఎకు తగిన బలం లేకపోవడంతో చర్చ జరుపలేదు. గత ఆర్డినెన్సు కాల పరిమితి 5 ఏప్రిల్‌తో ముగియనుండడంతో తిరిగి 3 ఏప్రిల్ 2015న రెండవసారి ఆర్డినెన్సును ఎన్‌డిఎ ప్రభుత్వం జారీ చేసింది. మరో ఆరు మాసాల గడువు తీసుకుని రాజ్యసభలో తనకు అనుకూలమైన మద్దతు సంపాదించడానికి సమయం తీసుకుంది. ఒకవేళ అప్పటికీ బలం చేకూర్చుకోలేక పోతే ఉభయ సభల సంయుక్త సమావేశం జరిపి కొన్ని రాజకీయ పార్టీలను తనకు అనుకూలంగా మార్చుకుని ఆర్డినెన్సును ఆమోదింపచేసుకునే లక్ష్యంతో ఎన్‌డిఎ ప్రభుత్వం అడుగులు కదుపుతున్నది.

ఇంతకు భూసేకరణ చట్టం–2013 చెబుతున్నదేమిటి? 31.12.2014న తెచ్చిన మొదటి ఆర్డినెన్సు మరియు 03.04.2015 న తెచ్చిన రెండవ ఆర్డినెన్సు ఏం సవరణలు సూచిస్తున్నది తెలుసుకోవడం అవసరం. ఈ ఆర్డినెన్సుల వలన నిర్వాసితులకు, ఆ భూములపై ఆధారపడిన వృత్తిదారులకు, కూలీలకు ఏమేరకు ఉపయోగం కలుగుతుంది లేదా ఎంత వరకు నష్టం కలుగుతుంది తెలుసుకోవాలి. రాజకీయ పార్టీల వ్యాఖ్యలు, పాలక వర్గ పార్టీల వ్యాఖ్యలు, ఆందోళనలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. భారతదేశానికి అత్యంత కీలకమైన ఈ చట్టాన్ని, ఇందులో జరుగుతున్న మార్పులను తెలుసుకొని ప్రజలకు అనుకూలమైన చట్టం రూపొందేవిధంగా ప్రతి వ్యక్తి కృషి చేయాలి. ఆచట్టానికి ముందున్న పరిస్థితిని కొంతమేరకు అవగాహన చేసుకోవాలి.

**1894 భూసేకరణచట్టం :**

1894 నాటికి భారతదేశంలోని ఆంగ్లేయుల పాలనలో భూసేకరణ చట్టం లేదు. అంతకుముందు ఒక ఆర్బిట్రేటర్‌ను నియమించి అతని తీర్పు ద్వారానే భూసేకరణ జరిగేది. రైల్వే లైన్ల నిర్మాణం, రహదారుల నిర్మాణం, ప్రాజెక్టుల నిర్మాణం, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవసరాలకు ఆర్బిట్రేటర్ ద్వారానే భూసేకరణచేసి ప్రజోపయోగ పనులకు భూములు సేకరించే వారు. ఒక విధంగా నిరంకుశంగానే భూముల సేకరణ జరిగింది. ఆనాటి ఆందోళనల ఫలితం గా ఆంగ్లేయ ప్రభుత్వం 1894 చట్టాన్ని తెచ్చిం ది. ఈ చట్టంలో 55 సెక్షన్లు, ఉపసెక్షన్లున్నాయి.

సెక్షన్ 4 లో భూసేకరణకు అవసరమైన కర్తవ్యాలను నాలుగింటిని వివరించారు. 1.ప్రాథమిక నోటిఫికేషన్, 2. అధికారాలు దఖలు పర్చడం, 3. ప్రజాప్రయోజనం లేదా పారిశ్రామికావసరాల సేకరణకు రెండు ప్రధాన దినపత్రికలలో ప్రచారం గావించడం, 4. అధికార గెజెట్‌లో ప్రకటన చేయడం జరగాలి.

సెక్షన్ 5 లో భూసేకరణ స్థలంలోని నిర్మాణాలకు పరిహారాలు చెల్లించడం ; సెక్షన్ 5(ఎ) లో ఆస్తులు కోల్పోతున్న వారి అభ్యతరాలు వినడం ; సెక్షన్ 6 లో అధికారులు డిక్లరేషన్ విడుదల చేయడం; సెక్షన్ 7 కలెక్టరు స్వాధీనం చేసుకోవడం; సెక్షన్ 8 ప్రకారం భూమిని మార్కు చేసి గుర్తించడం; సెక్షన్ 10 ప్రకారం నిర్వాసితుల జాబితా తయారు చేయడం జరిగిన తరువాత; సెక్షన్ 11 ప్రకారం కలెక్టరు అవార్డు విడుదల చేయాలి. విచారణ జరిపి పరిహారం నిర్ణయించి నిర్వాసితులకు చెల్లింపులు చేయాలి; సెక్షన్ 12 ప్రకారం అవార్డు ఫైనల్‌చేసి; సెక్షన్ 16 ప్రకారం భూస్వాధీనం చేసుకోవాలి. సెక్షన్ 29నుండి 31 వరకు పరిహారం చెల్లింపులో వచ్చే తగాదాల పరిష్కారం చేస్తూ భూసేకరణ చేయాలి.

పై చట్ట ప్రకారం భూసేకరణలు చేసి ప్రజోపయోగ పనులకు వినియోగించాలి. ఏ ప్రాజెక్టుకైనా ఎంతభూమి అవసరమైతే అంతే తీసుకున్నారు. పరిహారం చెల్లింపులో నిర్వాసితులకు నచ్చకపోతే, తనకు నచ్చలేదంటూ వ్రాసి

> **“ భారత రాజ్యాంగం 300(ఎ) ప్రకారం 1. భూసేకరణ, 2. భూమి స్వాధీనం చేసుకో వడం, 3.భూమికి పరిహారం నిర్ణయించడం, 4. పరిహారం చెల్లింపులు జరగాలి. పై ఆర్టికల్ ప్రకారం ఏ వ్యక్తి ఆస్థిని పరిహారం చెల్లించకుండా తీసుకోకూడదు. ఆవ్యక్తికి చట్టరక్షణ కల్పించ బడింది. భారత ప్రభుత్వం కానీ రాష్ట్ర ప్రభుత్వాలు కానీ చేసిన చట్టాలు పై ఆర్టికల్‌కు లోబడి ఉండాలి. ”**

పరిహారం తీసుకోవాలి. దానిపై అధికారులు ఎందుకు నచ్చలేదో చెప్పాలంటూ కోర్టుకు వెళతారు, కోర్టు ముందు నిర్వాసితులు అదనపు పరిహారం రావాలని సహేతుకమైన డాక్యుమెంట్‌లు ప్రదర్శిస్తే కోర్టు పరిహారాన్ని పెంచి తీర్పునిస్తుంది. ఆతీర్పు ప్రకారం అదనపు పరిహా రాన్ని నిర్వాసితునికి చెల్లించాలి. ఆవిధంగా సుప్రీంకోర్టు వరకు పరిహారం పెంపుదల కోసం వెళ్లిన కేసులు చాలా ఉన్నాయి. దీనివల్ల కొంతమంది అక్రమంగా అదనపు పరిహారం పొందుతున్నారని “ఒప్పంద పరిహారం” (కాన్సెంట్) నిర్ణయాలు చేసుకున్నారు. భూములు కోల్పోతున్న వారిలో అత్యధికులకు చదువు రాకపోవడంతో కొంత మంది మధ్యదళారీలు ప్రవేశించి భూయజమానులకు రావాల్సిన పరిహారాన్ని వీరే కాజేస్తున్నారు. ఇప్పటికీ అదే జరుగుతున్నది.

**రాజ్యాంగబద్ధమైన భూసేకరణ :**

భారత రాజ్యాంగం 300(ఎ) ప్రకారం 1. భూసేకరణ, 2. భూమి స్వాధీనం చేసుకోవడం, 3.భూమికి పరిహారం నిర్ణయించడం, 4. పరిహారం చెల్లింపులు జరగాలి. పై ఆర్టికల్ ప్రకారం ఏ వ్యక్తి ఆస్థిని పరిహారం చెల్లించకుండా తీసుకోకూడదు. ఆవ్యక్తికి చట్టరక్షణ కల్పించ బడింది. భారత ప్రభుత్వం కానీ రాష్ట్ర ప్రభుత్వాలు కానీ చేసిన చట్టాలు పై ఆర్టికల్‌కు లోబడి ఉండాలి. ఒకవేళ నియంతృత్వంగా ఒకరి ఆస్థిని ప్రభుత్వంగానీ, ఇతర ఏ వ్యక్తి గానీ తీసుకుంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం అతిక్రమణ అవుతుంది. ఈ ఆర్టికల్ ప్రకారం చట్టంముందు అందరూ సమానులే అని నిర్వచించబడింది. స్వాతంత్ర్యానంతరం భారతప్రభుత్వం రాజ్యాంగాన్ని ఆమోదించింది. అందరికీ సమాన హక్కులు కల్పించబడ్డాయి. అయినప్పటికీ ఆందోళన కల్గించే అంశమేమంటే ఆంగ్లేయులు రూపొందించిన 1894 చట్టం నేటికి అమలు కావడమే. దేశీయ అవసరాలకు అనుగుణంగా ఇంతవరకు భూసేకరణ చట్టం రూపొందించలేదంటే పాలకవర్గాల వర్గ దృష్టిని అర్థం చేసుకోవచ్చు.

రాజ్యాంగం రీత్యా భూసేకరణ చట్టం రాష్ట్రప్రభుత్వాలు చేయాలి. కేంద్రానికి భూమి అవసరముంటే రాష్ట్రాలకు తెలియపర్చి వారి ద్వారా భూసేకరణ చేయాలి. ఇప్పటికే చాలా రాష్ట్రాలు భూసేకరణ చట్టాలు చేశాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2005లో (డా॥వైఎస్ రాజశేఖర్‌రెడ్డి) భూసేకరణ విధానాలు రూపొందించింది. 1997 నుండి అమలౌతున్న సంస్కరణల ఫలితంగా 2005 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టుల కొరకు, గృహాలకు, రహదారులకు, ప్రభుత్వ భవనాలకు 8లక్షల ఎకరాలు 1894 చట్టం ప్రకారం సేకరించారు. దేశవ్యాపితంగా నిర్వాసితుల ఆందోళనలు మిన్నుముట్టాయి. నర్మదా నది (భోపాల్) మొదలు తోటపల్లి బ్యారేజీ (విజయనగరం) వరకు జరిగిన ఆందోళనల ఫలితంగా 2005 లో చట్టంవచ్చింది. కానీ అది అమలు జరుపలేదు. దేశవ్యాపితంగా సరళీకృత ఆర్థిక విధానాల అమలుతో విదేశీపెట్టుబడులను ఆహ్వానించారు. వారి పరిశ్రమలకు కావాల్సిన భూమిని సేకరిం చడానికి “ప్రత్యేక ఆర్థిక జోన్స్” (ఎస్.ఇ.జెడ్) పేర లక్షలాది ఎకరాల భూముల సేకరణ అన్ని రాష్ట్రాలలో పెద్ద ఎత్తున ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం 380 ఈ జోన్స్‌ను 30.12.2010న నోటిఫై చేసింది. భూసేకరణ చాలావరకు జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో చిత్తూరు జిల్లా “వరదాయపాలెం”లో శ్రీసిటిపేర కొన్ని గ్రామాలను ఒక ఎన్ఆర్ఐ కి దత్తత చేశారు. అదేవిధంగా నెల్లూరు కిసాన్‌సెజ్, పోలెంపల్లి సెజ్, నౌకాశ్రయాలకు, వాన్‌పిక్, విద్యుత్ ఉత్పత్తి క్షేత్రాలకు, పరిశ్రమల పేర లక్షల ఎకరాల భూములను పేదల నుండి బలవంతంగా సేకరించారు. భూసేకరణకు నిరాకరించిన వారిపై కాల్పులు కూడా చేశారు. ప్రభుత్వాలు ఎంత క్రూరంగా వ్యవహరించాయంటే ఒక్కసారి నిర్వాసితులైన వారు మరోచోట స్థిరనివాసం ఏర్పరుచుకుంటే అక్కడి నుండి కూడా మరల తరిమివేశారు. (ఉదా: నెల్లూరు-తడ మండలం) వీరింతకు ముందే శ్రీహరికోటనుండి నిర్వాసితు లయ్యారు. తిరిగి శ్రీసిటీ పేర నిర్వాసితు లయ్యారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలిదినాలలో నిర్మించబడ్డ ఇరిగేషన్ ప్రాజెక్టులలో భూములు కోల్పోయిన వారికి ఎలాంటి పరిహారాలు అందక రోడ్లపై తిరుగుతున్నారు. ఇది ప్రస్తుత చరిత్ర.

**భూసేకరణ, పునరావాసం, రీసెటిల్‌మెంట్, పారదర్శక హక్కు చట్టం-2013**

ప్రజాందోళనల ఫలితంగా కేంద్రప్రభుత్వం 2010లో భూసేకరణ చట్టం రూపొందించి చర్చకు విడుదల చేసింది. రెండు సంవత్సరాల చర్చల అనంతరం తుది రూపకల్పన చేసి పార్లమెంట్ సెలక్ట్ కమిటీకి పంపారు. సెలక్ట్ కమిటీ ఆమోదించిన తరువాత లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదానికి పెట్టారు. ఆసభలలో ఆమోదించిన తరువాత 26 సెప్టెంబర్ 2013న రాష్ట్రపతి ఆమోదముద్ర పడింది. ఈచట్టంలో 114 సెక్షన్‌లు ఉన్నాయి. ఈచట్టం ఆమోదంతో 1984 చట్టం రద్దవుతుంది. కానీ, అందులోని సెక్షన్ 6కు ఈ చట్టం వర్తించదు. ఈ చట్టంలో ఏం చెప్పబడింది?

**సెక్షన్-2 :**

(1) చట్టంలో పొందుపర్చిన భూ సేకరణ, నష్టపరిహారం, పునరావాసం, రీసెటిల్‌మెంట్ అంశాలు ఈ దిగువ వాటికి వర్తిస్తాయి.

(ఎ) నౌకాదళం, మిలటరీ, వైమానిక దళం, పారామిలటరీ సిబ్బంది కలుపుకుని, కేంద్ర ప్రభుత్వ సైనిక సిబ్బందికి సంబంధించిన వ్యూహాత్మక అవసరాలకు లేదా భారత దేశ జాతీయ భద్రత, రక్షణ లేదా, రాష్ట్ర పోలీసుల, ప్రజల రక్షణ పరంగా చేపట్టే ఏ పనులకైనా, ప్రైవేటు అసుపత్రులు, ప్రైవేట్ విద్యాసంస్థలు, ప్రైవేటు హోటల్స్.

(iii) ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టులు, గనుల ప్రాజెక్టులు,

- బలహీనవర్గాల వారి కోసం చేపట్టే గృహ నిర్మాణ పథకాలు
- గ్రామాలలో లేదా పట్టణాలలో సౌకర్యాలను మెరుగుపర్చడానికి చేసే ప్రాజెక్టులు,

(i) ప్రైవేటు కంపెనీలయితే, క్లాజ్ 5లో నిర్వహించిన మేరకు 80% బాధిత కుటుంబాల ముందస్తు అంగీకారం

(ii) పబ్లిక్, ప్రైవేటు బాగస్వామ్యంలో చేపట్టే కంపెనీలయితే, సెక్షన్ 3, క్లాజులో నిర్వచించిన

మేరకు 70% బాధిత కుటుంబాల ముందస్తు అంగీకారం

షెడ్యూల్డ్ ఏరియాల్లో (గిరిజన), ఆ ప్రాంతాలలో భూ బదిలీకి సంబంధించిన ఏ చట్ట నిబంధనలను అతిక్రమించకూడదు. చట్టానికి విరుద్ధంగా ఎట్టి పరిస్థితుల్లోనూ, భూమిని స్వాధీనపర్చుకుని బదిలీ చేయకూడదు.

**సెక్షన్ 3 :**

i) కంపెనీల చట్టం, 1956 ప్రకారం రిజిస్టర్ అయిన వాటికి భూములు కేటాయించవచ్చు.

**సెక్షన్ 10 :**

(1) సబ్ సెక్షన్ (2) లోపొందుపర్చిన అంశాల పరిమితులకు లోబడి, ఈ చట్టం ప్రకారం, ఎట్టి పరిస్థితుల్లోనూ, సాగులో ఉన్న బహుళ పంటల భూమిని సేకరించకూడదు.

(2) అట్టి భూమిని, అసాధారణ పరిస్థితుల్లో, ఆఖరి ప్రయత్నంగా మాత్రమే, సేకరించవచ్చు.

– వ్యవసాయానికి అనువుగా ఉన్న వ్యర్థ/ బంజరు భూములను వ్యవసాయ భూములుగా అభివృద్ధి చేయాలి.

– రైల్వేలు, హైవేలు, జిల్లాస్థాయిల్లోని ప్రధాన రహదారులు, సాగునీటి కాలువలు, విద్యుత్ లైన్లు వంటి అవసరాల కోసం చేపట్టే ప్రాజెక్టులకు, ఈ సెక్షన్‌లో పొందుపర్చిన అంశాలు వర్తించవు.

సెక్షన్ : 12.

(ఎ) సదరు ప్రాంతంలో ఏ భూమిలోనైనా ప్రవేశించడం, సర్వే చేయడం, కొలతలు తీసుకోవటం చేయాలి.

సెక్షన్–13.

చెల్లింపులకు సంబంధించి ఎలాంటి వివాదాలు తలెత్తినా, అలాంటి వివాదాలను వెంటనే జిల్లా కలెక్టరు లేదా జిల్లా ముఖ్య రెవెన్యూ అధికారి దృష్టికి తీసుకెళ్లాలి. ఇలాంటి విషయాల్లో వారు తీసుకునే నిర్ణయాలే తుది నిర్ణయాలు అవుతాయి.

సెక్షన్–25:

సెక్షన్ 19 మేరకు డిక్లరేషన్ ప్రచురించిన తేది నుంచి 12 నెలల లోపు, జిల్లా కలెక్టరు అవారు ప్రకటించాలి. ఆ గడువులోపల అవార్డు ప్రకటించకపోతే, సదరు భూ సేకరణకు జరిపే మొత్తం ప్రక్రియ రద్దు అయినట్టు భావించాలి.

సెక్షన్–30:

(1) చెల్లించవలసిన మొత్తం పరిహారాన్ని నిర్ధారించిన తరువాత, జిల్లా కలెక్టరు, తుది అవార్డును ప్రకటించే ముందు, నిర్ధారించిన పరిహార మొత్తానికి 100 శాతం అదనపు మొత్తాన్ని 'సొలాషియం'గా కలుపుతూ, తుది అవార్డును నిర్ణయించాలి.

“ సెక్షన్-30:
(1) చెల్లించవలసిన మొత్తం పరిహారాన్ని నిర్ధారించిన తరువాత, జిల్లా కలెక్టరు, తుది అవార్డును ప్రకటించే ముందు, నిర్ధారించిన పరిహార మొత్తానికి 100 శాతం అదనపు మొత్తాన్ని 'సొలాషియం' (ఓదార్పు మొత్తం)గా కలుపుతూ, తుది అవార్డును నిర్ణయించాలి. ”



సెక్షన్ –41:

(1) వీలైనంతవేరకు, షెడ్యూల్డ్ ఏరియాల్లో, ఎటువంటి భూ సేకరణ చేయకూడదు.

(2) ఒకవేళ ఎక్కడైనా భూ సేకరణ చేయవలసివస్తే, అది నిరూపిత స్థాయిలో చివరి ప్రయత్నమై ఉండాలి.

(3) గ్రామ సభ లేదా పంచాయితీలు లేదాస్వయం ప్రతిపత్తి మండలులు, ఏ స్థాయిలో అయితే ఆ స్థాయిలో,

తీర్మానాల ద్వారా ఆమోదాలు పొందాలి.

5) గిరిజన జాతులు, షెడ్యూల్డ్ కులాల కుటుంబాల అవసరాలకు సరిపోయే రీతిలో, ఐదేళ్లలోపుగా, ప్రత్యామ్నాయ

ఇంధనం, పశుగ్రాసం, అటవీయేతర భూముల్లో కలపేతర అటవీ వనరుల ఉత్పత్తుల అభివృద్ధికి అవసరమైన

కార్యక్రమాల కూడా అభివృద్ధి ప్రణాళికలో పొందుపర్చాలి.

9) అమలులో ఉన్న చట్టాలు, నియమాలకు విరుద్ధంగా, ఏవైనా గిరిజన భూములు లేదా షెడ్యూల్డ్ కుటుంబాలకు చెందిన భూములు అన్యాక్రాంతమైతే అవి పూర్తిగా చట్ట విరుద్ధంగా భావించడం జరుగు తుంది. ఇలాంటి భూములను సేకరించినప్పుడు, వాటికి చెల్లించే పునరావాసం, రీసెటిల్‌మెంట్ పరిహారం, వాస్తవికంగా ఆ భూములపై హక్కులున్న గిరిజనులు లేదా భూమి హక్కుదారులైన షెడ్యూల్డ్ కులాల కుటుంబాలకు మాత్రమే అందించాలి.

సెక్షన్ – 42:

(2) గిరిజన ప్రాంతాలలోనూ నివాసముండే షెడ్యూల్డ్ జాతులకుచెందిన

**❝ సెక్షన్ - 85:**
**పరిహారం, పునరావాసం, రీసెటిల్‌మెంట్ కు సంబంధించి ఏ అంశాన్ని అయినా ఎవరైనా ఉల్లంఘిస్తే, సదరు వ్యక్తులకు కనీసంగా ఆరు నెలలు, గరిష్టంగా మూడేళ్ల పాటు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ కలిపి కూడా శిక్షగా విధించవచ్చు. ❞**

కుటుంబాలను, వారివారి ప్రాంతాల నుంచి బయటకు తరలించినప్పుడు,రీసెటిల్‌మెంట్ ఏరియా ఐదవ షెడ్యూల్‌లో సూచించిన షెడ్యూల్డ్ ఏరియా లేదా ఆరవ షెడ్యూల్‌లో సూచించిన గిరిజన ప్రాంతాలలో ఉందా, లేదా అనేదానితో నిమిత్తం లేకుండా, ఈ చట్టం ప్రకారం ఉండే రక్షణ, హక్కులు, ప్రయోజనాలు అన్నింటిని కూడా వారికి పునరావాసం కల్పించిన ప్రాంతానికి వర్తింపచేయాలి.

సెక్షన్ – 45:

(1) సేకరించడానికి ప్రతిపాదించిన భూమి, ఒకవేళ, 100 ఎకరాలకు సమానం లేదా అంతకు మించి ఉన్నప్పుడు, అధీకృత ప్రభుత్వం, ఆ ప్రాజెక్టుకు సంబంధించి, పునరావాసం, రీసెటిల్‌మెంట్ పనుల అమలు, ప్రగతి పర్యవేక్షణకు, జిల్లా కలెక్టరు చైర్మన్‌గా, పునరావాసం, రీసెటిల్‌మెంట్ కమిటీ ఒకదానిని ఏర్పాటుచేయాలి.

సెక్షన్ – 84:

(1) ఈ చట్టం మేరకు లేదా ఈ చట్టం అవసరం మేరకు, ఒక వ్యక్తి ఇచ్చే సమాచారం, తప్పుడు సమాచారం లేదా తప్పుదోవ పట్టించేదిగా ఉంటే, లేదా తప్పుడు పత్రాలు అందచేస్తే, సదరు వ్యక్తికి, 6 నెలల వరకు జైలు శిక్ష లేదా లక్ష రూపాయల వరకు జరిమానా లేదా రెండూ కలిపి కూడా వేయవచ్చు.

సెక్షన్ – 85:

పరిహారం, పునరావాసం, రీసెటిల్‌మెంట్ కు సంబంధించి ఏ అంశాన్ని అయినా ఎవరైనా ఉల్లంఘిస్తే, సదరు వ్యక్తులకు కనీసంగా ఆరు నెలలు, గరిష్టంగా మూడేళ్ల పాటు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ కలిపి కూడా శిక్షగా విధించవచ్చు.

సెక్షన్– 87:

(1) ప్రభుత్వంలోని ఏదేని విభాగం, ఈ చట్టంలోని అంశాలను ఉల్లంఘించినప్పుడు, ఆవిభాగానికి అధిపతి, సదరు ఉల్లంఘనకు బాధ్యులవుతారు. అటువంటివారిపై, తగు రీతిలో విచారణ జరిపి, తగిన శిక్ష విధించవచ్చు.

సెక్షన్– 101 :

ఈ చట్టం ప్రకారం సేకరించిన భూమి, స్వాధీనం చేసుకున్న తేది నుంచి ఐదేళ్ల వరకు ఏ రీతిలోనూ వినియోగించబడకపోతే, అట్టి భూమిని, ఆ భూమి అసలు యజమానులకు లేదా వారి చట్టబద్ధ వారసులకు, ఏది వీలయితే అది, అప్పగించాలి లేదా అధీకృత ప్రభుత్వపు 'భూమి బ్యాంకు' కు మార్పిడి (రివర్షన్) కోసం, అధీకృత ప్రభుత్వం నిర్ధారించిన రీతిలో అప్పగించాలి.

*వివరణ:* ఈ సెక్షన్ మేరకు 'భూమి బ్యాంకు' అంటే, ప్రభుత్వానికి చెంది ఉండి, ఖాళీగా, వదిలివేయబడి లేదా సేకరించబడి వినియోగం లోకి రాకుండా ఉన్న, పన్ను బకాయిల మూలంగా రాబట్టిన భూములను ఉత్పాదక వినియోగ స్థాయికి తీసుకురావడానికి ఉద్దేశించిన ప్రభుత్వ సంస్థ అని అర్థం చేసుకోవాలి.

సెక్షన్ – 102:

ఈ చట్టం ప్రకారం సేకరించిన భూమికి సంబంధించి, ఆ భూమిపై ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా ఉన్నప్పుడు, స్వాధీన పర్చుకున్న తేది నుంచి ఐదేళ్లలోపు యాజమాన్య హక్కులను ఇతర వ్యక్తులకు ఎవరికైనా డబ్బు చెల్లింపుల ప్రాతిపదికన బదిలీ చేసినప్పుడు, ఆ భూమికి పెరిగిన విలువలో 40 శాతం మొత్తాన్ని, ఆ భూమిని ముందు ఎవరివద్ద నుంచి సేకరించారో అట్టి వ్యక్తులకు లేదా వారి వారసులకు,స్వాధీనపర్చుకున్నప్పుడు వాటి విలువ ప్రాతిపదికన పంచాలి. అయితే, సేకరణ ప్రక్రియ పూర్తయిన పిదప జరిగే తొలి అమ్మకం లేదా బదిలీ వల్ల అందే ప్రయోజనాలకు మాత్రమే పై అంశం వర్తిస్తుంది.

సెక్షన్– 111:

ఈ చట్టం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే ఏ నియమాన్ని అయినా, సదరు రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ముందు ఉంచి ఆమోదం తీసుకోవాలి. ఉభయ సభలు ఉన్న రాష్ట్రంలోవాటికి ఉభయ సభలలోనూ ఆమోదం తీసుకోవాలి. ఒకవేళ ఒకటే సభ ఉంటే, సదరు సభ ఆమోదం తీసుకుంటే సరిపోతుంది.

సెక్షన్ –113:

(1) ఏవైనా అంశాల అమలుకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే, కేంద్ర ప్రభుత్వం, తగు ఆదేశాల ద్వారా, ఈ చట్టంలో పొందుపర్చిన అంశాలకు ఎటువంటి భంగం వాటిల్లకుండా, అట్టి ఇబ్బందులను తొలగించడానికి తగిన నిర్దేశనలు, చర్యలు చేపట్టవచ్చు. అయితే **ఈ చట్టం అమలులోకి వచ్చిన రెండేళ్ల తరువాత, పైన తెలిపిన అధికారాన్ని వినియోగించడానికి వీలులేదు.**

సెక్షన్–114:

(1) ఇకపై భూ సేకరణ చట్టం 1894 రద్దు అయినట్టుగా భావించాలి.

(2) అయితే, పైన సబ్ సెక్షన్ (1) ప్రకారం చేపట్టే రద్దు, సదరు రద్దులకు సంబంధించి, సాధారణ క్లాజుల చట్టం, 1897 లోని సెక్షన్ 6 మేరకు వర్తించే సాధారణ వర్తింపులపైన ప్రభావం చూపదు.

**పై చట్టానికి 31.12.2014న మొదటి ఆర్డినెన్సు ద్వారా ఈ దిగువ సవరణలు తెచ్చారు.**

2 (1) చట్టంలోచూపిన ప్రైవేటు అనుపత్రులు, ప్రైవేట్ విద్యాసంస్థలను, తొలగించారు. అనగా ఈ సంస్థలకు భూసేకరణ చట్టం వర్తించదు.

3 చట్టంలో గల "కంపెనీల చట్టం 1956" చట్టం అని ఉంది. దీనిని మార్పుచేస్తూ "కంపెనీల చట్టం 2013 అని చేర్చారు. ఆవిధంగా ఈ మధ్య ఏర్పాటు చేసిన పెద్ద ఫ్యాక్టరీల వారికి భూములు ఇవ్వాల్సి వస్తుంది.

10వ సెక్షన్‌కు10(ఎ) ను అదనంగా ఈ దిగువ భూసేకరణ అంశాలు చేర్చడం జరిగింది.

అ) దేశ రక్షణ, డిఫెన్స్ ఆఫ్ ఇండియా, రక్షణ ఉత్పత్తులకొరకు

ఆ) గ్రామీణ ప్రాథమిక వనరుల కల్పన మరియు విద్యుదీకరణ.

ఇ) పేదలకు ఇండ్ల స్థలాలు

డి) పారిశ్రామిక కారిడార్‌లు

ఇ) పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాజెక్టులకు భూములు.

**పై అంశాలకు సంబందించి భూసేకరణ జరిపినచో 2013 చట్టం వర్తించదు. ప్రధాన చట్టంలోని సెక్షన్ 2 ప్రకారం వీటికి చట్ట**

**మినహాయింపు లేదు. 03.04.2015న రెండవ ఆర్డినెన్సులో కొన్ని సవరణలు చేశారు. పారిశ్రామిక కారిడార్‌కు భూసేకరణ సందర్భంలో సీలింగ్ పరిమితి విధించాలి. రైల్వే లైన్‌లకు మరియు రహదారులకు కిలోమీటరు పరిధిలోనే భూమి సేకరించాలి. పరిమితి దాటి భూమిని సేకరించరాదు.**

**సెక్షన్ 24 :** ఆర్డినెన్సు ప్రకారం భూసేకరణ చట్టం 11లో చెప్పినట్టు పరిహారాన్ని చెల్లించాలి. భూమిపై ఇంజక్షన్ ఉన్నా, స్టే ఉన్నా పరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేయడానికి గల హక్కు తొలగించబడింది.

**సెక్షన్ 87:** ఎవరైనా అధికారి భూసేకరణలో తప్పిదం చేస్తే ప్రభుత్వ అనుమతి లేకుండా కేసు పెట్టరాదని ఆర్డినెన్సులో చెప్పబడింది. ప్రభుత్వం అనుమతి ఇవ్వనూవచ్చు, ఇవ్వకపోవచ్చు.

**సెక్షన్ 101 :** భూమి సేకరించి ఐదు సంవత్సరాలు గడిచినా, ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినప్పటి నుండి ఐదు సంవత్సరాల పాటు భూమిని తిరిగి తీసుకోరాదు. దీనివలన ఎంతకాలమైనా భూమిని తిరిగి తీసుకోవడం కుదరదు.

> **❝ ఈ విధంగా ఎన్‌డిఎ ప్రభుత్వం భూసేకరణ చట్టాన్ని కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా మార్పుచేయడానికి నిర్ణయించుకుంది. లక్షలాది ఎకరాల భూములు ఇప్పటికే వారికి కట్టబెట్టారు చట్టంలో సాగుభూముల సేకరణకు గల ఆటంకాలను తొలగించుకోవడానికి కీలక రంగాలను ఈ చట్టం నుంచి మినహాయించారు. ❞**

**పార్లమెంటులో 9 సవరణలు చేశారు.**

1) "పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్" ప్రాజెక్టులకు సంబంధించి మినహాయింపులు తొలగించారు. స్థానిక ప్రభుత్వాలు, ంా ష్ట్ర , కేంద్ర ప్రభుత్వాల స్వాధీనంలోనున్న ప్రాజెక్టులకు మాత్రమే వర్తిస్తుంది.

2) "పారిశ్రామిక కారిడార్"కు పరిమితులు విధించారు. జాతీయ రహదారులకు మరియు రైల్వేలైన్లకు కిలోమీటరు పరిధిలోనే భూ సేకరణ చేయాలి. ఆ పరిధి దాటరాదు.

3) "భూమికోల్పోయినవారికిగాని, దానిపై ఆధారపడినవారికిగాని ఒకరికి విధిగా ఉద్యోగం ఇవ్వాలి".

4) "భూములు కోల్పోయినవారు జిల్లాస్థాయిలో సంబంధిత అధికారికి ఫిర్యాదు చేసుకోవచ్చు.

5) "నిర్వాసితులు అభ్యంతరాలు చెప్పడానికి వారి ప్రాంతంలోనే బహిరంగ విచారణ జరపాలి".

6) పారిశ్రామిక కారిడార్ భూ సేకరణకు "భూ పరిమితి" నిర్ణయించాలి.

7) గిరిజన భూముల సేకరణకు గ్రామ పంచాయితీ తీర్మానం తప్పనిసరి చేశారు.

8) ప్రభుత్వం తన సంస్థలకు, కార్పోరేషన్లకు మాత్రమే భూమి సేకరించాలి.




9) ప్రైవేటు కంపెనీలకు "ప్రైవేట్ ఎన్‌టిటి" (ప్రైవేటు ఆస్తులు) తిరిగి పెట్టారు.

అయితే పై సవరణలతో లోక్‌సభలో బిల్లు ఆమోదించబడింది. రాజ్యసభలో ఎన్‌డిఎకు మెజారిటీ లేకపోవడం వల్ల బిల్లు ప్రవేశ పెట్టలేదు. 5 ఏప్రిల్ 2015తో ఆర్డినెన్స్ కాల పరిమితి ముగిస్తున్నందున తిరిగి 3 ఏప్రిల్ 2015న రెండవ ఆర్డినెన్స్‌ను జారీ చేశారు.

ఈవిధంగా మొదటి సారి సవరణలతో ప్రైవేటు రంగానికి సంబందించిన భూసేకరణకు చట్టం వర్తించకుండా చేయబడింది. పై పై మెరుగులు దిద్దే విధంగా లోక్‌సభలో 9 సవరణలతో చట్టం ఆమోదించబడింది. రాజ్య సభలో ఆమోదానికి పెట్టకపోవడం వల్ల రెండోసారి 3.04.2015న రెండవసారి ఆర్డినెన్సు జారీ చేశారు. రెండవసారి జారిచేసిన ఆర్డినెన్సులో కూడా మొదటి ఆర్డినెన్సు లోని అంశాలనే ప్రస్తావించారు తప్ప పెద్దగా మార్పులేమీ చేయలేదు. ఈ విధంగా ఎన్‌డిఎ ప్రభుత్వం భూసేకరణ చట్టాన్ని కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా మార్పుచేయడానికి నిర్ణయించుకుంది. లక్షలాది ఎకరాల భూములు ఇప్పటికే వారికి కట్టబెట్టారు చట్టంలో సాగుభూముల సేకరణకు గల ఆటంకాలను తొలగించుకోవడానికి కీలక రంగాలను ఈ చట్టం నుంచి మినహాయించారు. పారిశ్రామికాభివృద్ధి పేరుతో వేల ఎకరాల భూములు సేకరించి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలంగా మార్పులు తెస్తున్నారు. ప్రధాన చట్టంలో చెప్పిన అంశాలకు బిన్నంగా రెండు ఆర్డినెన్సుల్లో గానీ, లోక్‌సభలో ఆమోదించిన తొమ్మిది అంశాలలో గానీ భూయజమానులకు రక్షణ కల్పించబడ లేదు. పైగా ఉన్న రక్షణను తొలగించి వేశారు. ఒకవిధంగా 1894 చట్టానికే తిరిగి ప్రాణ ప్రతిష్ఠ చేస్తున్నారు. ప్రతి భారత పౌరుడు సవరణ చట్టంలోని లోటు పాట్లను గమనించి నిర్ణయం తీసుకోవాలి. ఆహార భద్రతకేకాక దేశ సార్వభౌమాధికారానికి ప్రమాదం రాకుండా జాగ్రత్తపడాలి.

# వ్యవసాయం పట్ల వ్యవహరించాల్సిన తీరు ఇదేనా?

జయతీ ఘోష్



రచయిత జె.ఎన్.యు. ప్రొఫెసర్, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త

నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులను నిరాశపర్చింది. భారతీయ జనతాపార్టీ ఎన్నికల ప్రచార సమయంలో రైతులను వాగ్దానాలతో ఊరించింది. మంచి రోజులు వస్తాయి. పంటలకు గిట్టుబాటు ధరలొస్తాయి. వ్యవసాయ పరిస్థితులు మెరుగవుతాయి. అని రైతులు కలలు కన్నారు. ఇప్పుడు భంగపడ్డారు.

ఇప్పుడు మనముందున్న తక్షణ సమస్య భూసేకరణ బిల్లు. ఈ బిల్లుకు పార్లమెంటు ఆమోదముద్ర వేయించటానికి ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది. భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం, సరైన పునరావాసం ఇవ్వాలని అడిగేవారిని 'అభివృద్ధి వ్యతిరేకులు'గా ముద్రవేస్తున్నారు. ఇలా మాట్లాడటంలో పాత ప్రభుత్వ పెద్దలకు వీరే మాత్రం తీసిపోవడం లేదు. "భూములు, జీవనోపాధి కోల్పోయేవారి సంగతి అభివృద్ధికి అనవసరం. వీరిని పట్టించుకుంటే అభివృద్ధి జరగదు. కొందరు లాభాలు పొందాలంటే వీరంతా త్యాగాలు చేయాల్సిందే" అనేది 'అభివృద్ధి కాముకుల' గట్టి అభిప్రాయం.

ఆర్థిక ప్రగతి మానవహక్కులకు హాని కలిగించని పద్ధతిలో జరగాలని, ప్రకృతిని, ప్రజలను దెబ్బతీసే పద్ధతిలో జరగకూడదనీ మనం అడుగుతున్నాం. కానీ ప్రభుత్వం అంగీకరించడం లేదు. అభివృద్ధి అనే బుల్‌డోజర్ కింద సామాన్యులు, ప్రకృతి నలిగి నాశనమైనా పర్వాలేదు. అదే ఈ ప్రభుత్వ విధానం. ప్రభుత్వ విధానాల్లో రైతులపట్ల, వ్యవసాయం పట్ల వ్యతిరేక ధోరణి కనిపిస్తోంది. రెండు రకాలుగా ఈ వ్యతిరేక ధోరణి వ్యక్తమౌతున్నది. ఒకటి–ఉదాసీన వైఖరి. రెండు–హాని కలిగించే చర్యలు.

ఉదాసీన వైఖరిని రుజువుచేసే చర్యలను ముందు పరిశీలించుదాం. యు.పి.ఏ. పాలించిన దశాబ్దకాలం రైతులకు కొంత మెరుగైన విధానాలను అమలుపరిచింది. వ్యవసాయానికి, ఇతర గ్రామీణ అవసరాలకు యు.పి.ఎ. ప్రభుత్వం అంతకుముందు కంటే ఎక్కువగా ఖర్చుపెట్టింది. పంటల ధరలు కొంతమేరకు గిట్టుబాటు అయ్యాయి. యు.పి.ఎ. ప్రభుత్వ పాలన చివరికొచ్చేసరికి పరిస్థితి దిగజారింది. వ్యవసాయ పెట్టుబడి క్షీణించింది. వ్యవసాయ పరిస్థితులు రాను రాను మరింత దిగజారడమే కాని కోలుకోవడమనేది లేకుండా తయారయాయి.. వ్యవసాయంలో వృద్ధిరేటు 2013-14లో 3.7 శాతం ఉండగా 2014-15 నాటికి 1 శాతానికి పడిపోయింది. మోడీ ప్రభుత్వ మొదటి సంవత్సరానికి చెందిన ఘనత ఇది. వాతావరణ పరిస్థితులు బాగున్నప్పటికీ ఇలా జరగడం ఆందోళనకరం. ముఖ్యమైన పంటలకు మద్దతు ధర నామ మాత్రంగానే పెంచింది. కారణం ద్రవ్యోల్బణం అని చెబుతున్నారు. వాస్తవానికి ద్రవ్యోల్బణం ప్రపంచ ఆర్థిక ధోరణుల ప్రభావం వల్ల తగ్గింది. అయినా రైతుకు ధర ఇవ్వకూడదు అనేది ప్రభుత్వ విధానం. వ్యవసాయ ఖర్చులు మాత్రం తగ్గలేదు. అంతర్జాతీయంగా ఆయిల్ ధరలు బాగా తగ్గాయి. ఆ వెసులుబాటు సామాన్యుడికి అందకుండా ప్రభుత్వం అడ్డుపడింది. పెట్రోలు, డీజిలుపై అమ్మకంపన్నులు, ఎక్సైజ్ సుంకాలను పెంచడం ద్వారా ప్రభుత్వాలు తమ ఆదాయాల్ని పెంచుకుంటున్నాయి. ఎరువుల ధరల విధానం అడ్డగోలుగా తయారైంది. నైట్రోజన్, ఫాస్ఫేట్ ఎరువుల వాడకంలో సమతుల్యం లేకుండా పోయింది. ఇది దిగుబడి పడిపోవడానికి, నేల నాశనం కావడానికి దారితీసింది.

వ్యవసాయ రుణ సదుపాయం యు.పి.ఎ. ప్రభుత్వ తొలి సంవత్సరాలలో పెరిగింది. అయితే మోడీ ప్రభుత్వ హయాంలో నత్తనడక నడుస్తోంది. రుణం పేద రైతులకు అందలేదు. పలుకుబడి గల ధనిక వర్గాలకే అందింది. దీనికి 'ప్రాధాన్య రుణ మంజూరు' అని పేరు పెట్టారు. కిందటి దశాబ్దంలో చూసిన దానికంటే దారుణమైన పరిస్థితులు గ్రామీణ భారతంలో ఏర్పడే విధంగా దుష్ట శక్తులన్నీ ఏకమై పనిచేస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితిలో వ్యవసాయాన్ని, రైతులను రక్షించే విధానాలు అవసరం. కానీ మోడీ ప్రభుత్వం వినాశకర విధానాలను చేపడుతున్నది.

### బడ్జెట్ కేటాయింపులు

నాశనం ఎలా జరుగుతున్నదో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను చూస్తే స్పష్టంగా అర్థమౌతుంది. బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయింపులను దారుణంగా కోసిపడేశారు. 2013-14 (యు.పి.ఎ. చివరి సంవత్సరం)తో పోల్చితే మోడీ ప్రభుత్వ మొదటి సంవత్సరంలో 22 శాతం మేరకు వ్యవసాయంపై ఖర్చును తగ్గించింది. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకొంటే తగ్గింపు 33 శాతానికి చేరుతుంది. అంటే మూడోవంతు మేరకు కేంద్రం కేటాయింపు తగ్గింది. పైగా ఆర్థికమంత్రి పొదుపు చర్యలు చేపడతామని సెలవిచ్చారు. అంటే కేటాయించిన దాంట్లో మళ్ళీ కోత ఉంటుందని అర్థం. గొంతెండి ఆక్రందిస్తున్న వ్యవసాయ రంగం గొంతు పిసికేయడానికి సిద్ధంగా ఉన్నారు.

ఒకవైపు వ్యవసాయ మౌలిక సదుపాయాలకు అవసరమైన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆచరణ భిన్నంగా ఉంది. నీటి పారుదల కోసం చేయాల్సిన ఖర్చును విపరీ

తంగా తగ్గించారు. ఇరిగేషన్ అభివృద్ధి పథకం కింద 2013-14లో 4630 కోట్ల రూపాయల ఖర్చు పెట్టగా ఈ సంవత్సరం కేటాయించింది వెయ్యి కోట్లు మాత్రమే. అప్పుడు రూపాయి పెడితే ఇప్పుడు 20 పైసలు పెడుతున్నారు. ఇక్కడొక గారడీ చేస్తున్నారు. మరో వెయ్యి కోట్లు ప్రధానమంత్రి పథకం పేరిట కేటాయించాము గదా. అది కూడా వ్యవసాయం కోసమే అని బుకాయిస్తున్నారు. ఈ రెండో పథకానికి కేటాయించిన దాంట్లో ఖర్చు పెట్టింది నాలుగు కోట్లు మాత్రమే. అంటే సున్నా!

**❝ ఇరిగేషన్ అభివృద్ధి పథకం కింద 2013-14లో 4630 కోట్ల రూపాయల ఖర్చు పెట్టగా ఈ సంవత్సరం కేటాయించింది వెయ్యి కోట్లు మాత్రమే. అప్పుడు రూపాయి పెడితే ఇప్పుడు 20 పైసలు పెడుతున్నారు. ఇక్కడొక గారడీ చేస్తున్నారు. మరో వెయ్యి కోట్లు ప్రధానమంత్రి పథకం పేరిట కేటాయించాము గదా. అది కూడా వ్యవసాయం కోసమే అని బుకాయిస్తున్నారు. ఈ రెండో పథకానికి కేటాయించిన దాంట్లో ఖర్చు పెట్టింది నాలుగు కోట్లు మాత్రమే. అంటే సున్నా! ❞**



వ్యవసాయంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు కలిగించే ఇతర చర్యలు కూడా చేపడుతున్నారు. ప్రణాళికా సంఘాన్ని (ప్లానింగ్ కమిషన్) రద్దు చేశారు. దాని ప్రభావం అనేక రంగాలపై పడుతుంది. వాటిలో వ్యవసాయ రంగం తప్పనిసరిగా ఉంటుంది. ప్రణాళికా సంఘం స్థానంలో 'నీతిఆయోగ్' అనే సంఘాన్ని పెడతారట. అదేం చేస్తుందో ఎవరికీ తెలియదు.

గత ప్రభుత్వం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన అనే పథకాన్ని పెట్టింది (జాతీయ వ్యవసాయ అభివృద్ధి పథకం). కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా వ్యవసాయ రంగానికి ప్రణాళికా నిధులను కేటాయించింది. రాష్ట్రాలు తమవంతు ఖర్చుపెడితే ఈ నిధులు పూర్తిగా విడుదల చేసేలా ఏర్పాటుచేశారు. ఈ ఏర్పాటు బాగా పనిచేసింది. అనేక రాష్ట్రాలలో వ్యవసాయరంగంలో ప్రభుత్వ ఖర్చు బాగా పెరిగింది. ఇది మంచి ఫలితాలనిచ్చింది. నూతన ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దుచేసింది. ఇప్పుడు వ్యవసాయంపై ప్రభుత్వ ఖర్చు అనేది మాయ మయ్యే పరిస్థితి వచ్చింది.

### రాష్ట్ర ప్రభుత్వాల ఖర్చు

14వ ఆర్థికసంఘం (ఫైనాన్స్ కమిషన్) దయవల్ల పన్నుల్లో రాష్ట్రాల వాటా పెరిగింది కదా, వ్యవసాయంపై ఖర్చు పెట్టడానికి రాష్ట్రాలవద్ద నిధులుంటాయి కదా అనుకోవచ్చు. కాని వాస్తవం ఏమిటి? అసలు అదనంగా ఇచ్చిందెంత? స్థూల జాతీయోత్పత్తిలో ఒక శాతం కంటే తక్కువ(0.7 శాతం). మరోవైపు ఆరోగ్యం, విద్య, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు పెట్టే ఖర్చును భారీగా కుదించారు. రాష్ట్ర ప్రభుత్వాలకు పెరిగిన ఆదాయం కంటే చాలా ఎక్కువగా ఖర్చు పెరిగింది. కేంద్రం తన బాధ్యతను రాష్ట్రాల నెత్తిన పడేయడం వల్ల ఇది జరిగింది. ఉదాహరణకు ఐ.సి.డి.ఎస్. (శిశు సంక్షేమం), జాతీయ ఆరోగ్య కార్యక్రమం ఉద్యోగులకు జీతాలు చెల్లించాల్సింది రాష్ట్ర ప్రభుత్వాలే. అవి తమ విద్యాసంస్థలను నిర్వహించుకోవాలి. ఈ పరిస్థితులలో రాష్ట్రాలు వ్యవసాయ రంగం కోసం ఖర్చు పెట్టడానికి నిధులెక్కడినుంచి వస్తాయి? రానున్న కాలంలో దేశవ్యాప్తంగా సంక్షేమ రంగాలు సంక్షోభంలో పడిపోవడాన్ని మనం చూడబోతున్నాము. రైతులను ఆదుకొనే ప్రభుత్వ కార్యక్రమం అనేదే ఉండని రోజులు వచ్చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాల ఖర్చుకు సంబంధించి ఒక ముఖ్యమైన అంశం ఇప్పుడు మన ముందున్నది. ప్రభుత్వ భూసేకరణ జరిగిన సందర్భంలో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాల్సింది రాష్ట్ర ప్రభుత్వాలే. నేటి కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల విస్తరణ పేరుతో ఉధృతమైన పథకాలను చేపట్టింది. కొత్త రోడ్లు, రైలు మార్గాల విస్తరణ, స్మార్ట్ నగరాలు (భూలోక స్వర్గాలు) ఇలాంటివి. వీటికోసం పెద్దఎత్తున భూములను లాక్కోవటం జరుగుతుంది. అయితే పరిహారం చెల్లించడానికి, పునరావాసం కల్పించ డానికి అవసరమైన నిధుల విషయంలో స్పష్టత లేదు. ఈ భారాన్ని రాష్ట్రాల నెత్తిన వేసే అవకాశ ముంది. ఈ భయంతో రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఇతర పార్టీలు ఎన్.డి.ఎ. ప్రతిపాదించిన భూసేకరణ బిల్లుకు మద్దతు ఇస్తాయని ఒక అంచనా. ఈ అంచనాను సమర్థించే ఉదాహరణ అకాలీదళ్ లొంగుబాటు. అకాలీదళ్ తాజాగా భూసేకరణ బిల్లుకు మద్దతు ప్రకటించింది.

ఇక రాను రాను మరింత ఎక్కువగా రైతులు తమ భూములనుండి తరిమివేయ బడతారు. తమ తమ సొంత స్థానాలలో బతకడానికి అవకాశాలుండవు. వర్తమాన పరిస్థితి వ్యవసాయరంగానికి చాలా ప్రతికూలంగా ఉంది. దేశంలో సగంమంది శ్రామికులు వ్యవసాయరంగంలోనే ఉన్నారన్న సంగతి ఇక్కడ మనం గమనించాలి.

వ్యవసాయ రంగాన్ని రక్షించుకోకపోతే భారత ఆర్థిక పురోగతి సాధ్యం కాదన్న పాఠం ఈ ప్రభుత్వం నేర్చుకుంటుందా?

అనువాదం : **డాక్టర్ విజయకుమార్ పుతుంబాక**

# ప్రభుత్వ నిధులతో నయా ఉదారవాద ఎజెండా అమలు



సి. పి., చంద్రశేఖర్

**అభివృద్ధివైపు నడిపించే సంక్లిష్టమైన పనిలో ప్రయివేటు రంగం అగ్రభాగాన లేదన్న సత్యాన్ని మోడీ ప్రభుత్వం స్పష్టంగా తెలుసుకుంది. అది తన నయాఉదారవాద కలను సాకారం చేసుకోవడానికి, వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌గా ముందుకు తీసుకురావడానికి అరువు బడ్జెట్ మరియు సామాజిక రంగాలకు తీవ్రమైన కోతను విధించే మార్గాలను ఎంచుకుంది.**

కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తోంది. ఈ ప్రభుత్వం తన ఆర్థిక వ్యూహాన్ని రూపొందించడానికి చాలా సమయం తీసుకుంది. ప్రభుత్వం అధికారం స్వీకరించేనాటికి, ఆర్థికవ్యవస్థ మీద సంఘపరివార్, మోడీలకు భిన్నమైన అలోచనలున్నాయి. అంతేకాక పెద్ద మొత్తంలో స్వదేశీ మరియు విదేశీపెట్టుబడిని ఆకర్షించాలనే కోరికను రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మరియు స్వదేశీజాగరణ్ మంచ్ బహిరంగంగా ఆర్థిక జాతీయవాదంగా ప్రకటించాయి. ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుతో, మోడీ నాయకత్వంలో సంపూర్ణమైన మెజారిటీతో గెలిచిన బిజెపి తనకు అనుకూలమైన సమ్మిళిత విధానాలు, వాటి అమలు విషయంలో అనుసరించాలనుకునే పద్ధతి అస్పష్టంగా ఉంది. ఎన్నికల ప్రచారంలో నొక్కి ఒక్కాణించిన సుపరిపాలన మరియు అభివృద్ధి అనేవి ఇప్పుడు వాళ్ళకి పెద్దవిషయంగా కనిపించడం లేదు.

అయితే ప్రభుత్వం ఆర్డినెన్స్‌ల ద్వారా ఆర్థిక విధానాలను ముందుకు తీసుకెళ్ళాలనే ప్రయత్నం చేస్తున్నది. ఎన్‌డిఎ ప్రభుత్వం యొక్క మొదటి పూర్తి సంవత్సరం బడ్జెట్ వివరాలు, మెరుగులు దిద్దిన ఆర్థిక సర్వే యొక్క రెండు సంపుటాలు ప్రస్తుతం మనముందున్నాయి. ఇవి ఎన్‌డిఎ ప్రభుత్వం యొక్క ఆర్థిక వ్యూహాన్ని అతులకులబొంతగా చూపిస్తున్నాయి.

దేశాన్ని అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్ ఆర్థికవ్యవస్థ ఉన్నదేశంగా, వస్తూత్పత్తి రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు, మేకిన్ ఇండియా నినాదం వలననే ఇవి జరుగుతున్నట్లు చూయించే ప్రయత్నం చేస్తున్నారు. విదేశీ ఉత్పాదక పెట్టుబడిని ఆకర్షించటం, పాత ఉత్పత్తి సామర్థ్యాలను పునర్నవీకరించటం, కొత్త శక్తులను రంగంలో పెట్టుకోవటం చేయాలి. అయితే అందుకు ఎక్కువ సమయం తీసుకుంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో నెగ్గుకు రావాలంటే మంచిపేరు సంపాదించాల్సివుంటుంది. కాబట్టి తక్షణ కర్తవ్యంగా లక్ష్యాలను సాకారం చేసుకోవడానికి అవసరమైన చర్యలను తీసుకోవడం, వృద్ధిని పెంచడం, నిలకడగా కొనసాగుతుందనే నమ్మకం కలిగించడం చేయాలి.

### మౌలికవసతులపై దృష్టి

ఆర్థిక సర్వే, రైల్వేబడ్జెట్ మరియు సాధారణ బడ్జెట్‌లు మౌలిక వసతులు ఎలా సమకూర్చబడతాయి అనే దానిమీద స్పష్టంగా ఉన్నాయి. మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వ పెట్టుబడిని పెంచడం(విద్యుత్, రోడ్లు, రైల్వేలు మరియు నౌకాశ్రయాలు), మౌలిక వసతుల ప్రణాళికల అభివృద్ధిని ఆటంకపరిచి, పనిని స్తంభింపచేసే వాటిని తొలగించాలని నిర్ణయించారు. సవరించబడిన రూపంలో భూములను కొల్లగొట్టే భూసేకరణ బిల్లు, చివరిదానికి అత్యంత ముఖ్యమైనదిగా ఉంటుంది. ఆర్థిక అజెండాలోని మొదటి అంశాన్ని అమలు పరిచే విషయంలో బడ్జెట్ కొంత ప్రయత్నం చేసింది. రోడ్డు-రవాణా మరియు జాతీయరహదారులకు కేటాయింపు 2013-14లో 25,477 కోట్లు ఉండగా, 2014-15కు 30,669 కోట్లుగా అంచనా వేయగా, దానిని 40శాతం పెంచి 2015-16లో 42,842 కోట్లు కేటాయించడం జరిగింది. 2015-16కు రైల్వేబడ్జెట్ గత సంవత్సరంతో పోల్చితే 50శాతం పెంచి లక్షకోట్ల రూపాయల వార్షిక అభివృద్ధి ప్రణాళికను ప్రకటించడం జరిగింది. ఈ మొత్తంలో 40వేల కోట్ల రూపాయలు సాధారణ బడ్జెట్ నుండి కేటాయించడం జరుగుతుంది. దీనిఫలితంగా కేవలం రోడ్లు మరియు రైల్వేలు 50 వేల కోట్ల రూపాయలు బడ్జెట్ నుండి పొందుతాయి. ప్రభుత్వం ఎంతమేరకు కేటాయింపులు చేయగలదనే విషయం స్పష్టమైంది. విద్యుత్ రంగానికి కేటాయింపులు వరుసగా 2013-14లో 4927కోట్లు, 2014-15లో 5598కోట్లుగా ఉండగా 2015-16లో 6726 కోట్లతో స్వల్పంగా పెంచారు.

అదే సమయంలో మౌలికవసతులను ముందుకు తేవడంలో ప్రభుత్వ పెట్టుబడిని పెంచే ప్రయత్నం

కనిపిస్తున్నా, కొన్నిరంగాలకు మాత్రమే ఇది పరిమితమైంది. ఏదిఏమైనా మొత్తం మీద నయా ఉదారవాద ఎజెండా లక్ష్యాలను చూసినపుడు, ప్రత్యేకంగా ద్రవ్య స్థిరత్వం కోసం అదిపట్టుపడుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వ పెట్టుబడికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇది ఎందుకు అవసరం అనేది ఆర్థిక సర్వే వివరిస్తుంది. "స్వల్ప కాల్పిక మధ్యకాలిక పెట్టుబడులలో," ప్రయివేటు పెట్టుబడిని పరిమితం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు కనిపిస్తున్నది. కారణం పెద్దమొత్తంలో రుణాలు పేరుకుపోవటంతో "కార్పొరేట్ ఆదాయ పట్టికలు బలహీనమైన ఫలితాలను చూయిస్తున్నాయి. అది బ్యాంకింగ్ వ్యవస్థకు కూడా నష్టకరంగా పరిణమిస్తున్నది." ప్రయివేటు రంగం తన పాత్రను పోషించడానికి సిద్ధంగా ఉన్నంతవరకు "ప్రభుత్వ పెట్టుబడి, ప్రత్యేకించి రైల్వేలలో అది ప్రైవేటు పెట్టుబడిని ప్రోత్సహించే పాత్రను పోషిస్తుందని" సర్వే స్పష్టం చేసింది. (ఈ ప్రభుత్వం అధికారానికి వచ్చేనాటికే రోడ్లు, మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ప్రారంభం కావటంతో ఎన్‌డిఎ ఎజెండాకు ప్రత్యేక ఆకర్షణ కల్పించటానికే రైల్వేలను ఎంచుకున్నట్లుగా కనిపిస్తున్నది.) నయా ఉదారవాద సంస్కరణలు అమలు చేయబడిన 25 సంవత్సరాల కాలంలో ప్రయివేటు రంగానికి ప్రత్యేక అవకాశాలిచ్చినప్పటికీ అభివృద్ధికి మార్గదర్శకత్వం వహించగల స్థాయికి ప్రయివేటు రంగం ఎదగలేదు. కాబటి ప్రభుత్వరంగమే ఆ పనిని చేయాల్సివస్తున్నది.

నయాఉదారవాదానికి దాసోహం

అదేసమయంలో ద్రవ్య స్థిరత్వ విధానాలకు కట్టుబడి ఉంటూ ప్రభుత్వరంగ పెట్టుబడులపై ఆధారపడే వ్యూహం సమస్యాత్మకమవుతుంది. అయినప్పటికీ ప్రభుత్వం తన లక్ష్యానికి కట్టుబడినట్లుగా కనిపిస్తున్నది. స్థూలజాతీయోత్పత్తిలో ద్రవ్యలోటు 4.1 శాతం లక్ష్యాన్ని తాను సాధించినట్లు ఆర్థికశాఖామంత్రి ఆరుణ్‌జైట్లీ వాదిస్తున్నాడు. (జూలై 2014 బడ్జెట్ ప్రకారం). ఆ వాదనలోని వాస్తవాన్ని తెలుసుకోవడానికి చివరి గణాంకాల కోసం ఎదురుచూడాల్సి ఉంది. అయితే ఇక్కడ ఆయన ఉద్దేశ్యం స్పష్టం. ఆ వాదనమీదే నిలబడి

> **"ప్రత్యామ్నాయాలు కూడా పరిమితంగానే ఉన్నాయి. ప్రభుత్వం నయాఉదారవాద సంస్కరణలకు కట్టుబడి ఉండడం వనరుల సమీకరణ కోసం మిగులు ఆదాయాలపై పన్నులు విధించటానికి పరిమితులను విధిస్తున్నది. ప్రయివేటు రంగానికి పన్ను రాయితీలను కల్పించాలని అది కోరుకుంటున్నది."**

ఉండడానికి ఆయన పథకం వేశారు. ద్రవ్యలోటు 2015-16లో ముందుగా అంచనా వేయబడిన 3.9 శాతంకు, తర్వాత మూడు సంవత్సరాల కాలంలో క్రమంగా మూడు శాతానికి తగ్గించబడుతుందని చెబుతున్నారు. పెట్టుబడుల కోసం ఖర్చును తప్పనిసరిగా పెంచినట్లయితే, అప్పుడు పన్ను వసూళ్ళు, పెట్టుబడిపై వచ్చే ఆదాయాలుగానీ ద్రవ్యలోటు గురించిన గణనలోకి రానివాటిని తప్పనిసరిగా పెంచుకోవాలి. (పెట్టుబడి ఉపసంహరణ నుండి వచ్చే మొత్తాల లాంటివి). లేదా అవసరమైన వనరులను పెద్ద మొత్తంలో కూడా బెట్టుకోవటానికి మౌలిక వసతులు కాని అంశాలపై ఖర్చును తగ్గించుకోవాలి.

ప్రత్యామ్నాయాలు కూడా పరిమితంగానే ఉన్నాయి. ప్రభుత్వం నయాఉదారవాద సంస్కరణలకు కట్టుబడి ఉండడం వనరుల సమీకరణ కోసం మిగులు ఆదాయాలపై పన్నులు విధించటానికి పరిమితులను విధిస్తున్నది. ప్రయివేటు రంగానికి పన్ను రాయితీలను కల్పించాలని అది కోరుకుంటున్నది. కార్పొరేట్ పన్నుతగ్గింపు అమలును వచ్చే సంవత్సరానికి వాయిదా వేసినప్పటికీ 30శాతం నుండి 25 శాతానికి దశలవారీగా తగ్గిస్తామని వాగ్దానం చేసింది. సంవత్సరానికి కోటి రూపాయలకుపైగా ఆదాయపు పన్ను చెల్లించే అతిపెద్ద ధనవంతులపై రెండుశాతం అదనపు పన్నును విధించింది. అయితే ఈ చిన్నదెబ్బ నుండి ఉపశమనం కలిగించటానికి సంపదపన్నును రద్దు చేసింది. ఇప్పటివరకు వనరులను పెంచడంలో విఫలమైనప్పటికీ, సంపద కలిగినవారు చెపుతున్న ఆదాయాలకు వాస్తవంగా వారికి ఉన్న సంపదలకు మధ్య ఉన్న అసమానత్వాన్ని గుర్తించి, పన్ను ఎగవేతలను నిరోధించేశక్తిని సంపద పన్ను కలిగి ఉంది. ఈ అంశంపై ప్రత్యక్ష పన్నులు ఎక్కువగా సహాయపడలేవు.

ఫలితంగా ప్రభుత్వం పరోక్ష పన్నుల పైనా మరియు వ్యయం తగ్గించడంపైనా అధారపడే పరిస్థితికి నెట్టబడుతున్నది. పెట్రోలు, డీజిలు ధరలపై నియంత్రణను తొలగించి, అంతర్జాతీయ ధరల హెచ్చుతగ్గుల నుండి ప్రయోజనం పొందడం లేదా ఆ భారాన్ని భరించడం వినియోగదారులకే వదిలేస్తున్నామని చెప్పారు. వినియోగదారులకు తెలియకుండా అంతర్జాతీయంగా పడిపోయిన ధరల మొత్తంలో ఒక ప్రధానమైన భాగాన్ని ఎక్సైజ్ సుంకం పెంచడం ద్వారా ప్రభుత్వం"దొంగతనం"గా పొందుతున్నది. చమురు ధరలు పతనమైనప్పుడల్లా ఎక్సైజ్ సుంకాన్ని మళ్ళీ మళ్ళీ పెంచుతూ, 2015-16సంవత్సరంలో పెద్ద మొత్తంలో 58000 కోట్ల రూపాయల ఆదాయం మోటారు స్పిరిట్ మరియు డీజిల్‌పై వస్తుందని అంచనా వేయడం జరిగింది. చమురు ధరలలో క్షీణత మరియు ధరల విధానంలో మార్పుల వలన తగ్గుతున్న పెట్రోలియం సబ్సిడీలతో పాటు ప్రభుత్వానికి ఈ రాబడి అదనం అదనంగా వస్తున్నది. పెట్రోలియం సబ్సిడీ 2013-14 సంవత్సరంలో 85,378 కోట్ల నుండి, 2014-15 సంవత్సరానికి 60,270కోట్లకు పడిపోయింది. తరువాత ఇది 30,000కోట్లకు పడిపోతుందని అంచనావేయబడింది. ఒక పద్దు కింద 30,000 కోట్ల రూపాయల ఖర్చు తగ్గించారు.

వాస్తవంగా 2015-16 బడ్జెట్ పెట్రోలియం ఉత్పత్తుల ఎక్సైజ్‌సుంకంలో పెంపుదలను స్పష్టంగా చూపింది. ప్రస్తుతం ఉన్న పెట్రోలు మరియు డీజిల్‌పై ఉన్న ఎక్సైజ్ సుంకంలో లీటర్‌కు నాలుగు రూపాయలు

**❝ఆహార సబ్సిడీ మొత్తంమీద మార్పులేని విధంగా ఉంచబడింది. 2014-15లో 1,22,676 కోట్ల రూపాయలుండగా, 2015-16లో 1,24,419 కోట్ల రూపాయలుగా ఉంది. అది ఆహారభద్రత పెంచబోతున్నామని చెబుతున్న కాలంలో ద్రవ్యోల్బణ సర్దుబాటుచేస్తే వాస్తవ కేటాయింపులు తగ్గుతాయి.❞**

రహదారి పన్నుగా మౌలికవసతుల అభివృద్ధి ఖర్చులో కొంతభాగాన్ని భరించటం కోసమని మార్చుచేశారు. కేవలం ఈ ఒక్కదాని ద్వారానే 40,000కోట్ల రూపాయలు అదనంగా ఆదాయం వస్తుంది. పెట్రోలియం సబ్సిడీ తగ్గటం, చమురుసుంకంపై ఎక్సైజ్ పన్నులో స్విలలతో కలిపి మౌలిక వసతుల ప్రణాళిక పూర్తిగా ఈ నిధులతో నింపబడింది. ఆచరణలో బహుశా పన్ను తగ్గింపులో ఒక భాగం ప్రయివేటు రంగానికి రాయితీగా అప్పగించడం జరుగుతుంది. ఫలితంగా పరోక్ష పన్నుల పెంపుద్వారా సంవత్సరంలో 23,833కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఆ మొత్తం నుండి 8315 కోట్ల రూపాయలు ప్రత్యక్ష పన్నులను తగ్గించటం వలన 15518 కోట్ల రూపాయలు మాత్రమే మిగులుతాయి. భారతదేశం యొక్క స్థూలజాతీయోత్పత్తి-పన్నుల నిష్పత్తి తక్కువగా ఉంది. జిడిపిలో పన్నుల రాబడి, 2012-13లో 10.4శాతం నుండి 2013-14, 2014-15సంవత్సరాలలో9.9 శాతానికి పడిపోయింది. 2015-16లో కేవలం 10.3 శాతానికి పెరిగింది.

### వ్యయ నియంత్రణ

కాబటి మౌలిక వసతులు అభివృద్ధికి పాక్షికంగా నిధుల కల్పన జరిగినప్పటికీ, ద్రవ్యలోటు సమస్య మిగిలివుంది. ఫలితంగా వ్యయంలో కఠినమైన కోతలు ఉంటాయి. జిడిపిలో మొత్తం కేంద్రం యొక్క వ్యయనిష్పత్తి 2012-13లో14.1 శాతం నుండి 2013-14లో 13.8 శాతానికి, 2014-15లో13.3 శాతానికి తగ్గింది. 2015-16లో 12.6 శాతంగా బడ్జెట్‌లో చూపబడింది. ఎంపిక చేయబడిన సంక్షేమ అంశాల ఖర్చులలో కోతలు చాలా తీవ్రంగా ఉంటాయి. బడ్జెట్‌లో ప్రజారోగ్యపు ఖర్చు రూ.1963 కోట్ల రూపాయల నుండి 1767 కోట్ల రూపాయలకు పడిపోయింది. సమగ్ర శిశు అభివృద్ధి సేవల కార్యక్రమానికి 16,590 కోట్ల నుండి 8,677 కోట్లకు తగ్గించారు. ఆహార సబ్సిడీ మొత్తంమీద మార్పులేని విధంగా ఉంచబడింది. 2014-15లో 1,22,676 కోట్ల రూపాయలుండగా, 2015-16లో 1,24,419 కోట్ల రూపాయలుగా ఉంది. అది ఆహారభద్రత పెంచబోతున్నామని చెబుతున్న కాలంలో ద్రవ్యోల్బణ సర్దుబాటుచేస్తే వాస్తవ కేటాయింపులు తగ్గుతాయి. అంతిమంగా, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఎంజిఎన్ఆర్ఇజిఎస్)అమలుకు సరిపోని విధంగా 34,699కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు. 2014-15 సంవత్సరంలో 33,000కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. గత సంతవత్సరంలో చేయించిన పనులకు రాష్ట్రాలు వేతనంగా చెల్లించిన 6000 కోట్ల రూపాయలను ఇందులో కలపలేదు. కాబట్టి రాష్ట్రాలు ఇప్పటికీ చెల్లించని వేతనాలను మినహాయిస్తే వాస్తవఖర్చు కనీసం 39,000కోట్ల రూపాయలుంటుంది. ఇప్పుడు రాష్ట్రాల చేత చెల్లించబడిన వేతన బకాయిలు మినహాయించి వాస్తవంగా ఖర్చు చేయబడిన రూ.39000కోట్ల రూపాయలు, చెల్లించాల్సిన బకాయిలు కలిపి 2015-16లో కనీస కేటాయింపు 45000 కోట్ల రూపాయలుగా ఉండాలి.

ఈ కోతలు పథకం ప్రకారం ఉన్నాయి. అదేసమయంలో ద్రవ్యస్థిరత్వాన్ని ప్రభుత్వ పెట్టుబడులతో అనుసంధానం చేయటానికి జిడిపి-పన్ను నిష్పత్తి పెంచాలని సర్వేలో పేర్కొన్నారు. సర్వే ఇంకా ఈ విధంగా చెప్పింది."ఖర్చును అదుపు చేయటంలో దృఢంగా వ్యవహరించాలి. సబ్సిడీలలో వృధాను అరికడుతూ, అనవసర వ్యయాన్ని నియంత్రించి, లక్ష్యానికి అనుగుణంగా ఖర్చు పెడుతూ, ప్రభుత్వ ద్రవ్య వినియోగాన్ని ప్రభుత్వ పెట్టుబడిగా మార్చు చేయాలి." సంక్షేమ రంగాలకు పెట్టే ఖర్చును తగ్గించి, ఆమొత్తాన్ని ప్రభుత్వం పరిమితంగా సహకరిస్తున్న మౌలిక వనరుల రంగంలో ఖర్చుపెట్టాలని దీని అర్థం(ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ద్వారా వచ్చే రుణేతర పెట్టుబడులతో కలిపి). అయితే ఈ పేరుతో ప్రభుత్వం తన ద్రవ్యలోటు తగ్గింపు లక్ష్యం నుండి వైదొలగరాదు. వృధాను తొలగించే దానిమీద, సబ్సిడీలకు అవసరమైన దానిని సమకూర్చుకునే విధంగా లక్ష్యాల మీద దృష్టి పెట్టాలని సర్వే సిఫార్సు చేసింది (నొక్కి వక్కాణించింది). దీని అర్థమేమంటే ఖర్చులలో కోత ద్వారా సంక్షేమానికి అవసరమైన వనరులను సమకూర్చడంలో సహాయపడవచ్చు.(అప్పు కాని పెట్టుబడి రాబడులతో కలిపి ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటీకరించడం ద్వారా) ప్రభుత్వం తన బాధ్యత నుండి వైదొలగకుండా, మౌలిక వసతుల అభివృద్ధికి పరిమిత సహాయం అందించాలి. ద్రవ్యలోటును తగ్గించే తన బాధ్యత నుండి పక్కకు తొలగకుండా తగ్గించాలి. పేదలకు లబ్ధికలిగించే పథకాలైన ఆహారం నుండి కిరోసిన్ వరకు, రైళ్ళలో సరుకుల రవాణా, విద్యుత్, మంచినీరు తదితరాలకు ముందుగా నిర్ణయించిన పరిమాణంలో ముందుగా నిర్ణయించిన ధరలకు సరుకు రూపంలో అందజేస్తున్నవాటిని డబ్బురూపంలోకి(లేక నగదు బదిలి) మార్చి అందిస్తూ, సబ్సిడీలకు పరిమితిని విధించే విధానం ఈ వ్యూహంలో కీలకమైనది. అయితే దీనిని ఎలక్ట్రానిక్ సంఖ్యల త్రయం (జెఎఎం)(జన్‌ధన్‌యోజన, ఆధార్ మరియు మొబైల్ నంబర్స్) ల ద్వారా సాధించాలని ప్రయత్న చేస్తున్నారు.

### పెరుగుతున్న రుణభారం

ఇది మొత్తం ఎలా ఉన్నప్పటికీ, 2015-16 బడ్జెట్ జిడిపి తో పోల్చినపుడు వ్యయాన్ని తగ్గించినప్పటికీ అది ప్రచారం చేస్తున్న"మేకిన్ ఇండియా" కు అవసరం అయిన మౌలిక సదుపాయాల కల్పనకు అవసరం అయిన మొత్తాన్ని సమకూర్చటంలో కూడా విఫలమైంది. ఉదాహరణకు రైల్వేల విషయంలో రూపొందించిన ప్రణాళికలో మొత్తం 1,00,000 కోట్లు రూపాయలకుగానూ బడ్జెట్‌లో కేవలం 40,000 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించింది. మిగిలిన 60,000కోట్లు ఎక్కడి నుండి వస్తాయి? కొత్తగా పెంచిన రైల్వే ఛార్జీల

> **"మొత్తంగా మోడీ ప్రభుత్వం రూపొందిస్తున్న అభివృద్ధి వ్యూహం పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే ఖర్చులో పెద్దమొత్తాన్ని కోతకోయడానికి అనుమతినిచ్చే విధానాలను అమలుచేస్తున్నది. ఈ ప్రభుత్వం చివరికి తన ఎజెండాను అమలు చేయటానికి వనరులను సమీకరించలేని స్థితిలో ఉంది."**

నుండి కొంతవరకు రావచ్చుని, మార్కెట్ నుండి అప్పు తేవడం అంతిమ పరిష్కారంగా అంచనా వేస్తున్నారు. భారతీయ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సి) నుంచి మరియు రైల్వే వికాస్ నిగమ్ నుండి 17,655కోట్లు అప్పు తెచ్చేవిధంగా రైల్వే మంత్రి సురేష్‌ప్రభు పథకరచన చేస్తున్నారు. 2014-15లో 12,045 కోట్ల రూపాయల నిధుల సమీకరణతో దీనిని పోల్చవచ్చు. నూతన రుణ సమీకరణ పద్ధతుల ద్వారా సంస్థాగతంగా అదనంగా మరొక 17,000 కోట్ల రూపాయలను సమీకరించవచ్చుని రైల్వేలు అంచనా వేస్తున్నాయి. రైల్వే మంత్రి అభిప్రాయాన్ననుసరించి"ఇందుకోసం ప్రస్తుతం ఉన్న నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్(యన్‌బియఫ్‌సి) లేక పియస్‌యు(పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్) ఐఆర్‌యఫ్‌సితో కలిసి జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయటం ద్వారా మౌలిక సదుపాయాల నిధిని ఏర్పాటు చేయటం, వీటిద్వారా రైల్వేలలో కలిసి పనిచేయటానికి ఆసక్తి చూయించే బహుళపక్ష, ద్వైపాక్షిక దేశీయ, విదేశీ వనరుల నుండి దీర్ఘకాలిక రుణాలు పొందటానికి కృషిచేస్తాయి. స్పష్టంగా చెప్పుకోవాలంటే రుణాల ద్వారా పొందే ఒకటిన్నర రెట్ల నిధులకు బడ్జెట్లో కేటాయించిన మొత్తం సహాయకంగా ఉంటాయి.

బడ్జెట్ వనరుల ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి పూర్తిగా నిధులు కేటాయించలేని పరిస్థితులలో, అంతిమంగా ప్రభుత్వం బహిరంగ మార్కెట్ నుండి అప్పు తేవాలని ప్లాన్ చేస్తున్నది లేదా ప్రత్యేక సంస్థలను సృష్టించటం ద్వారా నిధులు సమీకరించాలనుకుంటున్నది. ఆ అప్పు తెచ్చే ప్రయత్నాలలో విజయవంతమైతే,ఆ రుణాన్ని ఆ ప్రత్యేక సంస్థల ఖాతాలో లేదా సంబంధిత ప్రాజెక్టు లెక్కల్లో చూయిస్తారు. దీన్ని ప్రభుత్వ బడ్జెట్‌లో చూయించరు కాబట్టి ప్రభుత్వం నిర్ణయించుకున్న ద్రవ్యలోటు తగ్గింపుకు ఇదేమీ ఆటంకం కాదు. ఈ వ్యూహం కొనసాగింపులో భాగంగానే 2015-16 బడ్జెట్‌లో జాతీయ మౌలిక వనరుల అభివృద్ధి నిధి ఏర్పాటుకు హామీయిస్తూ, అది రుణం తేవడం ద్వారా వనరులను పెంచుతుందని చెప్పడం జరిగింది. ఈ రకమైన వాగ్దానాలు గత ప్రభుత్వాలు కూడా చేశాయి. అవి కొంతమేరకు మాత్రమే సఫలమయ్యాయి.

ఆ వనరుల ద్వారా నిధులు సమీకరించబడితే, ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్య పద్ధతి (పిపిపి) లోని పథకాలకు నిధులు కేటాయించే ఒక చైతన్యపూరితమైన వ్యూహంలో భాగంగానే ఇది ఉంటుంది. ప్రభుత్వం ఎదుర్కొనే సమస్య ఏమంటే పిపిపి పద్ధతిలో అమలు జరుగుతున్న పథకాలు ప్రోత్సాహకరంగా లేవని, కనీసం మౌలిక సదుపాయాల కల్పనారంగంలోనైనా పిపిపి విధానాన్ని పునర్వ్యవస్థీకరించాలనే అభిప్రాయాలను సర్వేలో వ్యక్తం చేశారు. సర్వే ఆధారంగా చేయబడిన తుది నిర్ణయమేమంటే దేశంలో మౌలిక సదుపాయాల కల్పనారంగంలో బలహీనమైన పిపిపి సంస్థల వలన ప్రైవేటు రంగం తీసుకున్న ప్రాజెక్టు అమలు కార్యక్రమాలు ఖర్చుల సమస్యలతో కూడి ఉన్నాయి.(భూసేకరణలో ఆలస్యం, పర్యావరణ అనుమతులు లభించటం, ఉపకరణాల సరఫరాలో ఇబ్బందులు తదితరాలు).

కొన్ని అంశాలలో, ఇటువంటి ఇబ్బందులను అధిగమించడంలో ప్రభుత్వరంగం మంచిస్థితిలో ఉండవచ్చు. అందువల్ల ప్రభుత్వరంగం మరింత ఎక్కువ సాహసం చేయాలి. బడ్జెట్ ప్రసంగం దీనిని స్పష్టం చేసింది. పిపిపి పద్ధతిలో మౌలిక వసతుల అభివృద్ధిని పునరుత్తేజపరిచేలా పున:సమీక్షించాలి. ఇందులో ప్రధానమైన సమస్య ఏమంటే ఇబ్బందుల్ని సమన్వయంతో ఎదుర్కోవడం, మౌలిక వనరుల అభివృద్ధి పథకంలో సార్వభౌమత్వంగల ప్రభుత్వం ఇబ్బందులను ఎదుర్కోవడంలో ప్రధాన పాత్రధారిగా ఉంటుంది. ఆశ్చర్యకరంగా అప్పటి నుంచి ఇప్పటివరకు పిపిపి ప్రాజెక్టుల విషయంలో "ప్రభుత్వ రంగం ఎక్కువ ఇబ్బందుల్ని ఎదుర్కొంటుంటే ప్రయివేటు రంగం ఎక్కువ లాభాలు పొందుతుంది అనేది ప్రధానమైన విమర్శగా ఉంటున్నది. మౌలిక వసతుల అభివృద్ధి పెద్ద మొత్తంలో అప్పుల ద్వారానే జరుగుతుంది కాబట్టి ఇబ్బందుల్ని పంచుకునే కొత్త యంత్రాంగంలో భాగంగా అప్పుకు ప్రభుత్వం హామీ ఇచ్చే విధంగా ఈ సమస్య పరిష్కరించబడుతుంది.

ఖర్చు తగ్గించడం మరియు బడ్జెట్‌తో నిమిత్తం లేకుండా అప్పు తేవడాన్ని పక్కనపెడితే మౌలిక వసతుల రంగానికి ఆర్థిక వనరుల సమీకరణకు మరొక మార్గం ప్రయివేటీకరణ మరియు పెట్టుబడుల ఉపసంహరణగా కనిపిస్తుంది. ఏదిఏమైనా గతం నుండి ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణలో అనుకున్న లక్ష్యాలను సాధించడంలో విఫలమైంది. 2014-15లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా సమీకరించాలనుకున్న 63,425కోట్ల ఆదాయ లక్ష్యానికి గానూ కేవలం 31,250 కోట్ల రూపాయలు మాత్రమే పొందగలిగింది. ఇది స్పెక్ట్రమ్ అమ్మకాలలో మరింత ఎక్కువ విజయవంతమైంది. కానీ ఇక్కడ ఒకసారి అమ్మకం జరిగితే, ఇక ప్రతి సంవత్సరం దోపిడీ చేసుకునే అవకాశం ఉండదు. కావున ప్రభుత్వం బడ్జెట్‌లో పెట్టుబడుల ఉపసంహరణ పద్దు కింద 2015-16లో 69,500 కోట్ల రూపాయలు వస్తాయని చూపింది. ఈసారి ఇది విజయవంతం అవుతుందా అనేది చూడాల్సివుంది. ఒకవేళ అలా జరగకపోతే మౌలికవసతుల అభివృద్ధికి నిధులు అందజేస్తూ, ద్రవ్యలోటు లక్ష్యాన్ని సాధించటం అనేవి ప్రభుత్వాన్ని మరింత తీవ్రమైన ఇబ్బందుల్లోకినెడతాయి. మొత్తంగా మోడీ ప్రభుత్వం రూపొందిస్తున్న అభివృద్ధి వ్యూహం పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే ఖర్చులో పెద్దమొత్తాన్ని కోతకోయడానికి అనుమతినిచ్చే విధానాలను అమలుచేస్తున్నది. ఈ ప్రభుత్వం చివరికి తన

(మిగతా 13వ పేజీలో)

# భూ సమీకరణ - గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం



కొండూరు వీరయ్య
అఖిల వ్యవసాయ కార్మిక సంఘం కేంద్ర వర్కింగ్ కమిటీ సభ్యులు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2013 నాటి భూసేకరణ చట్టంలో తలపెట్టిన సవరణల పట్ల దేశవ్యాపితంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నిరంకుశపూరితమైన ఈ సవరణలకు పార్లమెంట్ ఆమోదం పొందాలని బిజెపి ప్రభుత్వం శతవిధాల ప్రయత్నిస్తోంది. ఒకే చట్ట సవరణ కోసం రెండు సార్లు ఆర్డినెన్స్ జారీ చేయాల్సి రావటం బహుశా ఈ దశాబ్దకాలంలో ఇదే మొదటిసారి. లోక్‌సభలో బలమున్నందున లోక్‌సభ వరకు తాను కోరుకున్న రీతిలో చట్టాలు చేయించుకోగలుగుతున్న బిజెపికి రాజ్యసభలో పరాభవం ఎదుర్కోవాల్సి రావటం మింగుడుపడటం లేదు. ఈ నేపథ్యంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడు ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న భూ సమీకరణ విధానంపై ప్రశంసల వర్షం కురిపించటాన్ని ప్రత్యేకంగా చూడాలి. పార్లమెంట్ ఆమోదం పొందిన 2013 భూసేకరణ చట్టం ద్వారా వివిధ ప్రాజెక్టులకు అవసరమైన భూములు సేకరించాలంటే రైతులకు, వ్యవసాయ కార్మికులకు కొన్ని ప్రయోజనాలు సమకూర్చాల్సి వస్తోంది. ఈ ప్రయోజనాలు సమకూర్చాలంటే సదరు ప్రాజెక్టుల కోసం పెట్టుబడులు పెట్టటానికి సిద్ధమవుతున్న ప్రైవేటు పెట్టుబడిదారుల లాభాలు ఎంతో కొంత తగ్గించుకోవాల్సి వస్తుంది. కార్పొరేట్ వర్గం లాభాలు తగ్గటాన్ని సహించలేని బిజెపి నేతలు భూసమీకరణలో చంద్రబాబు నమూనాను అనుసరిస్తే మంచిదన్న హితోపదేశం చేస్తున్నారు. భూసేకరణ చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తున్న బిజెపి కానీ, ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని నిర్మాణానికి భూసమీకరణ పద్ధతిని అమలు చేస్తోన్న తెలుగుదేశం ప్రభుత్వం కానీ వాటి పర్యవసానాల గురించి ఆలోచించకపోవటం దురదృష్టకరం.

చంద్రబాబు మాటల్లో రానున్న నాలుగైదేళ్లలో రాష్ట్రంలో 12 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రానున్నాయి. ఈ పెట్టుబడులు ప్రధానంగా ఏయే రంగాల్లో రానున్నాయో మాత్రం చెప్పటం లేదు. అదేసమయంలో రాజధాని నిర్మాణం విషయంలో ఉచితంగా బ్లూప్రింట్ తయారు చేసిన సింగపూర్, జపాన్ కంపెనీలు తమకు 7000 ఎకరాల భూమి కేటాయించాలని ప్రతిపాదించాయి. మరో ఉన్నతాధికారి మాటల్లో రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులు రాష్ట్ర ప్రభుత్వం వద్ద లేవు. కేంద్ర ప్రభుత్వం కప్పదాటు వైఖరి అనుసరిస్తోంది. రానున్న ఐదేళ్లల్లో రాజధాని నిర్మాణంలో ఒక భాగమన్నా పూర్తి చేయకపోతే తిరిగి ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లటం కష్టమవుతుంది. కాబట్టి రాజధాని నిర్మాణానికి అవసరమైన మోతాదు కంటే 150 రెట్లు అధికంగా భూమి సేకరించి, 125 చదరపు కిలోమీటర్ల పరిధిలో సింగపూర్ నగరాన్ని తలదన్నే రీతిలో నూతన రాజధాని నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. అయితే ఇందులో మొదటి దశలో పరిపాలనాపరమైన రాజధాని నిర్మాణం 8 చదరపు కిలోమీటర్ల పరిధిలోనే జరుగుతుందని సింగపూర్ సంస్థలు అందచేసిన ముసాయిదా బ్లూప్రింట్‌లో చెప్పారు. అంటే తొలి దశ నిర్మాణం కేవలం 2000 ఎకరాల లోపే జరుగుతుంది. మరి మిగిలిన దశలు ఎప్పుడు ప్రారంభమవుతాయి? ఎప్పుడు పూర్తవుతాయి ? ఎప్పుడో ప్రారంభమయ్యే నిర్మాణాల కోసం ఇప్పటి నుండే రైతాంగాన్ని బేదఖళ్ళు చేయాల్సిన అవసరం ఏమిటి? 50 ఏళ్ళలో జరిగిన సింగపూర్ తరహా నిర్మాణాన్ని కేవలం ఐదేళ్ళలో పూర్తిచేయగల ఆర్థిక వనరులు రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్నాయా? యాభై ఏళ్ళల్లో తలెత్తే అవసరాలకు ఇప్పటి నుండే రంగం సిద్ధం చేయటం ద్వారా విలువైన ప్రజాధనం మృతపెట్టుబడిగా మారే ప్రమాదం ఉంది. మరో వైపున రాజధాని నిర్మాణానికి అవసరమైన భూమిని మినహాయించి, మిగిలిన భూమిని ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేయటం ద్వారా రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులు పోగేయనున్నట్లు తెలుస్తోంది. మార్చి మొదటి వారంలో జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో ప్రైవేటు ప్రభుత్వ భాగస్వామ్యం పద్ధతిలో రాజధాని నిర్మాణానికి పూనుకోవాలని తీర్మానించటం పై వ్యాఖ్యలకు బలం చేకూరుస్తుంది. రాజధాని నిర్మాణానికి 35000 ఎకరాలు రైతాంగం దానం చేశారు. ప్రభుత్వం– ప్రజల భాగస్వామ్యంతో సాగాల్సిన రాజధాని నిర్మాణాన్ని ప్రైవేటు భాగస్వామ్యం ప్రాతిపదికన సాగే పనిగా ఎందుకు మార్చినట్లు ?

భూములిచ్చే వరకు రాజధాని నిర్మాణంలో ప్రజలే స్వచ్ఛందంగా

❝ రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులందరికీ 20 శాతం విస్తీర్ణం కలిగిన భూమిని తిరిగి ఇస్తామని హామీ పత్రాలు ఇస్తున్నట్లే రాజధాని నిర్మాణానికి అవసరమైన పెట్టుబడులు పెట్టే కంపెనీలకు హామీ పత్రాలు ఇచ్చి ఎందుకు నిధులు సమీకరించటం లేదు? ❞

భాగస్వాములు కావాలని పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి ఇదే తరహా పిలుపు ప్రైవేటు కంపెనీలకు, పెట్టుబడిదారులకు ఎందుకు ఇవ్వటం లేదు ? రైతుల సొమ్ము సొమ్ము కాదు. ప్రైవేటు పెట్టుబడిదారుల సొమ్ము మాత్రం సొమ్మా ? రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులందరికీ 20 శాతం విస్తీర్ణం కలిగిన భూమిని తిరిగి ఇస్తామని హామీ పత్రాలు ఇస్తున్నట్లే రాజధాని నిర్మాణానికి అవసరమైన పెట్టుబడులు పెట్టే కంపెనీలకు హామీ పత్రాలు ఇచ్చి ఎందుకు నిధులు సమీకరించటం లేదు? రాజధాని నిర్మాణం తర్వాత భూముల విలువలు పెరుగుతాయని, నేడు ఎకరం కోటి రూపాయలు ఉంటే రాజధాని నిర్మాణం తర్వాత 20 సెంట్లు కోటి రూపాయల విలువ చేస్తుందని రైతులను మభ్యపెడుతున్న ముఖ్యమంత్రి, తెలుగుదేశం వందిమాగధులు రాజధాని నిర్మాణం తర్వాత జరిగే ఆర్థిక లావాదేవీల విలువ పెరుగుతుందన్న విషయాన్ని, పెరిగిన ఈ లావాదేవీల ద్వారా ఆయా కంపెనీల లాభాలు కూడా పెరుగుతాయన్న వాస్తవాన్ని ఎందుకు ప్రస్తావించటం లేదు?ఆ విధంగా భవిష్యత్తులో లాభాలు సంపాదించనున్నాయి కాబట్టి ఇప్పుడు పెట్టుబడులు పెట్టడటంలో కొంత త్యాగం చేయమని ఎందుకు పిలుపునివ్వటం లేదు ? రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న భూసమీకరణ ప్రభావం ఆయా గ్రామాలపైనా , మొత్తం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపైనా ఎలా ఉండబోతోంది? ప్రజల మనస్సుల్లో గూడుకట్టుకున్న సందేహాలు ఏమిటి? వాటికి ప్రభుత్వం, దాని సమర్థకులు ఇస్తున్న సమాధానాలు ఏమిటి? రాజధాని ప్రాంతంలో జరుగుతున్న చర్చ ఏమిటి? ప్రజలు కోరుకొంటున్నదేమిటి? ప్రభుత్వం హామీ ఇస్తున్నది ఏమిటి? రాష్ట్ర రాజధాని ప్రాంతంలో ఉన్న ఉపాధి అవకాశాల పరిస్థితి ఏమిటి? రాజధాని నిర్మాణం మొదలయ్యాక సాంప్రదాయక ఉపాధి అవకాశాలపై ఆధారపడ్డ లక్ష కుటుంబాలు పరిస్థితి ఏం కానుంది? క్రిడా బిల్లుకు ఒక్కపూటలో శాసనసభ ఆమోదం పొందిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుళ్లూరులో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఈ ప్రాంతంలో ఉన్న అన్ని ఉత్పాదక సాధనాలు – బళ్లు, ట్రాక్టర్లు, అన్నింటినీ రాజధాని నిర్మాణంలో బాడుగకు పెట్టుకుంటామని హామీ ఇచ్చారు. పలుగు, పార పట్టుకోగలిగిన ప్రతి మనిషికి రాజధాని నిర్మాణంలో పని కల్పిస్తామని వాగ్దానం చేశారు. క్రిడా చట్టంలో భూములున్న రైతులకు ఎకరాకి 30 వేల రూపాయలు, వ్యవసాయ కార్మికులకు కుటుంబానికి నెలకు 2500 రూపాయలు నష్టపరిహారం ఇస్తామని వాగ్దానం చేశారు. ఈ వాగ్దానాల భవిష్యత్తు ఏమిటి? వీటికి తగిన నిధులు తాజా బడ్జెట్‌లో కేటాయించారా? అన్న ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవటం కోసం జనవరి, ఫిబ్రవరి నెలల్లో రెండు దఫాలుగా రాజధాని గ్రామాల్లో పర్యటించాను. ఈ పర్యటనలో దాదాపు 15 గ్రామాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులతో ఇష్టాగోష్టి చర్చలు జరిపాను. ఈ సందర్భంగా కలిగిన అభిప్రాయాలు, వచ్చిన నిర్ధారణలను బహిరంగ చర్చకోసం ఈ వ్యాసంలో పొందుపరుస్తున్నాను.

**పట్టణీకరణ : నాడు – నేడు**

ఆంధ్రప్రదేశ్ స్థూలంగా వ్యవసాయక రాష్ట్రం. 80 శాతం ప్రజలు వ్యవసాయంపైనా, అనుబంధ వృత్తులపైనా ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయక ఉపాధి, ఆదాయాల్లో వ్యత్యాసాలు ఉన్నాయి. అక్కడక్కడా తప్ప పెద్దఎత్తున పారిశ్రామిక వాడలు అభివృద్ధి చెంది లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న పరిస్థితి లేదు. స్వాతంత్ర్యానంతరం సాగిన పట్టణీకరణ అంతా ప్రభుత్వరంగంలో నిర్మితమైన పారిశ్రామిక కేంద్రాల చుట్టూ జరిగింది. విశాఖపట్నం, కాకినాడ, హైదరాబద్ వంటి నగరాలు ఈ విధంగా అభివృద్ధి అయినవే. ప్రైవేటు పెట్టుబడులు పట్టణీకరణలో కీలక పాత్ర పోషించిన సందర్భం ఇప్పటి వరకు లేదు. 2000 సంవత్సరం తర్వాత ఆర్థిక వ్యవస్థ పొందికలో వచ్చిన మార్పులతో పట్టణజనాభా పెరిగింది. ఉద్యోగం కోసమో, పిల్లల చదువుల కోసమో సమీప పట్టణాలకు మారిన కుటుంబాలు ప్రతి గ్రామంలోనూ ఉన్నాయి. అందివచ్చిన ఐటి బూంతో 1990 తర్వాతి తరం దేశ విదేశాల్లో స్థిరపడటంతో కలిసి వచ్చిన ఆదాయాన్ని జాగ్రత్త చేసుకోవటం కోసం స్థిరాస్థులు పెంచుకోవటంలో భాగంగా పట్టణాల్లో ఇళ్లు కొన్న కుటుంబాలు మరికొన్ని ఉన్నాయి. అంతేకానీ పెద్దఎత్తున పారిశ్రామికీకరణ పెరగటం, పరిశ్రమలకు అవసరమైన కార్మికులు గ్రామాల నుండి పట్టణాలకు శాశ్వతంగా వలస రావటం వల్ల జరిగిన పట్టణీకరణ కాదు. అందువల్లనే పట్టణ జనాభా పెరుగుదలతో పాటు గ్రామీణ ప్రాంత జనాభాకూడా అంతే వేగాతాదులో పెరుగుతోంది. ప్రపంచీకరణ విధానాలతో మరో కొత్త తరహా పట్టణీకరణ చోటు చేసుకోవటం ఈ కాలంలో కనిపిస్తున్న పరిణామం. ఈ తరహా పట్టణీకరణలో మండల కేంద్ర గ్రామాల్లో జనాభా వృద్ధి రేటు పెరగటంతో రెవిన్యూ గ్రామాల స్థాయిని దాటి జనాభా కలిగిన మండల కేంద్రాలను పట్టణాలుగా ప్రకటించటం ఈ కొత్త పరిణామం. వీటినే సెన్సెస్ పట్టణాలు అంటున్నారు. ఈ చివరి తరహా పరిణామంలో మండల కేంద్రాలు నామకా పట్టణాలు, మున్సిపాలిటీలు అవుతున్నాయి. మురుగునీటి పారుదల వ్యవస్థ, తాగునీరు, వీధి దీపాలు వంటి ప్రజోపయోకరమైన మౌలిక వసతులు మాత్రం గ్రామీణ స్థాయిలోనే ఉంటున్నాయి. రిజిస్ట్రేషను చార్జీలు, ఇతర సర్వీసు పన్నులు మాత్రం పట్టణాల స్థాయిలో ఉండి సౌకర్యాలకు, భారాలకు మధ్య పొంతన లేని పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. ఈ గ్రామాలు సెన్సెస్ పట్టణాలుగా మారటంతో చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ భూములు వ్యవసాయేతర అవసరాలకు, ప్రధానంగా రియల్‌ఎస్టేట్‌కి మళ్ళుతున్నాయి. సాధారణంగా పల్లెటూళ్ళల్లో పాలిచ్చే

> **"రాజధాని ప్రాంతంలో రానున్న 10 ఏళ్లల్లో కోటిన్నర జనాభా నివాసముండబోతున్నారని ముఖ్యమంత్రి ప్రకటిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తుళ్లూరు మండల జనాభా యాభై వేల పైచిలుకు. పక్కనున్న అమరావతి, తాడికొండ, మంగళగిరిలో కొన్ని గ్రామాలను కలుపుకున్నా ఈ జనాభా లక్షలకు మించదు. మరి పదేళ్లల్లో కోటిన్నర జనాభా వచ్చి చేరాలంటే ఎక్కడ నుండి ఎలా వస్తారు అన్న ప్రశ్నలకు సమాధానం లేదు."**



గేదెలకు ఎక్కువ రేటు, తరిపి గేదెలకు తక్కువ రేటు పలుకుతుంది. పంట పండే భూములకు ఎక్కువ ధర, బీడు భూములకు తక్కువ ధర పలుకుతుంది. కానీ వికృతీకరించబడిన ప్రపంచీకరణ పర్యవసానంగా బీళ్ళుగా మారిన పంట పొలాల ధరలకు రెక్కలొస్తున్నాయి. అంటే తరిపి గొడ్డుకు ధర పెరుగుతుంది.

నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని నిర్మాణం, తదనంతరం విస్తరించనున్న పట్టణీకరణ యావత్తూ ప్రైవేటు పెట్టుబడుల చుట్టూ తిరుగుతోంది. రాజధాని ప్రాంతంలో రానున్న 10 ఏళ్లల్లో కోటిన్నర జనాభా నివాసముండబోతున్నారని ముఖ్యమంత్రి ప్రకటిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తుళ్లూరు మండల జనాభా యాభై వేల పైచిలుకు. పక్కనున్న అమరావతి, తాడికొండ, మంగళగిరిలో కొన్ని గ్రామాలను కలుపుకున్నా ఈ జనాభా లక్షలకు మించదు. మరి పదేళ్లల్లో కోటిన్నర జనాభా వచ్చి చేరాలంటే ఎక్కడ నుండి ఎలా వస్తారు అన్న ప్రశ్నలకు సమాధానం లేదు. ఇప్పుడున్న స్థాయికి 150 రెట్లు జనాభా పెరిగితే తప్పరాష్ట్ర ప్రభుత్వం అంచనాలను చేరుకోవటం సాధ్యం కాదు. ఇందులో ఒకభాగం కనీసం 10 లక్షల మంది రాష్ట్రపరిపాలనకు సంబంధించిన సిబ్బంది ఉంటారని భావించినా ఎంతో పెద్దఎత్తున వస్తూత్పత్తి రంగం, పరిశ్రమలు విస్తరిస్తే తప్ప ఈ స్థాయిలో జనాభా పెరగటం సాధ్యం కాదు. కేవలం సేవా రంగం పెరిగినంత మాత్రాన ఉన్నఫళంగా ఇంత జనాభా పెరుగుతుందని అంచనా వేయటం తదనుగుణంగా రాజధాని నిర్మాణానికి వనరులు వెచ్చించటం దీర్ఘకాలంలో ప్రతికూల ప్రభావాలను చూపనున్నది.

**ఉలిక్కిపడ్డ గ్రామాలు**

రాష్ట్ర విభజన పరిణామాలు ఊపందుకోవటంతో పాటే ఆంధ్రప్రదేశ్‌లో రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కూడా చలనం వచ్చింది. ప్రతిపాదిత రాజధానికి సంబంధించి వివిధ ప్రాంతాల్లోని రాజకీయ నాయకులు భిన్నమైన ప్రకటనలు జారీ చేయటంతో ఆయా ప్రాంతాల్లో రియల్ఎస్టేట్ లావాదేవీలు పుంజుకున్నాయి. ఎట్టకేలకు ఈ గందరగోళానికి స్వస్తి పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ-గుంటూరు జిల్లాల సరిహద్దులో కృష్ణానది ఒడ్డున తుళ్లూరు కేంద్రంగా రాజధాని నిర్మాణం జరగనుందని ప్రకటించింది. తాజాగా రాజధానికి అలనాటి ధాన్యకటకం - అమరావతిగా నామకరణం జరిగింది. అప్పటి వరకు నిద్రాణంగా ఉన్న రాజధాని ప్రతిపాదిత 29 గ్రామాలు ఒక్కసారిగా కుదుపుకు గురయ్యాయి. ప్రశాంతంగా ఉన్న గ్రామీణ జీవితంలో కలకలం బయల్దేరింది. తెల్లవారేసరికి తుళ్లూరు, తాడికొండ మండలాల్లోని గ్రామాల్లో రోడ్లకిరువైపులా రియల్ ఎస్టేట్ బ్రోకర్ల దుకాణాలు ప్రారంభించారు. ఒక్క నెల్లోనే తాడికొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 4000 కోట్ల విలువైన భూ లావాదేవీలు జరిగాయి. కొనుగోలు చేసిన వారంతా హైదరాబాద్, రంగారెడ్డి రిజిస్ట్రేషన్ నంబర్లున్న వాహనాల్లో వచ్చినవారే. గత రెండు మూడు సంవత్సరాల వరకు కోస్తా ప్రాంతం నుండి హైదరాబాద్‌కు తరలివెళ్లిన పెట్టుబడులు నేడు హైదరాబాద్ నుండి వెనక్కు వస్తున్నాయా అన్న సందేహం కలగక మానదు. అంతేకాదు. నాలుగు వేల కోట్లు నగదు చెల్లింపులుగానే జరిగాయి. ఒక్క నెల్లోనే నాలుగు వేల కోట్ల నగుదు చెల్లింపులు జరిగాయంటే బహిరంగ మార్కెట్‌లో ఎన్ని వేల కోట్ల నల్లధనం చలామణి అవుతుంది ? మంగళగిరి, తాడికొండ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగిన లావాదేవీలే ప్రాతిపదికగా తీసుకుంటే కనీసం సంవత్సరానికి 50 వేల కోట్ల నల్ల ధనం మార్కెట్‌లో చలామణి అవుతుందని ఒక ప్రాథమిక నిర్ధారణకు రావచ్చు. నల్లధనం, అవినీతి సహకారం లేకుండా పోగుపడదు. ఈ స్థాయిలో నల్లధనం పోగు పడాలంటే పాలకవర్గాలు పరస్పరం సహకరించుకోకుండా సాధ్యం కాదు. 29 గ్రామల్లో ఒక్క నెల్లో 4000 కోట్లు వచ్చి పడ్డాయంటే సగటున ఒక్కో గ్రామానికి 138 కోట్ల రూపాయల నగదు వచ్చి పడింది. దాంతో పాటే వినియోగమార్కెట్ కూడా ఒక్కసారిగా రెక్కలు విచ్చుకున్నది. దీంతో విలాసంవతమైన వాహనాల తాత్కాలిక షోరూంల తలుపులు తెర్చుకున్నాయి. విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో కొత్త అపార్ట్‌మెంట్ల నిర్మాణం ఊహకందని స్థాయిలో ప్రారంభమైంది. అపార్ట్‌మెంట్ల ధరలు కూడా ఆకాశానికంటాయి. ఇది ఈ మూడు నెల్ల కాలంలో చోటు చేసుకున్న ముఖ్యమైన పరిణామం.

# నర్రా రాఘవరెడ్డి

(2వ పేజీతరువాయి)

తరువాతగానీ అక్కడి పరిస్థితులేమిటో తెలిసి రాలేదు. యజమాని చెప్పరాని పనులు పురమాయించేవాడు. వంటపని, పిల్లలను ఎత్తుకోవడం, బట్టలుతకడం, కల్లు కుండలు మోసుకురావడం వంటి పనులన్నీ చేయించేవాడు. పని ఎగొట్టి పారిపోయే ప్రయత్నం చేసిన అనేక మందిని కొరడా దెబ్బలతో హింసించడం కళ్ళారా చూశాడు. ఈ దారుణ మైన జీవితం ఎంతకాలమో గడపలేనను కున్నాడు. టెక్స్‌టైల్ మిల్లులో పని సంపాదిం చాలనుకున్నాడు. అందులో టెక్నీషియన్‌గా పనిచేసే ఓ బ్రిటీషరును (తెల్లవాణ్ని) పట్టుకొని తన పరిస్థితిని చెప్పుకున్నాడు. ఆ తెల్లవాడు జాలిపడి టైక్స్‌టైల్ మిల్లులో ఉద్యోగమిచ్చాడు. ఆ సంతోషం ఎంతోకాలం నిలవలేదు. రోజుకు 12 గంటలు పనిచేయాలి. దారుణమైన శ్రమదోపిడీ చేస్తుండేవారు. అప్పటికే అందులో పనిచేసే కార్మికులకు 12 గంటల పనిని 10 గంటలకు తగ్గించాలని కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘమైన 'లాల్ బావుటా' పనిచేస్తుండేది. రాఘవరెడ్డి ఈ సంఘం పట్ల ఆకర్షితుడయ్యాడు. ఈ దశలోనే కార్మాగారాలన్నీ మూతపడ్డాయి. రాఘవరెడ్డికి సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఆ తరువాత 'లాల్ బావు టా' ఆధ్వర్యంలో జరిగిన కొన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. చివరికి స్వగ్రామానికి చేరుకున్నాడు. అప్పటికి స్వగ్రామం విడిచి ఎనిమిదేళ్లు. ఇంటికి చేరుకున్న రాఘవరెడ్డిని తండ్రి, సవతి తల్లి పలుకరించలేదు. ఉద్వేగానికి గురయిన రాఘవరెడ్డి చిట్యాల చేరుకున్నాడు.

అది తెలంగాణాలో నియంతృత్వ నిజాం పాలనపైనా, గ్రామాల్లో దొరల పాలనపైనా రైతాంగం సాయుధ పోరాటం చేస్తున్న కాలం. సూరత్‌లో 'లాల్ బావుటా'లో పనిచేస్తున్న రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం గురించి తెలుసుకొని ఉండటం ఆయనను ఇక్కడ కమ్యూనిస్టు ఉద్యమంవైపు నడిపింది. తెలంగాణా సాయుధ పోరాటంలో కొరియర్‌గానూ, గెరిల్లా దళాల నిర్మాణంలోనూ పనిచేస్తున్న కృష్ణమూర్తితో ఆయనకు పరిచయం ఏర్పడింది. కాంగ్రెస్‌వారితో కలిసి ఉంటూ రహస్యంగా పార్టీకి కావలసిన సమాచారాన్ని అందించాల్సిందిగా కృష్ణమూర్తి కోరాడు. రాఘవరెడ్డి ఆ విధంగానే పనిచేస్తూ 1950లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం ఆయన తారకమ్మను వివాహం చేసుకున్నారు. 1952 జనరల్ ఎన్నికలు రావడంతో కమ్యూనిస్టు పార్టీ చినకొండూరు అసెంబ్లీ నియోజకవర్గ ప్రచార బాధ్యతలను అప్పగించిన ముగ్గురిలో రాఘవరెడ్డి ఒకరు. ఆ సందర్భంగా రాఘవరెడ్డి.. ఎన్నికల ప్రచార సభల్లో పల్లెసుద్దులు తదితర అనేక కళారూపాలను ప్రదర్శిస్తూ ప్రజలను పార్టీ వైపు విశేషంగా ఆకర్షించారు. పార్టీకి ఆర్థిక వనరులు లేని ఆ కాలంలో కళారూపాలే కమ్యూనిస్టుల ప్రచార సాధనాలు. వీటి ద్వారా రాఘవరెడ్డి కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలను ప్రజలకు విస్తృతంగా చేరువ చేయగలిగారు. ప్రజల అండదండలతో ఆ ఆసెంబ్లీ స్థానంలో కమ్యూనిస్టు పార్టీ విజయకేతనం ఎగురవేసింది.


ఆ తరువాత సంవత్సరం జిల్లాలో పెదమునగల్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక వచ్చింది. ఎన్నికల ప్రచారం కోసం నియమించిన 24 మంది ముఖ్యకార్యకర్తల్లో రాఘవరెడ్డి కూడా ఒకరు. ఈ ఎన్నికల సందర్భంగానే పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణ రెడ్డి, బద్ధం ఎల్లారెడ్డి వంటి ప్రముఖ నాయకులపై కాంగ్రెస్ దాడులు చేసి గాయపరిచింది. 1952లో పానగల్‌లో పార్టీ జిల్లా మహాసభ జరిగింది. ఆ తర్వాత రాఘవరెడ్డి పార్టీ తాలూకా ప్రధాన బాధ్యులుగా నియమితు లయ్యారు. 1954లో భాషా ప్రాతిపదికన రాష్ట్రాలను పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన ఫజల్ అలీ కమిషన్ రాజకీయ పార్టీల అభిప్రాయాలను ఆహ్వానిం చింది. పునర్విభజన వల్ల జరిగే మంచిచెడ్డల గురించి రాఘవరెడ్డి 'పిట్టలదొర' (లత్కోర్‌సాబ్) వేషంలో ఏకపాత్రాభినయాన్ని ప్రదర్శించారు. పూర్తయ్యాక కమిషన్ ముందు హాజరైన ప్రజలంతా ఘొల్లున నవ్వారు. అదే సభకు వచ్చిన మహాకవి శ్రీశ్రీ, సి.నారాయణరెడ్డిలు రాఘవరెడ్డిని ప్రశంసలతో ముంచెత్తారు. 1955లో వచ్చిన మధ్యంతర ఎన్నికల సందర్భం గా ఆయన అనంతపురం జిల్లా ఉరవకొండ, గుత్తి, కల్యాణదుర్గం, గుంతకల్లు నియోజక వర్గాల్లో విస్తృతంగా సాంస్కృతిక ప్రదర్శనలిచ్చి ప్రజలను చైతన్యవంతులను చేశారు.

కమ్యూనిస్టు ఉద్యమాల్లో మమేకమైన రాఘవరెడ్డి స్వగ్రామం వట్టిమర్తికి 1959 నుంచి 1967 వరకూ సర్పంచ్‌గా పనిచేశారు. అదే కాలంలో నార్కట్‌పల్లి నార్త్ బ్లాక్ జిల్లా పరిషత్తు సభ్యునిగా కూడా ఎన్నికయ్యారు. ఈ కాలంలో గ్రామాభివృద్ధికీ, ఆ ప్రాంత ప్రగతికీ ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. 1960లో నార్కట్‌పల్లి సమితి ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. కొంతకాలం చిట్యాల మార్కెట్ కమిటీ ఛైర్మనుగానూ పనిచేశారు. 1964లో పార్టీలో చీలిక ఏర్పడినప్పుడు రాఘవరెడ్డి సిపిఎం వైపుకు వచ్చారు. అదే సంవత్సరంలో భారత రక్షణ చట్టం కింద సిపిఎం నాయకులను ప్రభుత్వం దేశవ్యాప్తంగా అరెస్టులు చేసింది. రాఘవరెడ్డిని నల్గొండలో పోలీసులు అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఆయన 1966 చివరలో జైలు నుంచి విడుదలయ్యారు. తరువాత ఎమర్జెన్సీలో మీసా చట్టం కింద అరెస్టు చేయబడగా రెండేళ్ళ పాటు జైలు శిక్ష అనుభవించారు. 1967లో శాసనసభ ఎన్నికలొచ్చాయి. రాఘవరెడ్డి సిపిఎం పక్షాన నకిరేకల్లు నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 1968లో తీవ్రవాద భావాలకు ఆకర్షితులైనవారితో పార్టీలో మరో చీలిక ఏర్పడింది. ఆ సందర్భంగా నల్గొండ జిల్లాలో పార్టీని నిలబెట్టేందుకు ఎంతో కృషి చేశారు. 1972లో నకిరేకల్లు నుంచే శాసనసభకు పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయినప్పటికీ 1978, 83, 85, 89, 94ల్లో తిరుగులేని విజయం సాధించారు. నకిరేకల్లు నుంచి మొత్తం ఆరుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసి 1983–89 కాలంలో సిపిఎం శాసనసభా పక్ష నేతగా వ్యవహరించారు. శాసనసభ్యుడిగా రాఘవరెడ్డి చేసిన ప్రసంగాలు యావత్ సభనే అలరించేవి. హాస్య చతురోక్తులు, సామెతలతో సమస్యలను మేళవించి మాట్లాడే రాఘవరెడ్డి ప్రసంగాలకు శాసనసభ్యులు చెవి కోసుకునేవారు. ప్రభుత్వం శాసనసభ్యులకు ప్రతిసారీ ఇళ్లస్థలాలు ఇవ్వబోతే ఆయన ప్రతిసారీ తిరస్కరించారు.

బాల్యంలో బర్రెలు కాసిన రాఘవరెడ్డి పెద్దగా చదువుకోకపోయినా లాల్ బావుటా యూనియన్‌లోనూ, కమ్యూనిస్టు పార్టీలోనూ పనిచేయడం ద్వారా జ్ఞానం సంపాదించి మంచి ప్రజా నాయకుడు కాగలిగారు. ఓ ప్రజా ప్రతినిధిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసమూ విశేషంగా కృషి చేశారు. బీబీనగర్–నడికుడి రైలు మార్గం సాధనకు ఆయన చేసిన కృషి నిరుపమానం. గ్రామీణ విద్యుద్దీకరణ పథకాల సాధనకు ఎంతగానో శ్రమించారు. ఎస్‌ఎల్‌బిసి నీటి ప్రాజెక్టుకోసమూ గట్టి కృషి చేశారు. రోడ్ల నిర్మాణానికీ, తాగునీటి కల్పనకూ, విద్యాభివృద్ధికీ ఎనలేని కృషి చేశారు. పేదలకు బంజరు భూములను పంపిణీ చేయించారు. రైతులకు బోరు బావులు తవ్వించేందుకు బ్యాంకులతో మాట్లాడి రుణాలిప్పించి వాటిని సాకారం చేశారు. ఆయన పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యునిగానూ, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులుగానూ పనిచేశారు. సోవియట్ రష్యాలో పర్యటించారు. వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా దశాబ్దంన్నర కాలం కిందట ఆయనను విశ్రాంత జీవితం గడపాలని పార్టీ ఆదేశించగా ఆయన శిరసావహించారు. అప్పట్నించీ తన దత్త కుమారుడు కృష్ణారెడ్డి ఇంటనే ఉంటున్నారు. ఆదర్శప్రాయుడూ, కష్టజీవుల మనిషీ అయిన రాఘవరెడ్డి ఇటీవలే కన్నుమూశారు.

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-05-2015 Postal Regd. No L1/SD/407/13-15

# విప్లవయోధుడు సిపిఐ(ఎం) అగ్రనేత కా॥ హరికిషన్‌సింగ్ సూర్జిత్



**సిపిఐ(యం) అగ్రనాయకులు కామ్రేడ్ హరికిషన్‌సింగ్ సూర్జిత్ శతజయంతి సంవత్సరాన్ని జరపాలని విశాఖపట్టణంలో జరిగిన పార్టీ అఖిల భారత మహాసభ చేసిన తీర్మానంలోని ముఖ్యాంశాలను మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం.**

పార్టీని ఏర్పాటు చేయటంలో ముఖ్యపాత్ర పోషించిన నవరత్నాలలో ఒకరైన కామ్రేడ్ హరికిషన్‌సింగ్ సూర్జిత్ శతజయంతి సంవత్సరం 2016 మార్చి 23 తేదీతో ముగుస్తుంది. భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) 21వ మహాసభ హరికిషన్ సింగ్ సూర్జిత్ శతజయంతి ఉత్సవాలను జరపమని పిలుపునిస్తున్నది.

హరికిషన్ సింగ్ సూర్జిత్ ఏడున్నర దశాబ్దాల రాజకీయ జీవితం బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా బలమైన పోరాటాలతో ప్రారంభమైంది. భారత కమ్యూనిస్టు పార్టీ, అఖిల భారత కిసాన్ సభలకు జాతీయ నాయకునిగా గుర్తింపు పొందటానికి ముందు పంజాబ్‌లో కమ్యూనిస్టుపార్టీ, కిసాన్‌సభల నిర్మాణంలో ప్రధానపాత్ర పోషించారు. సిపిఐ(యం)లో నాలుగు దశాబ్దాల పాటుముఖ్యమైన పాత్ర నిర్వహించారు.

భగత్‌సింగ్ అమరత్వంతో ఉత్తేజం పొంది సూర్జిత్ తన విప్లవ రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1932 మార్చిలో 16 సంవత్సరాల వయస్సులో హోషియార్‌పూర్ జిల్లాకోర్టుపై మూడురంగుల జండాను ఎగురవేశారు. ఆయనను అరెస్టుచేసి బాలనేరస్తులను సంస్కరించే స్కూలుకు పంపించారు. జైలునుండి విడుదలైన తర్వాత పంజాబ్‌లో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించటానికి పూనుకున్న మొదటితరం నాయకులతో ఆయనకు సంబంధాలు వచ్చాయి. 1934లో ఆయన కమ్యూనిస్టుపార్టీలో చేరారు. 1935లో కాంగ్రెస్ సోషలిస్టుపార్టీలో సభ్యునిగా చేరారు. 1938లో పంజాబ్ రాష్ట్ర కిసాన్‌సభ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

కమూనిస్టు ఉద్యమ ప్రారంభదశలోని నాయకులందరి వలెనే ఆయన సర్వం త్యాగంచేయటానికి, కష్టాలనుభవించటానికి సిద్ధపడ్డారు. స్వాతంత్ర్యానికి ముందు ఎనిమిది సంవత్సరాలతో కలుపుకొని పది సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించారు. ఎనిమిది సంవత్సరాలు అజ్ఞాతవాస జీవితం గడిపారు.

1954 జనవరిలో జరిగిన భారత కమ్యూనిస్టుపార్టీ మూడవ మహాసభలో ఆయన కేంద్రకమిటీకి, పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. 1964లో పార్టీలో చీలిక వచ్చేవరకు ఆయన పార్టీ నాయకత్వంలో కొనసాగారు. రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడి, భారత కమ్యూనిస్టుపార్టీ(మార్క్సిస్టు)ను ఏర్పాటు చేసిన ముఖ్యనాయకులలో ఆయన కూడా ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం, రైతాంగ ఉద్యమాన్ని అభివృద్ధి చేయటంలో ఆయనకున్న అనుభవంతో కమ్యూనిస్టు ఉద్యమంలో ఎక్కడ అతివాద పెడపోకడలు వ్యక్తమైనా వాటికి వ్యతిరేకంగా పోరాడేవారు.

1959లో పంజాబ్‌లో జరిగిన బెటర్‌మెంట్ లెవి వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించారు. అఖిల భారత కిసాన్ సభకు దీర్ఘకాలం పాటు అధ్యక్షునిగానూ, కార్యదర్శిగానూ బాధ్యతలు నిర్వర్తించాడు.

1964లో జరిగిన సిపిఐ(యం) ఏడవ మహాసభలో కేంద్రకమిటి, పొలిట్‌బ్యూరోలకు ఎన్నికై, 19వ మహాసభ వరకు ఆ బాధ్యతల్లో కొనసాగారు. 1992 నుండి2005 వరకు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ కార్యక్రమం, ఎత్తుగడల విధానాన్ని అమలు చేయటంలో కీలకమైన పాత్ర నిర్వహించాడు. పార్టీ రాజకీయ విధానాన్ని ఆచరణలో పెట్టటంలో ఆయన గొప్ప నైపుణ్యాన్ని, సృజనాత్మకతను చూయించేవారు.

ఆయన జీవితాంతం మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాడు. మతోన్మాద శక్తుల నుండి భారత లౌకిక పునాదులకు ఎదురయ్యే ప్రమాదాన్ని మొదటగా గుర్తించిన నాయకుల్లో ఆయనొకడు. ఆయన నాయకత్వంలో పార్టీ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు, జాతీయ విముక్తి ఉద్యమాలకు సంఘీభావాన్ని వ్యక్తం చేసింది.

దేశ వామపక్ష ఉద్యమంలో సిపిఐ(యం)ను అతిపెద్దశక్తిగా రూపొందించటంలో సూర్జిత్ ముఖ్యమైనపాత్ర నిర్వహించాడు. 1990లో సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత గత అనుభవాల నుండి పాఠాలు నేర్చుకొంటూ పార్టీని సరైనమార్గంలో నడపటానికి ఆయన కృషి చేశారు.

సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫూడల్ వ్యతిరేక పోరాటాలలో కమ్యూనిస్టులు నిర్వహించిన పాత్రపై సెమినార్లు, చర్చాగోష్టులలాంటి వివిధ రకాలైన కార్యక్రమాల ద్వారా సూర్జిత్ శతజయంతిని జరపాలని 21వ మహాసభ నిర్ణయించింది. మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల అనుభవాలను ప్రముఖంగా ముందుకుతెచ్చే, ప్రస్తుత సవాళ్ళను ప్రజలు ఐక్యంగా ఎదుర్కోవటానికి తోడ్పడే ప్రచురణలను తీసుకురావాలని నిర్ణయించింది.

**అనువాదం ఎ.కోటిరెడ్డి**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.10, No.1. Published on May 1, 2015